జపాన్‌లో భారీ హిమపాతం



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 6 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 33 | పేజీలు:12 | వెల రూ.5

అంతరిక్షంలో డేటా సెంటర్లు



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


# కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు



**భారత్ పరపతి పెరుగుతోంది..**

ప్రపంచ దేశాలు స్వాగతిస్తున్నాయి..

**ఎన్నో సంస్కరణలు తెచ్చాం..**

చౌరబాటుదారులను రక్షిస్తున్నారు..

**రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోడీ**

**ఢిల్లీ, ఫిబ్రవరి 5:** కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోందన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోడీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నత పదవికే అవమానకరమన్నారు.

**భారత్ పరపతి పెరుగుతోంది..**

''దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు. ఈయూ కూటమితో అనేక ఒప్పందాలు చేసుకున్నాం. వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. అమెరికాతో ట్రేడ్ డీల్ తర్వాత భారత్‌కు మరింత బలం పెరుగుతుంది. మన యువతకు ఎక్కువ లబ్ధి జరగనుంది.

**ప్రపంచ దేశాలు స్వాగతం పలుకుతున్నాయి..**

తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి.

**ఎన్నో సంస్కరణలు తెచ్చాం..**

బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ

...మిగతా 2లో



# బీజేపీ, బీఆర్ఎస్‌లది ఫెవికాల్ బంధం

తెలంగాణను ఇచ్చింది సోనియాగాంధీ

తెలంగాణ అభివృద్ధికి బీజేపీ ఏం చేసింది

ఒక్క సీటైనా గెలుస్తారా? ఇక్కడ

బీఆర్ఎస్ ఇక్కడ చెల్లని నాణెం

సీఎం రేవంత్‌రెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 5: తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధిపనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లోపర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. ''తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు. ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పలేదు. తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు

...మిగతా 2లో

## మైనార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలె

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో విద్వేష ప్రసంగాల నియంత్రణ చట్టం

జమీయత్ ఉలమా సభలో సీఎం రేవంత్ రెడ్డి

2

## ఎన్నికలకు ముందు ఉచితాలపై పిల్

విచారణకు సుప్రీం అంగీకారం



**ఢిల్లీ, ఫిబ్రవరి 5:** ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఎక్కువగా ఉచితాల వైపే దృష్టిసారిస్తాయి. ఈ ఉచిత హామీలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు లో పిల్ దాఖలైంది. తాజాగా దాన్ని విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది.

న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ ఈ పిల్‌ను దాఖలు చేశారు. అందులో ఎన్నికలకు ముందు అసంబద్ధమైన 'ఉచిత' హామీలు ఇచ్చే రాజకీయ పార్టీల గుర్తులు, వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని ఆయన కోరారు. తన పిల్‌పై 2022లోనే కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ అయ్యాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా

...మిగతా 2లో

## గ్రూప్1 అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

సింగిల్ జడ్జి తీర్పు రద్దు

హైదరాబాద్,ఫిబ్రవరి 5(మనం,ప్రత్యేక ప్రతినిధి): గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు గురువారం హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈక్రమంలో నియామకాలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సీజే ధర్మాసనం రద్దు చేసింది. కాగా గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి తీర్పును వెలువరించారు. మెయిన్స్ జవాబు పత్రాలు పునర్ మూల్యాంకనం చేయాలని గతంలో పేర్కొన్నారు. సింగిల్ జడ్జి ఆదేశాలపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ), ఎంపికైన అభ్యర్థులు అప్పీల్ చేశారు. దీనిపై

...మిగతా 2లో



2

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా

సీఎం రేవంత్ రెడ్డి

## గ్రామ పంచాయతీలకు గుడ్‌న్యూస్



15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్రం ఉత్తర్వులు

తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల: మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (మనం బ్యూరో): గ్రామాల అభివృద్ధికి కీలకమైన 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వుల మేరకు గ్రామ పంచాయతీలకు తొలి విడతగా రూ.259.36 కోట్లను విడుదల చేసింది. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో గత రెండేళ్లుగా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తరువాతే పెండింగ్ నిధులు విడుదల చేస్తామని

...మిగతా 2లో

## మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సమన్వయకర్తల నియామకం

**పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (మనం బ్యూరో): త్వరలో ఎన్నికలు జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు పీసీసీ సమన్వయకర్తలను నియమించింది. ఈమేరకు గురువారం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆమోదం మేరకు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమన్వయకర్తల జాబితాను విడుదల చేశారు. ఈ సమన్వయకర్తలు ఎన్నికలు జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇప్పటికే పీసీసీ నియమించిన మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి అభ్యర్థుల విజయానికి అవసరమైన వ్యూహాలను రూపొందిస్తారు. ఈమేరకు ఆదిలాబాద్ జిల్లాలోని

...మిగతా 2లో

## నమ్మి ఓటేస్తే?.. మిమ్మల్ని నట్టేట ముంచుతరు?: కేటీఆర్

2

## పండ్లు, కూరగాయలపై సున్నా శాతమే

# 99% ఉత్పత్తులపై సుంకాలుండవ్

- కొన్నింటిపై మాత్రమే భారత్‌కు నియంత్రణ
- రష్యా చమురును నిలిపేస్తామని భారత్ అంగీకరించింది
- వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పష్టీకరణ

న్యూయార్క్, ఫిబ్రవరి 5: అమెరికా నుంచి దిగుమతి చేసుకునే 98% నుంచి 99% ఉత్పత్తులపై భారత్ సున్నా శాతం సుంకాలను అమలు చేయనుందని అమెరికా పేర్కొంది. పండ్లు, కూరగాయలుసహా వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులపై సుంకాలు ఉండబోవని స్పష్టం చేసింది. కొన్ని కీలక ఉత్పత్తులపై మాత్రం భారత్ నియంత్రణ ఉంటుందని వెల్లడించింది. మరోవైపు రష్యా

...మిగతా 2లో

## 40 ఏళ్ల తర్వాత న్యాయం నిర్దోషిగా 100 ఏళ్ల వృద్ధుడు

**అలహాబాద్, ఫిబ్రవరి 5:** దశాబ్దాల నిరీక్షణ తర్వాత 100 ఏళ్ల వృద్ధుడికి న్యాయం దక్కింది. 40 ఏళ్ల తర్వాత హత్య కేసులో అతడిని నిర్దోషిగా తేలుస్తూ అలహాబాద్ హైకోర్టు తాజాగా తీర్పునిచ్చింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం..

ఓ భూవివాదం కాస్తా తీవ్రరూపం దాల్చి, ఒకరి హత్యకు దారితీసింది. ఉత్తరప్రదేశ్‌లో 1982లో జరిగిన ఈ హత్య ఘటనలో మైకు ప్రధాన నిందితుడు కాగా.. ధనీరామ్, సత్తిదిన్ హత్యకు ప్రేరేపించారని అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసును విచారించిన హమీర్‌పూర్ సెషన్స్ కోర్టు 1984లో ధనీరామ్, సత్తిదిన్‌కు జీవితఖైదు విధించింది. మైకు మాత్రం అరెస్టు కాలేదు. సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ.. ఆ ఇద్దరు 40 ఏళ్ల క్రితం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటినుంచి ఆ పిటిషన్ పెండింగ్‌లోనే ఉండిపోయింది. అది విచారణ దశలో ఉండటంతో బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా.. మంజూరైంది. ఈ కేసు ఎటూ తేలకుండానే కొన్నేళ్లక్రితం సత్తిదిన్ మృతి చెందాడు. ఈ హత్య కేసు తాజాగా హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మైకుని అరెస్టు

...మిగతా 2లో

## మరో రెండేళ్లలో కేసీఆరే సీఎం

**బాగా చూసుకునోళ్లకే ఓటేయండి**

**ఎమ్మెల్యే హరీశ్‌రావు**

హైదరాబాద్,ఫిబ్రవరి 5(మనం,ప్రత్యేక ప్రతినిధి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో రెండేళ్లలో మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏమీ చేయరని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు

...మిగతా 2లో



## 8 గంటలు ట్రాఫిక్‌లో చివరికి హెలికాప్టర్లో..

**ముంబయి, ఫిబ్రవరి 5:** ముంబయి- పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై కొన్ని గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయిన నేపథ్యంలో ఓ వ్యాపారవేత్త కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోగా.. కొంతసేపటి తర్వాత హెలికాప్టర్ ద్వారా ఆయన అక్కడినుంచి బయటపడ్డారు. దీనికి సంబంధించి ఆయన పెట్టిన ఓ పోస్టు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంది. మహారాష్ట్రలోని రాయ్‌గడ్ జిల్లా అదోషీ టన్నెల్ సమీపంలో గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. దాని నుంచి ప్రమాదకరమైన వాయువు లీకవుతుండటంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. ఈ క్రమంలో వేల మంది వాహనదారులు ఎక్స్‌ప్రెస్‌వేపై చిక్కుకుపోయారు. అందులో ఎకా మొబిలిటీ సంస్థ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ మెహతా కూడా ఉన్నారు. ఎనిమిది గంటలకు పైగా రోడ్డుపై కారులోనే ఉండిపోయిన ఆయన.. ఆ తర్వాత అత్యవసరంగా

...మిగతా 2లో

## బొగ్గుగనిలో పేలుడు.. 10 మంది కూలీల మృతి



**షిల్లాంగ్, ఫిబ్రవరి 5:** మేఘాలయలో బొగ్గుగనిలో గురువారం భారీ ప్రమాదం జరిగింది. అందులో పేలుడు సంభవించడంతో 10 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన కథనాల ప్రకారం.. గనిలో బొగ్గు తవ్వకాలు చేపడుతోన్న సమయంలో ఈ పేలుడు జరిగింది. దాంతో కూలీలు అందులో చిక్కుకుపోయారు. వారిలో

...మిగతా 2లో



## నైజీరియాలో ఘోరం.. 200 మంది ఊచకోత



**అబూజా, ఫిబ్రవరి 5:** నైజీరియా లో సాయుధమూక నరమేధం సృష్టించింది. రెండు గ్రామాల్లోని ప్రజలపై దాడులు చేసి.. 200 మందిని అతి దారుణంగా చంపేశారు. పలు ఇళ్లు, దుకాణాలను కూడా తగలబెట్టారు. క్వారా రాష్ట్రంలోని వోరో, నూక అనే రెండు గ్రామాల్లో ఈ దాడులు జరిగాయి. వోరో స్థానిక నాయకుడు సైదు బాబా అహ్మద్ మాట్లాడుతూ.. ప్రజలను చుట్టుముట్టి, వారి చేతులను వెనక్కి కట్టి ఆ తర్వాత కాల్చి చంపేశారని తెలిపారు. దాడి సమయంలో

...మిగతా 2లో

# కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు

(మొదటి పేజీ తరువాయి)

రంగ సంస్థలకు అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ.30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ధి పొందారు. 2014 తర్వాత ప్లానింగ్ కమిషన్‌ను తీసేసి నీతిఆయోగ్‌ను తెచ్చాం. ఇది వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది.

చొరబాటుదారులను రక్షిస్తున్నారు..

అక్రమార్కులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ వలసదారులను బయటకు పంపించివేస్తున్నాయి. బెంగాల్లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారు'' అని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు.

# హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా

## సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (మనం బ్యూరో): గ్రూప్ 1 నియామకాలపై హైకోర్టు తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎవరెని కుట్రలు పన్ని ఉద్యోగ నియామకాలను అడ్డుకోవాలని చూసినా వారి కుట్రలు, కుతంత్రాలను ఛేదించి న్యాయ పోరాటంలో విజయం సాధించామని వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల కల సాకారం అయ్యే దిశగా ఇదొక గొప్ప విజయమని ఆయన అభివర్ణించారు. గ్రూప్ 1 నియామకాలపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. గ్రూప్ 1 నియామక ప్రక్రియను అడ్డుకోవడానికి ముందు నుంచీ కొన్ని శక్తులు కుట్రలు పన్నాయని విమర్శించారు. కానీ, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎన్ని కోర్టు కేసులు వేసినా చివరకు న్యాయపోరాటంలో నిరుద్యోగుల పక్షాన నిలిచిన ప్రభుత్వం విజయం సాధించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ చిత్తశుద్ధిని హైకోర్టు తీర్పు మరోసారి నిరూపించిందన్నారు. గ్రూప్ 1కు ఎంపికైన 563 మంది అభ్యర్థులకు సీఎం అభినందనలు తెలిపారు. వారి కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందనీ, భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధిలో వారు కీలక భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత భర్తీ అవుతున్న తొలి గ్రూప్ 1 అధికారులు మీరే అంటూ సీఎం అభ్యర్థులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# ఎన్నికలకు ముందు ఉచితాలపై పిల్

(మొదటి పేజీ తరువాయి)

బాగ్చీలతో కూడిన ధర్మాసనం దృష్టికి పిటిషనర్ తీసుకెళ్లారు. దీనిపై త్వరగా విచారణ జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు ఓటర్లను ప్రభావితం చేస్తాయని.. ఇది ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ఓ చట్టాన్ని రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు. ధర్మాసనం దీన్ని తీవ్రమైన సమస్యగా పేర్కొంటూ.. దీనిపై మార్చి చివరిలో విచారణ జరిపేందుకు అంగీకరించింది.

# నైజీరియాలో ఘోరం.. 200 మంది ఊచకోత

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారని.. ప్రస్తుతం వారి ఆచూకీ తెలియడం లేదని వెల్లడించారు. తాజా ఘటనకు సంబంధించి స్థానిక మీడియాలో వీడియోలు ప్రసారమయ్యాయి. అందులో వీధుల్లో పెద్దఎత్తున మృతదేహాలు పడి ఉన్నట్లు కన్పించాయి. ఈ దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.అమ్నెస్టి ఇంటర్నేషనల్ మానవ హక్కుల సంఘం ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. దుండగులు దాదాపు ఐదు నెలల నుంచి గ్రామస్థులకు హెచ్చరిక లేఖలు పంపుతున్నారని.. అయినా భద్రతాపరమైన చర్యలు తీసుకోలేదని మండిపడింది. ఇటీవల నైజీరియా సైన్యం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో ఆపరేషన్లు నిర్వహించి 150 మందిని మట్టుబెట్టింది. ఈ సైనిక చర్యకు ప్రతిస్పందనగానే తాజా దాడులు జరిగాయని క్వారా గవర్నర్ అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. దీన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఇదిలాఉండగా.. కాట్సినా రాష్ట్రంలో కూడా దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక పోలీసులు తెలిపారు.



# బీజేపీ, బీఆర్ఎస్‌లది ఫెవికాల్ బంధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు.

కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోంది. పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారు? దేశంలోని బీజేపీ అగ్రనేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో బీజేపీకి చూపిస్తాం. బీజేపీ, బీఆర్ఎస్‌ల బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం..మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే.. ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి'' అని సీఎం డిమాండ్ చేశారు. సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్1 అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

(మొదటి పేజీ తరువాయి)

విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం తాజాగా తీర్పును వెలువరించింది. గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన 562 మందికి ఇప్పటికే ప్రభుత్వం నియామక పత్రాలను అందజేసిన విషయం విదితమే.

**ఇది జరిగింది :**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) 2024 ఫిబ్రవరిలో గ్రూప్-1లో 563 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2024 అక్టోబరు 21వ తేదీ నుంచి 27 వరకు ప్రధాన పరీక్షలు(మెయిన్స్) నిర్వహించి మార్చి 30న ప్రధాన పరీక్షలో అన్ని పేపర్లకు హాజరైన 21,085 మంది అభ్యర్థుల మార్కులను టీజీపీఎస్సీ ప్రకటించింది. అర్హత పరీక్ష ఇంగ్లీష్‌తో పాటు ప్రధాన పరీక్షలైన ఆరు పేపర్ల మార్కులను వెల్లడించింది.అయితే టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్‌లో జవాబు పత్రాల మూల్యాంకనం, ఎగ్జామ్ సెంటర్ల కేటాయింపులో అవకతవకలు, తెలుగు మాధ్యమంలో జవాబులు రాసిన వారికి అన్యాయం జరిగిందంటూ పలువురు అభ్యర్థులు కొద్ది రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు సుదీర్ఘ విచారణ చేపట్టి తీర్పును వెలువరించారు. ఆన్సర్ పేపర్లు దిద్దిన వారిలో ఎక్కువ మందికి తెలంగాణ చరిత్రపై అవగాహన లేదని, దానివల్ల మార్కుల కేటాయింపులో అన్యాయం జరిగిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. సబ్జెక్ట్ నిపుణులతోనే జవాబు పత్రాల మూల్యాంకనం జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరఫు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు.

**సింగిల్ జడ్జీ తీర్పు :**

గ్రూప్1 అభ్యర్థుల పిటిషన్లపై విచారణ ముగిసిన తరువాత జవాబు పత్రాలు తిరిగి మూల్యాంకనం చేయాలని లేకుంటే మరోసారి పరీక్ష నిర్వహించాలంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం కొద్ది రోజుల క్రితం తీర్పును వెలువరించింది. ఈ తీర్పుపై టీజీపీఎస్సీ అప్పీలు చేయగా సింగిల్ జడ్జి తీర్పు అమలును హైకోర్టు నిలిపివేసింది. దీంతో కమిషన్ తుది ఎంపికకు సంబంధించిన ఫలితాలను వెల్లడించింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గ్రూప్-1 పోస్టుల నియామకాలు చేపట్టడం ఇదే తొలిసారి. తుది ఎంపికలు హైకోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని టీజీపీఎస్సీ ప్రకటించింది. మెయిన్స్ జవాబు పత్రాలు మరోసారి మూల్యాంకనం చేయాలని హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పుపై టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థుల అప్పీల్ చేశారు. గతంలో విచారణ జరిపిన ధర్మాసనం తాజాగా తీర్పును వెలువరించింది. సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ తాజాగా ఆదేశాలు జారీచేసింది.

# 99% ఉత్పత్తులపై సుంకాలుండవ్

(మొదటి పేజీ తరువాయి)

నుంచి చమురు దిగుమతులను నిలిపేస్తామని భారత్ హామీ ఇచ్చిందని వివరించింది. మంగళవారం సీఎన్బీసీ కార్యక్రమంలో భారత్తో వాణిజ్య ఒప్పందంపై అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ స్పందించారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలినా లీవిట్ మీడియాతోనూ, ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడారు.

'భారత్‌పై అమెరికా 18శాతం సుంకాలను కొనసాగిస్తుంది. ఆ దేశంతో మాకు వాణిజ్య లోటు ఉంది. వారు పలురకాల వ్యవసాయ ఉత్పత్తులు, తయారీ వస్తువులు, రసాయనాలు, వైద్య పరికరాలపై సుంకాలను తగ్గిస్తామని అంగీకరించారు. ప్రస్తుతం భారత్‌లో అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులపై సగటున 13.5 శాతం సుంకాలున్నాయి. అవి సున్నాకు చేరతాయి. కానీ బాదం, పిస్తా వంటి ఉత్పత్తులు, వైన్, ఆల్కహాల్ పానీయాలు, పండ్లు, కూరగాయలపై సున్నా శాతం సుంకాలే అమలవుతాయి. ఇది పెద్ద విజయం' అని గ్రీర్ పేర్కొన్నారు.

2022-23కు ముందు రష్యా నుంచి భారత్ ముడి చమురును దిగుమతి చేసుకోలేదు. కానీ ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమయ్యాక రష్యా ఇచ్చిన రాయితీల నుంచి లబ్ధి పొందేందుకు చమురు దిగుమతులు చేసుకుంది. ట్రంప్ హెచ్చరికలతో గత ఏడాది నుంచి చమురు దిగుమతులను తగ్గిస్తూ వస్తోంది' అని గ్రీర్ స్పష్టం చేశారు.

**మోడీతో బంధాన్ని ట్రంప్ ఆస్వాదిస్తారు...**

ప్రధాని మోడీతో బంధాన్ని ట్రంప్ ఆస్వాదిస్తారని, ఆయనపై అధ్యక్షుడికి ఎంతో గౌరవముందని శ్వేతసౌధం మీడియా కార్యదర్శి లీవిట్ పేర్కొన్నారు. 'వాణిజ్య ఒప్పందం తర్వాత భారత్పై అమెరికా 18శాతం సుంకాలను విధిస్తుంది. అమెరికా ఉత్పత్తులపై భారత్ సున్నా సుంకాలను అమలు చేస్తుంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపేస్తామని భారత్ హామీ ఇచ్చింది. అమెరికా, వెనెజువెలా నుంచి దిగుమతి చేసుకుంటామని అంగీకరించింది. అమెరికాలోని కీలక రంగాల్లో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని మోడీ హామీ ఇచ్చారు' అని వివరించారు. త్వరలో కుదరనున్న భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రెండు దేశాల విదేశాంగ మంత్రులు జైశంకర్, మార్కో రుబియో స్వాగతించారు. కీలక ఖనిజాలపై జరగనున్న సదస్సులో పాల్గొనేందుకు అమెరికా చేరుకున్న జైశంకర్.. రుబియోతో భేటీ అయ్యారు. క్వాడ్ ద్వారా ద్వైపాక్షిక, బహుళపక్ష సహకారాన్ని విస్తరించుకోవడానికి కట్టుబడి ఉన్నామని వారు తెలిపారు.



# 10 మంది కూలీల మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువమంది అస్సాంకు చెందినవారిగా తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అయితే పేలుడుకు గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. మేఘాలయలో ర్యాట్‌హోల్ మైనింగ్, అశాస్త్రీయ పద్ధతుల్లో తవ్వకాలను 2014లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధించింది. సమాంతరంగా సన్నని గుంతలు తవ్వుతూ బొగ్గును బయటకు తీసే పద్ధతినే ర్యాట్ హోల్ మైనింగ్‌గా వ్యవహరిస్తారు. ఇలా నేలలో ఇరుకైన గుంతలను తవ్వడాన్నే ర్యాట్ హోల్‌గా పేర్కొంటారు. సుమారు నాలుగు అడుగుల వెడల్పుతో మాత్రమే ఉంటుంది. కేవలం ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలడు. కాగా.. ఎన్‌జీటీ నిషేధాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

# నమ్మి ఓటేస్తే?.. మిమ్మల్ని నట్టేట ముంచుతరు?

- మరోసారి మోసపోతే? గోస పడతరు?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి: అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మున్సిపల్ ఎన్నికల కోసం మరోసారి అబద్ధాలు చెబుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటు వేస్తే? మీరు మరోసారి మోసపోయినట్లు అవుతుందని ఆయన చెప్పారు. ఈ మేరకు.. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వార్డుల ప్రజలను, పట్టణ ప్రజలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ... 'మున్సిపల్ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుబంధు వేస్తానని చెబుతున్నరు?.. అయితే, ఇలాంటి మాటలకే ఎన్ని పంట కాలాలు గడిచాయన్నారు. ఎన్నిసార్లు రైతుబంధు వేసిండో చెప్పాలన్నారు. రైతన్నల ఖాతాలో రైతుబంధు వేసేందుకు ముఖ్యమంత్రికి మున్సిపల్ ఎన్నికలు ఏ విధంగా అడ్డు వస్తున్నాయన్నారు. అయితే, కేవలం ఎన్నికలు అయిపోయేంత వరకు ఆశ చూపించి, మరొకసారి మోసం చేయడానికే రేవంత్ ఇలాంటి అబద్దాలు చెబుతున్నారన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ఓటువేస్తే.. మరోసారి మోసపోవడం ఖాయం' అని కేటీఆర్ దుయ్యబట్టారు.'ముఖ్యమంత్రికి చేతిలో అధికారం, అవకాశం ఉన్నప్పుడు?.. మాజీ సీఎం కేసీఆర్‌ను ఎందుకు తిడుతున్నారన్నారు. ప్రజలకు మంచి చేయాలి?..లేదా, ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ప్రతి అంశంలో అడ్డగోలుగా మాట్లాడటం, అబద్ధాలాడటం తప్పా?, ఈ రెండేళ్ళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మంచి పని కూడా పని చేయలేదన్నారు.

కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను తీసివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదన్నారు. గడిచిన ఈ రెండేళ్లలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన చరిత్ర కాంగ్రెస్‌దని కేటీఆర్ చెప్పారు. అయితే, మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు, వాటి ఫలాలు అందరికి దక్కుతాయని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళా మళ్లీ పొరపాటున హస్తానికి ఓటేస్తే? ప్రజలకి అటు ప్రభుత్వాన్ని, ఇటు కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే అధికారం, అవకాశం రాదని.. ఎలాగైనా ఈ మున్సిపాల్ ఎన్నికల్లో ఈ దుష్ట ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేసేలా సురుకు పెట్టకుంటే కాంగ్రెస్ పార్టీ తన మోసాలను మళ్లీ యథవిధిగా కొనసాగిస్తదని కేటీఆర్ పేర్కొన్నారు.

# జపాన్‌లో భారీ హిమపాతం

- 35 మంది మృతి

టోక్యో, ఫిబ్రవరి 5: ఉత్తర జపాన్‌లోని దాదాపు 15 ప్రాంతాలను రెండు వారాలుగా భారీ హిమపాతం ముంచెత్తుతోంది. మంచు ధాటికి దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 35 మంది మరణించగా, 300 మందికి పైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. తమ ఇంటిపై పేరుకుపోయిన మంచును తొలగించే క్రమంలో కిందికి జారిపడటం, హఠాత్తుగా గుండెపోటుకు గురవడం లాంటి కారణాలతో పలువురు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు గాయపడ్డారని పేర్కొన్నారు.

సుమారు 2 మీటర్ల మేర మంచు పేరుకుపోవడంతో దేశవ్యాప్తంగా రైళ్లు, రవాణా వ్యవస్థతో పాటు ఇతర ప్రజాసేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. 1,700కు పైగా ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయినట్లు చెప్పారు. ఇంత అధికంగా మంచు కురవడం గత 40 ఏళ్లలో ఇదే మొదటిసారని.. రానున్న రోజుల్లో హిమపాతం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

# అంతరిక్షంలో డేటా సెంటర్లు

- 10లక్షల ఉపగ్రహాలు
- మస్క్ కొత్త ప్లాన్

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: ప్రపంచ అపర కుబేరుడు, టెస్లా, స్పేస్ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం కొత్త ప్రణాళికలను ప్రకటించారు. అంతరిక్షంలో డేటా సెంటర్లు ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఇక, కక్ష్యలోకి 10 లక్షల ఉపగ్రహాలను పంపడమే తన లక్ష్యమని మస్క్ వెల్లడించారు. ఈ ప్రణాళికలకు ఆర్థిక సహకారం కోసం ఇటీవల స్పేస్ఎక్స్ సంస్థలో తన ఏఐ వ్యాపారాన్ని విలీనం చేశారు. ఈ రెండింటితో కలిసి ఏర్పాటైన సంస్థ త్వరలోనే ఐపీఓకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. ''ప్రస్తుతం అందుబాటులో ఉన్న కృత్రిమ మేధ (ఏఐ) వ్యవస్థలకు పెద్ద మొత్తంలో విద్యుత్, కూలింగ్ సిస్టమ్స్ అవసరం. ఇవి భూమిపైన పెద్ద సంఖ్యలో డేటా సెంటర్లపై ఆధారపడి పని చేస్తున్నాయి. భవిష్యత్తులో ఏఐ వినియోగం మరింత పెరిగిన తర్వాత ఈ డేటా సెంటర్లు సరిపోవు. సుదీర్ఘకాలంలో దీనికి అంతరిక్ష ఆధారిత ఏఐ ఒక్కటే పరిష్కారం. అందుకే అంతరిక్షంలో డేటా సెంటర్లను ఏర్పాటుచేయాలనుకుంటున్నా. సౌరశక్తితో వాటికి విద్యుత్ సరఫరా అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నా. ఇక, అంతరిక్ష ఆధారిత డేటా సెంటర్లకు పెద్దసంఖ్యలో శాటిలైట్లు అవసరం. అందుకే కక్ష్యలోకి 10 లక్షల ఉపగ్రహాలు పంపిస్తాం'' అని మస్క్ వివరించారు.

అయితే, మస్క్ ప్రణాళికలకు సాంకేతికంగా, ఆర్థికంగా సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చాట్‌బాట్లు, ఇతర ఏఐ టూల్స్‌ను నిర్వహించడం కోసం అంతరిక్షం నుంచి సౌరశక్తిని తీసుకోవడం వల్ల పవర్‌గ్రిడ్లపై ఒత్తిడికి తగ్గినప్పటికీ.. ఇందుకు కొన్ని సమస్యలు లేకపోలేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. డేటా సెంటర్లు పెద్ద మొత్తంలో వేడిని ఉత్పత్తి చేస్తాయని, దీంతో భూమ్మీదతో పోలిస్తే అంతరిక్షంలో కంప్యూటర్ చిప్లు మరింత వేగంగా ఓవర్‌హీట్ అవుతాయని హెచ్చరిస్తున్నారు.

ఇక, ఉపగ్రహాల సంఖ్య పెరిగితే మరో సమస్య ఎదురవుతుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కక్ష్యలో ఏదైనా ఉపగ్రహం విఫలమైతే అది ఇతర శాటిలైట్లను ఢీకొట్టే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికే స్టార్లింక్కు చెందిన దాదాపు 10వేల ఉపగ్రహాలు కక్ష్యలో తిరుగుతున్నాయి. ఇప్పుడు 10లక్షల శాటిలైట్లు ప్రయోగిస్తే.. అప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం మరింత ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

# మరో రెండేళ్లలో కేసీఆరే సీఎం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ... మనల్ని బాగా చూసుకునే వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు పందులతో ఉన్న గజ్వేల్ ఆసుపత్రి కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు.

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది కానీ వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు? కానీ, బంగారం ధర మాత్రం భారీగా పెరిగిందన్నారు. అప్పుడు బంగారం ఆశపెట్టిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట్లాడటం లేదని విమర్శించారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. సీఎం రేవంత్.. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై తిట్ల వర్షం కురిపించడం తప్ప ఆయనకి తెలిసిందేమీ లేదన్నారు.

గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి కూడా చేయలేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత రైతు బంధు ఇస్తామని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ, ఈ నెల 11 లోపు ఇవ్వకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే అభివృద్ధి విషయంలో కేసీఆర్‌తో పోటీ పడాలని సవాల్ చేశారు.

# గ్రామ పంచాయతీలకు గుడ్‌న్యూస్

(మొదటి పేజీ తరువాయి)



స్పష్టంగా ప్రకటించింది. ఇటీవలే రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలన్నింటికీ కొత్త పాలకవర్గాలు ఏర్పడ్డాయి. ఎన్నికల అనంతరం నిధుల విడుదలకు మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపారు. మార్చి 31లోపు నిధుల విడుదల కాకపోతే శాశ్వతంగా రద్దయ్యే ప్రమాదం ఉండటంతో సంబంధిత శాఖ అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి నిధులు రాబట్టే దిశగా కృషి చేశారు. అదే సమయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఇతర అధికారులు సైతం కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి నిధుల విడుదలకు కృషి చేశారు. ఈ ప్రయత్నాల ఫలితంగా కేంద్రం 15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రానికి మొత్తం సుమారు రూ.3000 కోట్ల నిధులు రావాల్సి ఉండగా, అందులో తొలి విడతగా రూ.259.36 లక్షలను విడుదల చేసింది. కాగా, 15వ ఆర్థిక సంఘం నిధుల కింద కేంద్రం రాష్ట్ర గ్రామ పంచాయతీలకు రూ.259.36 కోట్లను విడుదల చేయడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు.

# 8 గంటలు ట్రాఫిక్‌లో చివరికి హెలికాప్టర్లో..

(మొదటి పేజీ తరువాయి)

హెలికాప్టర్‌ను ఏర్పాటుచేయించుకొని ట్రాఫిక్‌లోనుంచి బయటపడ్డారు. 'ఒకే ఒక్క గ్యాస్ ట్యాంకర్ కారణంగా అనేకమంది ప్రజలు గంటలతరబడి రోడ్డు పైనే ఉండిపోయారు. ఎక్స్‌ప్రెస్‌వేపై ఇలాంటి అత్యవసర పరిస్థితుల సమయంలో వాహనాలు వెనక్కి తిరిగివెళ్లేలా.. ఎగ్జిట్ పాయింట్లు ఉండాలి. హెలిప్యాడ్ల నిర్మాణానికి రూ.10 లక్షల కంటే తక్కువ ఖర్చవుతుంది. ఎక్స్‌ప్రెస్ మార్గాల వద్ద వీటిని తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి' అని మెహతా ఎక్స్‌లో రాసుకొచ్చారు.

# 40 ఏళ్ల తర్వాత న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

నిర్దోషిగా 100 ఏళ్ల వృద్ధుడు చేయకపోవడాన్ని కోర్టు ప్రస్తావించింది. ధనీరామ్ అప్పీల్‌పై నిర్ణయంలో అసాధారణ జాప్యం, ప్రాసిక్యూషన్‌లో లోపాలను ఎత్తిచూపిన న్యాయస్థానం.. తాజాగా తీర్పునిచ్చింది. అలాగే అతడి వయసును పరిగణనలోకి తీసుకొని నిర్దోషిగా తేల్చింది.

# మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సమన్వయకర్తల నియామకం

(మొదటి పేజీ తరువాయి)

6 మున్సిపాలిటీలకు ఆరుగురు సమన్వయకర్తలు, నిజామాబాద్ కార్పొరేషన్‌కు నలుగురితో పాటు ఆ జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు ఒక్కొక్కరిని, రామగుండం, మంచిర్యాల కార్పొరేషన్‌లకు ఒక్కొక్కరిని, కరీంనగర్ కార్పొరేషన్‌కు ఇద్దరిని, మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు ఒకరిని, నల్లగొండ కార్పొరేషన్‌కు ఒకరిని, కొత్తగూడెం కార్పొరేషన్‌కు ముగ్గురిని నియమిస్తూ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.



# మైనార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలె

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (మనం బ్యూరో): త్వరలో జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికల్లో మైనార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు . పార్టీ టికెట్ ఇచ్చినప్పుడు గెలిపించుకునే బాధ్యత మీదేనని స్పష్టం చేశారు. గురువారం రాత్రి శంషాబాద్‌లో జమీయత్ ఉలమా యే హింద్ సంస్థ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా హాజరైన సీఎం మాట్లాడుతూ జమీయత్ ఉలమా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న సంస్థ అనీ, మైనార్టీలు, మెజారిటీ ప్రజలు కలిసి ముందుకు వెళ్లడానికి సంస్థ పాటుపడుతుందన్నారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎన్నికల్లో నేను పోటీ చేసినప్పుడు జమియత్ సంస్థ స్వచ్ఛందంగా సహకరించిందనీ, గల్లీ నుంచి ఢిల్లీ వెళ్లడానికి తోడ్పడిందని పేర్కొన్నారు. లోక్‌సభలో రాహుల్‌కు తోడుగా మోడీ, అమిత్ షా పైన పోరాటం చేశామనీ, మైనార్టీల అండతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక మంది మైనార్టీ నతేలకు అవకాశం ఇచ్చిందనీ, రాష్ట్రంలో అజారుద్దీన్, షబ్బీర్ అలీ లాంటి వాళ్లకు మంత్రి పదవులు ఇచ్చిందన్నారు. 8 కార్పొరేషన్లను మైనార్టీలకు ఇచ్చామనీ, పార్టీ టికెట్ ఇచ్చినప్పుడు అభ్యర్థులను గెలిపించే బాధ్యత కూడా మీదేనని స్పష్టం చేశారు. విద్వేష ప్రసంగాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందనీ, దీని నియంత్రణ కోసం వచ్చే అసెంబ్లీ సమావేశాలలో చట్టం తీసుకురాబోతున్నామని వెల్లడించారు. దేశం అభివృద్ధి చెందాలంటే అంతా కలిసి మెలిసి ముందుకు సాగాలనీ, పెట్టుబడులు రావాలంటే శాంతి భద్రతల పరిరక్షణ ముఖ్యమని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ రాష్ట్రంలో మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారనీ, ఆ అంశం ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉందన్నారు. సుప్రీం కోర్టులో నాలుగు శాతం రిజర్వేషన్ల కేసు వచ్చినప్పుడు మైనార్టీ జనాభా లెక్కలను అందజేస్తామన్నారు. మైనార్టీలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్ షా అంటున్నాడనీ, ఆయనకు దమ్ముంటే రాష్ట్రంలో అధికారంలోకి రావాలని సవాల్ విసిరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఒక పార్టీ అవయవదానం చేయడం వల్ల బీజేపీ ఓట్ల శాతం భారీగా పెరిగిందనీ ఇకపై అలాంటి పరిస్థితి రానివ్వమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# అతిధ్యం..అదిరిపోవాలె..!



- పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ నిర్వహణపై సమీక్ష
- వచ్చే నెల 23 నుంచి ఏప్రిల్ 5 వరకు ఫుట్‌బాల్ మ్యాచ్‌లు
- 2100 మంది క్రీడాకారులకు వసతులు, సౌకర్యాలు
- రాష్ట్ర డీజీపీ బి.శివధర్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్: ఫిబ్రవరి 5(మనం,ప్రత్యేక ప్రతినిధి): :తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యమివ్వనున్న '74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌కు సంబంధించి వసతులు, సౌకర్యాలు అదిరిపోవాలని రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి వెల్లడించారు. ఈక్రమంలో తన కార్యాలయంలో గురువారం సంబంధిత పోలీస్ అధికారులతో డీజీపీ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందన్నారు. ఈ నేపథ్యంలో పోటీల నిర్వహణపై జరుగుతున్న ఏర్పాట్లతో పాటు సౌకర్యాలపై పోలీసు అధికారులకు సూచనలు,సలహాలిచ్చారు. మార్చి 23 నుంచి ఏప్రిల్ 5 వరకు హైదరాబాద్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుందని , దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర భద్రతా బలగాల నుంచి 53 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సుమారు 2100 మంది క్రీడాకారులు, అధికారులు భాగస్వాములు కాబోతున్నారని తెలియజేశారు. మార్చి 23న జట్లన్నీ నగరానికి చేరుకుంటాయని, మార్చి 25న మధ్యాహ్నం 3 గంటలకు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రారంభ వేడుకలు నిర్వహిస్తామన్నారు.

**మైదానాల తనిఖీ :**

74వ బి.ఎన్ మల్లిక్ మెమోరియల్ ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల నిర్వహణ కోసం హైదరాబాద్ పరిసర ప్రాంతాలలోని మైదానాలను తనిఖీ చేశామని డీజీపీ తెలిపారు. ఈక్రమంలో కొన్ని మైదానాలను కొన్ని మ్యాచ్‌ల కోసం, మరికొన్ని మైదానాలను ప్రాక్టీస్ కోసం ఎంపిక చేశామన్నారు. గచ్చిబౌలి స్టేడియం, తెలంగాణ పోలీస్ అకాడమీలలోని వంటి మైదానాలలో అత్యధిక పోటీలు జరగనున్నాయని తెలిపారు. పోటీల నిర్వహణ కోసం వివిధ కమిటీలు పనిచేస్తున్నాయని, క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వసతి, రవాణా సౌకర్యాలను పకడ్బందీగా ఏర్పాటు చేశామని డిజిపి పేర్కొన్నారు.

**ఘనంగా ముగింపు వేడుకలు :**

ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో భాగంగా ఏప్రిల్ 5న ఫైనల్ మ్యాచ్ అనంతరం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు డీజీపీ చెప్పారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ క్రీడాకారులతో ఎగ్జిబిషన్ మ్యాచ్ ను నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. గత ఏడాది 73 వ బి.ఎన్ మల్లిక్ ఆల్ ఇండియా పోటీలను నిర్వహించిన త్రిపురరాష్ట్రానికి వెళ్లి వచ్చిన పోలీస్ అధికారులతో సంబంధిత వివరాలను సేకరించామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే జట్లు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 10 వరకు ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు అధికారిక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటాయని వివరించారు. దేశవ్యాప్త పోలీస్ బలగాల మధ్య క్రీడా స్ఫూర్తిని, ఐక్యతను పెంపొందించేలా ఈ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత పోలీస్ అధికారులకు స్పష్టం చేశామన్నారు. సమీక్షలో తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబరాబాద్ సీపీ ఎం. రమేష్, హైదరాబాద్ అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, ఐజీపీ , స్పోర్ట్స్ గజరావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నాగులపల్లి గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో బన్సీలాల్..

**అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించిన ఎంపీడీవో**



**షాద్ నగర్ ఫిబ్రవరి 05(మనం న్యూస్):** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో ఎంపీడీవో బన్సీలాల్ గురువారం గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీ, డ్వాక్రా మహిళా భవన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బన్సీలాల్ మాట్లాడుతూ నాగులపల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనం , క్రీడా ప్రాంగణం, నర్సరీ, డ్వాక్రా మహిళ భవన పనులను మరింత వేగవంతం చేయడానికి నూతన పాలకమండలి నాయకులు మరింత కృషి చేయాలని అన్నారు.

గ్రామ పరిధిలోని ప్లాస్టిక్ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్స్ నిషేధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పలు గ్రామాల్లో తాను సందర్శించినా ఇంత వేగంగా నాగులపల్లి గ్రామంలో మాత్రం పల్లె ప్రకృతి వనం పచ్చని వనంలా తీర్చిదిద్దారని నాగులపల్లి గ్రామ సర్పంచ్ నాల్లపురం రాధిక అశోక్ రెడ్డిని ఎంపీడీవో అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరి శంకర్,నాగులపల్లి గ్రామ సర్పంచ్ నాల్లపురం రాధిక అశోక్ రెడ్డి, వార్డు సభ్యులు గోడల భౌరయ్య, కారోబార్ నరసింహ, గ్రామ యువకులు ఆవుల నర్సింహారెడ్డి, గ్రామ సిబ్బంది వేముల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**సంగారెడ్డి ఫిబ్రవరి 05 మనం న్యూస్ ప్రతినిధి :-** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్ సమక్షంలో గురువారం నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు.

ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న సంగారెడ్డి, సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ - జోగిపేట్, ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, గడ్డపోతారం, జిన్నారం మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, డిఇఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## బైకు దొంగ అరెస్టు

- రిమాండ్ కు తరలింపు

**షాద్ నగర్ ,పిబ్రవరి 05(మనం న్యూస్):** రంగారెడ్డి మహబూబ్ నగర్ జిల్లాలలో తన చేతివాటంతో తాళాలు వేసిన బైకులను దొంగిలించే నేరస్తుని బుధవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. తాళాలు వేసిన ఇళ్ళ ముందు నిలిపి ఉంచిన బైక్లను టార్గెట్ చేసుకొని భారీగా దొంగతనాలకు పాల్పడుతున్న శివలింగమును షాద్ నగర్ డిసిపి ఆదేశాల మేరకు సీఐ విజయ్ కుమార్ గురువారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఓ ఇంటి ముందు నిలిపి ఉన్న బైకు కనబడకపోవడంతో రాఘవేందర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా..కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో నిందితునిపై రంగారెడ్డి మహబూబ్నగర్ జిల్లాలలో 30 కేసులు ఉన్నట్టు గుర్తించి ఐదు బైకులను స్వాధీన పరచుకున్నారు. ఈ కార్యక్రమంలో విచారణ అధికారి జి. శివారెడ్డి ,క్రైమ్ టీం, రవీందర్ ,మోహన్, కర్ణాకర్ ,జాకీర్ ,రాజు, సంతోష్ కేసును చేదించడంలో కీలక పాత్ర పోషించినారు. వారికి తగిన రివార్డులను పై అధికారుల ద్వారా ఇప్పించండి జరుగుతుందని ఉన్నత అధికారులు తెలిపారు.




# ఆ సర్టిఫికెట్(రద్దు).. వెనక్కి తీసుకోండ్రి

- హార్వర్డ్ వర్సిటీకి ఆర్ఎస్ ప్రవీణ్ లేఖ

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ఇటీవల జారీ చేసిన సర్టిఫికెట్‌పై తీవ్ర వివాదం రేపుతోంది. ఈ సర్టిఫికెట్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, అదే యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గురువారం హార్వర్డ్ అధ్యక్షుడికి, డీన్‌కు ఘాటైన ఈ-మెయిల్ పంపారు. దేశంలోనే అత్యధికంగా 89 క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న, ఓటుకు నోటు కేసులో ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికి, జైలు జీవితం గడిపిన వ్యక్తికి హార్వర్డ్ సర్టిఫికెట్ ఇవ్వడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రవీణ్ కుమార్ తన లేఖలో సీఎం రేవంత్ రెడ్డి ట్రాక్ రికార్డును ప్రస్తావిస్తూ తీవ్రమైన ఆరోపణలు చేశారు. 'దేశంలో ఏ ముఖ్యమంత్రి ఎదుర్కోనన్ని క్రిమినల్ కేసులు (89) ఎదుర్కొంటూ, ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి దొరికి, దాదాపుగా 50 రోజులు జైలులో గడిపి, ఇప్పుడు సీఎంగా పలు కుంభకోణాలకు పాల్పడుతూ, తెలంగాణ ప్రజల మీద ప్రతీకారం తీర్చుకుంటుండ్రు. ప్రతిచోటా ప్రత్యర్థులపై అభ్యంతరకరమైన భాషను ప్రయోగిస్తున్న ఇలాంటి రాజకీయ నాయకుడు 21వ శతాబ్దానికి పనికిరాడు?. ప్రాచీన రాతి యుగంలో కూడా ఇలాంటి నాయకులు ఉండి ఉండరన్నారు. ఇంతటి ట్రాక్ రికార్డు ఉన్న నాయకుడికి హార్వర్డ్ యూనివర్సిటీ సర్టిఫికెట్ ఇవ్వడం దేనికి సంకేతం?' అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తాను హార్వర్డ్‌కు పంపిన ఈ-మెయిల్ సారాంశాన్ని ఆయన మీడియాకు విడుదల చేశారు.

**గౌరవనీయ అధ్యక్షులు మిస్టర్ అలన్ గార్బర్... డీన్ మిస్టర్ వెయినీస్టీన్‌లకు అంటూ లేఖ రాశారు**

హార్వర్డ్ కెన్నెడీ(హెచ్‌కేఎస్) స్కూల్ పూర్వ విద్యార్థిగా (ఎంసీ ఎంపీఏ 2012) ఎడ్వర్డ్ ఎస్ మాసన్ ఫెలో)గా నేను ఈ లేఖను రాస్తున్నానన్నారు. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి '21వ శతాబ్దంలో నాయకత్వం.. గందరగోళం, సంఘర్షణ, ధైర్యం' అనే ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లో సర్టిఫికెట్ ఇవ్వడాన్ని తా(నే)ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానన్నారు. మీ ఈ నిర్ణయం, సంస్థాగత బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా ఉందన్నారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ విశ్లేషించిన అఫిడవిట్ల ప్రకారం, రెడ్డిపై 89 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. ఇది భారత దేశంలో కెల్లా ముఖ్యమంత్రుల్లోనే అత్యధికం అన్నారు. వీటిలో 72 తీవ్రమైన ఐపీసీ సెక్షన్ల కింద నమోదైన కేసులున్నాయన్నారు. ఇక, 2015లో అత్యంత భారీస్థాయిలో అపఖ్యాతి పాలైన ఓటుకు నోటు కుంభకోణంలో, తోటి శాసనసభ్యుడికి లంచం ఇవ్వజూపుతుండగా తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారన్నారు. ఇంతటి నీచానికి ఒడిగట్టిన ఈ కేసులో ఆయన అరెస్ట్ అయి, దాదాపు 50 రోజులు పాటు జైలులో ఉన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఇక, అలాంటి వ్యక్తి ఇప్పుడు, ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపిస్తూ, బహిరంగంగా కుల, మతపరమైన విభజన రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రత్యర్థులపై, వారి కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన, అత్యంత పరుష చేప్పలేని భాషలో బూతులు తిడుతున్నారని తన లేఖలో పేర్కొన్నారు. ప్రత్యర్థులను వేధించడానికి కూడా తప్పుడు కేసులను ఆయుధంగా వాడుతున్నారన్నారు. ఆయన ప్రవర్తన హెచ్‌కేఎస్ తన తరగతి గదుల్లో నేర్పుతుందని చెప్పుకునే నైతిక నాయకత్వం, నాగరికత, ప్రజాసేవ వంటి విలువలను అపహాస్యం చేస్తోందన్నారు.

## ఈఈ ని కలిసిన చిలుక ఉపేందర్ రెడ్డి

**రంగారెడ్డి, ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** సరూర్ నగర్ లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్ ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఈఈ ని డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలోని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లగా, వారు మాట్లాడుతూ అన్నీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తున్నామని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ యాదవ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాబు, భాస్కర్ రెడ్డి, లింగ స్వామి గౌడ్, మామిడి రామకృష్ణ, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్కీంలు నిల్.. స్కాంలు ఫుల్..




**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తనదైన శైలిలో తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు? కానీ, స్కాం క్యాలెండర్ మాత్రం ఇచ్చారని ఆయన విమర్శించారు. గ్యారంటీ స్కీంలు నిల్.. స్కాంలు ఫుల్ అంటూ ఆరోపించారు. 12 నెలల్లో 12 స్కాంలకు పాల్పడారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా ఉద్యోగాలు ఇస్తా.. జాబ్ క్యాలెండర్ తెస్తానని నిరుద్యోగులను నమ్మించి ఓట్లు పొందారని ఆరోపించారు. జనవరిలో సివిల్ సప్లై స్కాం, ఫిబ్రవరిలో ఎన్‌టీపీసీ ఫ్లైయాస్ స్కాం, మార్చిలో శ్యాండ్ స్కాం, ఏప్రిల్లో ఆర్టీసీ కాంట్రాక్టర్ల స్కాం, మేలో బామ్మర్థికిచ్చిన అమృత్ టెండర్లలో, జూన్‌లో ఫోర్త్ సిటీ, జులైలో లగచర్ల సెంట్రల్ వర్సిటీ, ఆగస్టులో పీజీ మెడికల్ సీట్ల స్కాం, సెప్టెంబర్లో 5లక్షల కోట్ల హిల్ట్ పీ ఇండ్రస్టియల్ భూములు, అక్టోబర్‌లో పవర్, నవంబర్‌లో సింగరేణి , డిసెంబర్‌లో కేఎల్ఎస్ఆర్ స్కాంలకు పాల్పడ్డారని హరీశ్‌రావు ఆరోపించారు. ఇక, ఒక్కనాడు కూడా రైతుల గురించి ముఖ్యమంత్రి మాట్లాడలేదని ఆయన విమర్శించారు. గురుకులాల్లో పాముకాటులతో, కల్తీ ఆహారంతో పిల్లల ప్రాణాలు పోతుంటే రేవంత్ రెడ్డి మాట్లాడిండా? అంటూ ప్రశ్నించారు. 20 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్ ఊసు కూడా ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా కేసీఆర్‌పై మాత్రం ఎడా పెడా పి(ప)చ్చి బూతులు మాట్లాడుతాడని హరీశ్ ఎద్దేవా చేశారు.

## ప్రశాంత వాతావరణంలో మున్సిపాలిటి ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- పటిష్ట భద్రతా ఏర్పాట్లు.
- అదనపు ఎస్పీ రఘునందన్ రావ్.

**సంగారెడ్డి ఫిబ్రవరి 5 మనంప్రతినిధి:** జిల్లా వ్యాప్తంగా 11 మున్సిపాలిటీ లలో ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికలను ప్రశాంత వాతారణంలో నిర్వహించేదుకు అన్నిరకాల భద్రత ఏర్పాట్లను చేసినట్లు అదనపు ఎస్పీ రఘునందన్ రావ్ వివరించారు. సమస్యాత్మక, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి, నిఘా కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. ఎస్.హెచ్.ఓ లు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగ్ డే రోజున ఎలాంటి వాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన అన్ని రకాల భద్రత చర్యలను తీసుకోవాలని, ప్రహరీ గోడ లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి, తాత్కాలిక ప్రహరీలను ఏర్పాటు చేసేలా చూడాలని అన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే మద్యం, డబ్బుల, మరే ఇతరములు పంపిణీ చేసినా, ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

సోషల్ మీడియాలో, ఇతర ప్రసార మాధ్యమాలలో వ్యక్తులను గాని, రాజకీయ పార్టీలను గాని కించపరిచేలా తప్పుడు ప్రచారాలు చేసినా అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు.

## చర్చల ద్వారానే.. తెలుగు రాష్ట్రాల నీటి సమస్యలు పరిష్కారం

- బీఆర్ఎస్ రాజకీయాలను కాంగ్రెస్ తిప్పికొట్టాలి
- టీ టీడీపీ అధికార ప్రతినిధి దుర్గాప్రసాద్



**హైదరాబాద్, ఫిబ్రవరి 5(మనం బ్యూరో):** ఏపీ-తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కృష్ణా, గోదావరి జలాల అంశం చర్చల ద్వారానే పరిష్కారం అవుతుందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దుర్గా ప్రసాద్ అన్నారు. రాజకీయ పరమైన అంశాలను పక్కనబెట్టి ఇరు ప్రాంతాల రైతులు, తెలుగు ప్రజలను దృష్టిలో ఉంచుకుని చర్చల ద్వారా నీటి వాటాలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. గురువారం ఇక్కడి టీ టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లమలసాగర్ వల్ల గోదావరి జలాలు కృష్ణాలో అనుసంధానం చేయడం వల్ల మిగులు జలాల నీటిని తెలంగాణ తిరిగి తీసుకోవచ్చని అభిప్రాయ పడ్డారు. ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్ ప్రాజెక్టుల అంశం కూడా రాజీ మార్గం ద్వారానే ఓ కొలిక్కి వస్తుందన్నారు. నీటి వాటాల విషయంలో బీఆర్ఎస్ రాజకీయాన్ని పసిగట్టని కాంగ్రెస్ పార్టీ కూడా అదే దారి ఎంచుకుందనీ, ఎవరెన్ని రాజకీయాలు చేసినా సమస్యను పరిష్కరించే బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఉంటుందని స్పష్టం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చర్చలకు ముందుకు రావాలని కోరారు. విభజన అంశాలతో పాటు 9,10 షెడ్యూల్‌లోని అంశాలు కూడా త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందనీ, ఈ దిశగా ఇరు రాష్ట్రాలు ముందుకు రావాలని ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ కోరారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

**ఆల్ ఇండియా ఫైర్ స్పోర్ట్స్ విజేతలకు ఫైర్ డీజీ సత్కారం**



**హైదరాబాద్,ఫిబ్రవరి 5(మనం,ప్రత్యేక ప్రతినిధి):** క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ స్పష్టం చేశారు. ఈక్రమంలో 1వ ఆల్ ఇండియా ఫైర్ సర్వీస్ స్పోర్ట్స్ మీట్-2026లో విజయం సాధించిన విజేతలకు విక్రమ్ సింగ్ మాన్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలు జనవరి 26 నుండి జనవరి 31 వరకు రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్‌లోని మహారాణా ప్రతాప్ ఖేల్ గావ్ వేదికగా నిర్వహించిన పోటీలలో తెలంగాణ ఫైర్ సర్వీసెస్ బృందం వివిధ విభాగాల్లో మొత్తం 3 పతకాలు సాధించిందన్నారు. వరంగల్ ఫైర్ స్టేషన్‌కు చెందిన ఫైర్ ఫైటర్ పి. అశోక్

40 పైబడిన వయో వర్గంలో 5000 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించాడన్నారు. అలాగే 1500 మీటర్ల పరుగులో కాంస్య పతకం దక్కించుకోవడం అభినందనీయమన్నారు. అలాగే సాధించారు. ఫైర్ ఫైటర్ (టెక్నికల్) జి. కుమార స్వామి 30 పైబడిన వయో వర్గం 5000 మీటర్ల పరుగులో వెండి పతకం గెలుచుకున్నారన్నారు. అలాగే తెలంగాణ ఫైర్ సర్వీసెస్ సిబ్బంది బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, షాట్‌పుట్ , స్టైయిర్ రన్, లాంగ్ జంప్ వంటి పలు క్రీడా విభాగాల్లో కూడా వివిధ వర్గాల్లో పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు.ఈ సందర్భంగా డీజీఎఫ్ఎస్ బృంద సభ్యుల కృషిని ప్రశంసిస్తూ, విజయవంతమైన ప్రదర్శనకు వారిని సత్కరించడం జరిగిందన్నారు. ఫైర్ విభాగం సిబ్బంది క్రీడలను తమ నిత్యజీవితంలో భాగంగా తీసుకోవాలని, క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని డీజీఎఫ్ఎస్ పేర్కొన్నారు.

## కార్మికుల పోరాటానికి విజయం

**మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి జోక్యంతో సమస్య పరిష్కారం**

**హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్‌లో కార్మికులకు డైలీ జీతం రూ.85-180 పెంపు**



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేటలో ఉన్న హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ కంపెనీలో కార్మికులు చేపట్టిన జీతాల పెంపు ధర్నా విజయవంతంగా ముగిసింది. ఎమ్మెల్యేల జోక్యంతో కార్మికుల సమస్యకు సానుకూల పరిష్కారం లభించింది. గత కొన్ని సంవత్సరాలుగా హెచ్బీఎల్ ఇంజనీరింగ్ కంపెనీలో సుమారు 1200 మంది కార్మికులు కాంట్రాక్ట్ లేబర్గా అతి తక్కువ జీతాలతో పనిచేస్తూ, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా జీవనం కొనసాగించడం కష్టంగా మారిన పరిస్థితుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో డైలీ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కార్మికులు గత మూడు రోజులుగా కంపెనీ ఎదుట ఐక్యంగా ధర్నా చేపట్టారు. కార్మికుల ఆవేదనను గుర్తించిన ఎమ్మెల్యేలు కార్మికుల తరపున కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఎమ్మెల్యేల చొరవతో హెచ్బీఎల్ ఇంజనీరింగ్ కంపెనీ మేనేజర్ శ్రీకాంత్ ద్వారా యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి, ప్రస్తుతం కార్మికులకు అందిస్తున్న డైలీ నగదు వేతనంపై రూ.85-180 పెంపు చేయడానికి అంగీకారం సాధించారు. ఈ నిర్ణయంతో కార్మికుల్లో ఆనందం వెల్లివిరిసింది. తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయించినందుకు ఎమ్మెల్యేలకు కార్మికులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.



## డివిజన్ లో పర్యటించిన జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**రంగారెడ్డి ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** రామకృష్ణ పురం డివిజన్ విజయపూరి కాలనీలో గత కొన్ని రోజులుగా వర్షపు నీరు , డ్రైనేజీ పొంగిపొర్లుతు దుర్భారమైన వాసనాతో కాలని ప్రజలకు ఇబ్బంది పడుతున్న తరుణంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కి విన్నపం చేసిన కాలని అసోసియేషన్...ఈ సందర్భంగా జిహెచ్ఎంసి అధికారలను పర్యటన చేసి సమస్యను పరిష్కారం చేయాలనీ కోరడంతో వెంటనే స్పందించి సమస్యల పరిష్కారం కొరకు జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి కాలనిలో పర్యటన చేసి త్వరలో సమస్యలను పరిష్కారం చేస్తామని అన్నారు....

ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ డిసి శ్రీనివాస్,జిహెచ్ఎంసి అధికారులు, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమళ్ళ రామ్ నరసింహ గౌడ్, కాలనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మనం Manam



## చెట్టు కన్నీరొలికింది...!

జనాల మధ్యన వుండటానికి
చెట్టు ఎందుకో భయపడుతోంది
కొమ్మ చాటు సేద తీరే మనిషిలో
రెమ్మల్ని తుంచే ఆలోచన
బుసలు కొడుతూ లేస్తుంటే
చెట్టు గుండె గుభేలుమంటోంది

వనాల్ని తరిగి జనాలు పోగైతుంటే
ప్రకృతి వికృతితో విలవిలబోతుంటే
వృక్షం భవిష్యత్తు ఊహించుకుని
నీరు తాగడం మానేసి కూర్చుంది
పోషించాల్సిన చేతులు కాటేస్తూ
విషాన్ని చిమ్మి చంపేస్తూ వెళ్తుంటే
చెట్టు కన్నీటి పర్యంతమైంది

ఊపిరి పోసే చెట్టును కాదనుకుని
కృత్రిమ శ్వాసతో మనిషి బ్రతుకు
బలవంతాన సాగిపోతుంటే
చెట్టు హృదయం ద్రవించింది
మొక్క వుండాల్సిన ఇంటి ముందు
కుక్కను పెంచుతూ ఆనందిస్తుంటే
వృక్ష జాతి ఫక్కున నవ్వుకుంది

ఎడారి ప్రాంతంలో తడారిపోతూ
ఎండు పుల్లల్లాంటి జీవనాల్ని చూసి
చెట్టుకు చింత ఆకాశమంతైంది
చెట్లు కరువైన ఊరి పొలిమేర
ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతుంటే
ఆ ప్రాంతం నోటిపైన వేలేసుకుంది
చెట్టు లేని చోటు చేటు కదరా అని
ఒక్కరైనా చెప్పకపోతారా అని
చెట్టు చెవుల్ని రిక్కించి కాచుంది

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# ఋతుక్రమ విద్యపై కొత్త ఆశలు



భారత అత్యున్నత న్యాయస్థానం ఋతుక్రమ ఆరోగ్యాన్ని ఒక ప్రాథమిక హక్కుగా ప్రకటించి, దేశ వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ఉచిత శానిటరీ సౌకర్యాలను కల్పించాలని ఆదేశించినప్పుడు, అది కేవలం ఒక సాధారణ తీర్పుగా మాత్రమే మిగిలిపోలేదు. దశాబ్దాలుగా సామాజిక వివక్షకు గురవుతున్న కోట్లాది మంది పౌరుల పట్ల జరుగుతున్న ఒక దీర్ఘకాలిక అన్యాయాన్ని సరిదిద్దే దిశగా ఇది ఒక నైతిక హెచ్చరికగా నిలిచింది. చాలా కాలంగా మన సమాజంలో ఋతుక్రమం అనేది కేవలం ఒక వ్యక్తిగత ఇబ్బందిగా, రహస్యంగా ఉంచాల్సిన అపరాధంగా, లేదా పారిశుద్ధ్యానికి సంబంధించిన అంశంగా మాత్రమే పరిగణించబడింది. కొన్ని సందర్భాల్లో ఇది కేవలం దానధర్మంగా లేదా సేవా కార్యక్రమంగా చూడబడింది. కానీ, ఈ చారిత్రాత్మక తీర్పు ద్వారా రాజ్యాంగంలోని 21వ అధికరణం కింద ప్రతి వ్యక్తికి లభించే గౌరవం, శారీరక స్వయంప్రతిపత్తి, సమాన అవకాశాలకు సంబంధించిన ప్రాథమిక హక్కు అని స్పష్టమైంది. ఈ చట్టపరమైన గుర్తింపు ఎంత గొప్పదైనప్పటికీ, అసలైన పరీక్ష ఈ తీర్పును సామాన్య ప్రజల దైనందిన జీవితాల్లో వాస్తవిక మార్పుగా మార్చడంలోనే దాగి ఉంది.

భారతదేశం వంటి విశాలమైన దేశంలో ఋతుక్రమం అనేది వందల మిలియన్ల మంది జీవితాలను ప్రభావితం చేసే అంశం. గణాంకాలను పరిశీలిస్తే, మన దేశంలో సుమారు 39.3 కోట్ల మంది ఋతుక్రమం పొందే వ్యక్తులు ఉన్నారు. ఇంత భారీ సంఖ్యలో ఉన్న పౌరుల అవసరాలను తీర్చాలంటే మన ప్రభుత్వ విధానాలు కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని ఇచ్చేవిగా ఉండకూడదు. అవి హక్కుల ఆధారితమైనవిగా, వ్యవస్థాగత మైనవిగా మరియు సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకుపోయేలా ఉండాలి. ఆచరణలో ఈ తీర్పు విజయవంతం కావాలంటే మొదటగా మన సరఫరా వ్యవస్థలో సమూల మార్పులు రావాలి. ప్రస్తుతం పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్‌ల సరఫరా చాలా తక్కువగా ఉంది. కేవలం ప్యాడ్‌లు అందించడమే కాకుండా, పునర్వినియోగపరచదగిన మరియు పర్యావరణానికి తక్కువ హాని చేసే ఎంపికలను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఇటువంటి ఉత్పత్తులను తయారు చేసే చిన్న చిన్న సంస్థలకు మరియు స్టార్టప్‌లకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు



అందించాలి, తద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో అందరికీ ఇవి సరసమైన ధరలకే లభిస్తాయి.

ఋతుక్రమ ఆరోగ్యాన్ని కేవలం పారిశుద్ధ్యం అనే ఒక చిన్న పరిధిలో బంధించకూడదు. ఇది ఆరోగ్య వ్యవస్థలు, విద్యా విధానం, కార్మిక చట్టాలు మరియు విపత్తు నిర్వహణ ప్రణాళికల్లో అంతర్భాగం కావాలి. కేవలం ఒకే మంత్రిత్వ శాఖపై భారం వేయకుండా కార్మిక, ఆరోగ్య మరియు విద్యా శాఖల మధ్య పటిష్టమైన సమన్వయం ఏర్పడాలి. తద్వారా క్షేత్రస్థాయిలో అమలును పర్యవేక్షించవచ్చు. దీనికి తోడు, ఋతుక్రమ సంబంధిత రుగ్మతలను గుర్తించడం మరియు వాటికి చికిత్స అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా మారాలి. ముఖ్యంగా పిసిఓఎస్ **(PCOS)**, ఎండోమెట్రియోసిస్ వంటి తీవ్రమైన సమస్యల గురించి అవగాహన కల్పించి, ఆరోగ్య కేంద్రాల ద్వారా తగిన సేవలు అందించాలి.

విద్య పరంగా చూస్తే, ఈ అవగాహన అనేది చిన్న వయస్సు నుంచే ప్రారంభం కావాలి. కనీసం ఏడు నుండి ఎనిమిది ఏళ్ల వయస్సు నుంచే బాల బాలికలకు పాఠశాలల్లో ఋతుక్రమ విద్యను బోధించాలి. దీనివల్ల బాలికలు తమ మొదటి ఋతుక్రమం సమయంలో భయాందోళనలకు గురికాకుండా ఉంటారు. బాలురను కూడా ఈ అవగాహనలో భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో నెలకొన్న సిగ్గు బిడియం మరియు సామాజిక వివక్షను సమూలంగా తొలగించవచ్చు. కేవలం ఉత్పత్తులను అమ్ముకోవడం కోసం చేసే ప్రకటనల కంటే, ప్రవర్తనా మార్పు తీసుకు వచ్చే వ్యూహాలను రూపొందించడం అత్యవసరం.

మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే సమ్మిళితత్వం. ఋతుక్రమం పొందే వారందరినీ ఒకే కోణంలో చూడటం సరికాదు. పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, నాన్-బైనరీ వ్యక్తులు మరియు మెనోపాజ్ దశకు చేరుకున్న కార్మికులు-వీరందరికీ భిన్నమైన అవసరాలు ఉంటాయి. ప్రభుత్వం సేకరించే ఏ డేటా అయినా వైకల్యం, కులం మరియు లింగ గుర్తింపు ఆధారంగా విభజించబడి ఉండాలి. అప్పుడే ప్రతి వర్గానికి సరైన న్యాయం జరుగుతుంది. విపత్తుల సమయంలో, అంటే వరదలు వచ్చినప్పుడు లేదా తీవ్రమైన నీటి కొరత ఉన్నప్పుడు, ఋతుక్రమ అవసరాలు అస్సలు పట్టించుకోబడవు. ఇటువంటి అత్యవసర సమయాల్లో కూడా ఋతుక్రమ ఆరోగ్య అవసరాలను విపత్తు నిర్వహణ ప్రణాళికలో ఒక ప్రాధాన్యత అంశంగా గుర్తించాలి. ఈ మార్పులన్నీ జరగాలంటే పీరియడ్స్ సమస్యను కేవలం 'దానధర్మం' తో పరిష్కరించలేము. దీనికి పటిష్టమైన ప్రజా ఆరోగ్య వ్యవస్థలు, శిక్షణ పొందిన నిపుణులు మరియు చట్టబద్ధమైన హక్కులు అవసరం.

కోర్టు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పు కేవలం ఒక ఆశగా మిగిలిపోకూడదు. పార్లమెంటు దీనిని అమలు చేయదగిన చట్టంగా మార్చాలి. శానిటరీ మౌలిక సదుపాయాలు, నిధుల కేటాయింపు మరియు వివిధ శాఖల జవాబుదారీతనం ఉండేలా చూడాలి. ఋతుక్రమ ఆరోగ్యం అనేది పౌరులు అడుక్కోవాల్సిన దానధర్మం కాదు, అది వారు గర్వంగా క్లెయిమ్ చేయగల హక్కుగా మారాలి. ఋతుక్రమాన్ని గౌరవంగా చూసే, నొప్పికి సరైన చికిత్స లభించే, మరియు ప్రతి పౌరుడి శారీరక స్వయంప్రతిపత్తిని ప్రభుత్వం కాపాడే కొత్త అధ్యాయాన్ని మనం మొదలుపెట్టాలి. అది మనం పౌర సమాజానికి నిలబెట్టుకోవాల్సిన వాగ్దానం. గౌరవప్రదమైన ఋతుక్రమ ఆరోగ్యం అనేది కేవలం ఒక వ్యక్తిగత విషయం కాదు, అది ఒక దేశ గౌరవానికి చిహ్నం. అందుకే ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. న్యాయస్థానం చూపిన మార్గంలో పయనిస్తూ, వివక్ష లేని సమాజాన్ని నిర్మించడమే మన ముందున్న అసలైన లక్ష్యం.

**- వెంక గారి భూమయ్య**
9848559863

# అంబేద్కర్‌కు అండగా సాయాజీ



భారతదేశ చరిత్రలో రాజులెందరో పుట్టారు.. కానీ ప్రజల కోసం రాజ్యాన్ని ఒక సాధనంగా మార్చుకున్నవారు చాలా అరుదు. అలాంటి అరుదైన మహానేతల్లో మొదటి వ్యక్తి సాహూమహారాజ్, ఆ తర్వాత సాయాజీ రావ్ గైక్వాడ్-3 అగ్రస్థానంలో నిలుస్తారు. సాయాజీ రావ్ గైక్వాడ్-3 బరోడా సంస్థానాన్ని పాలించాడు. అతడు అణగారిన వర్గాల ఆశాకిరణం, సామాజిక విప్లవానికి దారి చూపిన దిక్సూచి.

విద్యనే ఆయుధంగా మార్చిన దూరదృష్టి గల పాలకుడు. ఆ కాలంలో సమాజం కులగోడలతో నలిగిపోతున్నప్పుడు, విద్య కొద్దిమందికే పరిమితమైనప్పుడు, విద్య హక్కు అది దానం కాదు!అని ధైర్యంగా ప్రకటించాడు. ఆయన రాజ్యమే విద్యా రాజధానిగా మారింది. 1906లోనే ప్రాథమిక విద్యను ఉచితంగా, తప్పనిసరిగా అమలు చేసిన రాజ్యం బరోడా. ఇది బ్రిటిష్ భారత దేశంలోనే అత్యంత విప్లవాత్మక నిర్ణయం. నేడు రాజ్యాంగం ద్వారా అమలవుతున్న విద్య హక్కు చట్టాన్ని ఆనాడే కార్యరూపం దాల్చిందంటే, సాయాజీ రావ్ గైక్వాడ్-3 దళితులు, వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు, స్కాలర్‌షిప్లు, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించి సామాజిక న్యాయ పాలన దిశగా అడుగులు వేశాడు. మహిళల విద్య, వితంతు వివాహాలు వంటి సామాజిక సంస్కరణలకు మద్దతు పలికాడు. అణగారిన వర్గాలకు విద్యలో రిజర్వేషన్లు అమలు చేసిన తొలి పాలకుల్లో ఆయన ఒకరు. అందుకే ఆయన్ని సామాజిక న్యాయానికి తొలి శిల్పి అంటారు. డా. బాబాసాహెబ్ అంబేద్కర్ చదువుకు ఆర్థిక సహాయం అందించిన రాజు. ఈ సందర్భంగా దేశంలో వెనుకబడిన వర్గాలకు, దళితులకు మధ్య చారిత్రక అనుబంధం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. సాహూ మహారాజ్, సాహుజి రావ్ గైక్వాడ్ వంటి రాజుల ప్రోద్బలంతోనే వెనుకబడిన వర్గాలకు చెందిన...భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ బయటకు వచ్చాడు. జ్యోతిరావ్ పూలేను అంబేద్కర్ గురువుగా ప్రకటించుకొని సామాజిక ఉద్యమాలు చేశాడు. ఆ మహనీయుల స్ఫూర్తితో బీహార్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, తమిళనాడు రాష్ట్రాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు కలిసి రాజ్యాధికారంలోకి వచ్చారు. కావున నేడు బహుజనుల చారిత్రక అనుబంధం అవసరం.

సాయాజీ రావ్ గైక్వాడ్-3 జీవితం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. రాజ్యం అంటే భోగం కాదు బాధ్యత. పాలన అంటే అధికారం కాదు సేవ అని చెప్పిన గొప్ప రాజు. ఆ మహా నేత ఫిబ్రవరి 6న తుది శ్వాస విడిచాడు. నేడు ప్రజాస్వామ్య దేశంలో దళిత బహుజనులు రాజ్యాంగ హక్కులకు దూరంగా ఉన్నారు. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయాలు అవకాశాలు అందడం లేదు. ప్రజల సంక్షేమం నుంచి ప్రభుత్వం తప్పుకుంటుంది. సామాజిక ఆర్థిక అంతరాలు పెచ్చురిల్లుతున్నాయి. ప్రవేటీకరణతో ప్రభుత్వ విద్య, ఆరోగ్య వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయి. పేద విద్యార్థులకు సమయానికి



స్కాలర్షిప్‌లు విడుదల కాకపోవడం, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు నిలిచిపోవడంతో చదువు మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితికి నెట్టుతున్నాయి. విద్య సంస్థల్లో కుల వివక్షత విజృంభిస్తుంది. ఇది హాస్టళ్లలో, తరగతుల్లోకి వెళ్లింది. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ బడుగుల రిజర్వేషన్ వ్యవస్థకు గండి కొడుతున్నారు. వీటన్నిటికీ దళిత, బహుజన విద్యార్థులే బలవుతున్నారు. ఈ నేపథ్యంలో సాయాజీ రావ్ గైక్వాడ్-3 చేసిన సామాజిక సంస్కరణలు, రాజ్యాంగ ఆదేశాలు అత్యవసరం. విద్య కోసం సాహూ మహారాజ్, సాహుజి రావ్ గైక్వాడ్‌ల అండతోనే భారత దేశ రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్ ఆవిర్భవించాడు. ఆయన ఉద్యమ కొనసాగింపుగా కాన్షిరామ్ బహుజన రాజ్యాధికారాన్ని సాకారం చేశాడు. బీసీ ఎస్సీ ఎస్టీల ఉమ్మడిగా ఉద్యమించి రాజ్యాధికారం వైపు ప్రయాణించాలి. ఇదే సాయాజీ రావ్ గైక్వాడ్-3 కు ఇచ్చే ఘనమైన నివాళి.

**సాయాజీ రావ్‌గైక్వాడ్-3 వర్ధంతి.(ఫిబ్రవరి 6)**

**- సంపతి రమేష్ మహారాజ్**
7989579428.

# మహిళల్లో గుండె జబ్బులు



గుండె జబ్బులు అనగా గుండె, రక్తనాళాల వ్యవస్థలను ప్రతికూల ప్రభావితం చేసే ఏ వ్యాధిగా గుర్తించాలి. గుండె పోటు, స్ట్రోక్, కరోనరీ హార్ట్ డిసీజ్, అధిక రక్తపోటు లాంటి సమస్యలు మహిళల వయస్సు పెరిగిన కొద్దీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా మోనోపాజ్ తర్వాత ఈ సమస్యలు పెరుగుతున్నాయి. పురుషుల కంటే మహిళల్లో హృదయ నాళ సంబంధ సమస్యలు, మరణాలు అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో గుండె జబ్బుల సమస్యలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రతి ముగ్గురు మహిళల మరణాల్లో ఒక్కరు గుండె జబ్బులతో జరుగుతున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. క్యాన్సర్ కన్నా గుండె జబ్బులతో మహిళలు అధికంగా ప్రాణాలు కోల్పోతూ ఉన్నారు. పురుషులతో పోల్చితే మహిళల్లో గుండె జబ్బులు అధికంగా నమోదు అవుతున్నాయి. ఇలాంటి అత్యంత ప్రమాదకర వ్యాధుల పట్ల మహిళల్లో అవగాహన పెంచడానికి ప్రతి ఏట ఫిబ్రవరి తొలి శుక్రవారం, అనగా 06 ఫిబ్రవరి 2026 రోజున జాతీయ మహిళా గుండె దినోత్సవం లేదా నేషనల్ వూమెన్ హార్ట్ డే లేదా నేషనల్ వియర్ రెడ్ డే పాటించడం జరుగుతుంది.



రుతు విరతి లేదా మోనోపాజ్ తర్వాత మహిళల్లో గుండె జబ్బులు పెరుగుతున్నాయి. మహిళల్లో గుండె జబ్బుల లక్షణాలుగా శ్వాస ఆడకపోవడం, క్రమరహిత హృదయ స్పందన, చెమట పట్టడం, తల తిరగడం, ఛాతి/మెడ/వెన్ను/భుజాల/దవడ/తల నొప్పులు, వికారం, మైకం, అజీర్ణం, అలసట, వాంతులు లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి.

చిన్న గుండె ధమనుల్లో ఉత్పన్నమయ్యే సమ స్యల వల్ల కరోనరీ మైక్రోవాస్కులార్ డిసీజెస్ బయట పడుతున్నాయి. తీవ్ర మైన భావోద్వేగ ఒత్తిడి వల్ల గుండె బలహీనపడడంతో మహిళల్లో అధికంగా బ్రోకెన్ హార్ట్ సిండ్రోమ్ సమస్యలు వస్తున్నాయి. మోనోపాజ్ తర్వాత ఈస్ట్రోజెన్ హార్మోన్ తగ్గుదల వల్ల గుండె జబ్బుల సమస్యలు పెరుగుతున్నాయి.

**మహిళల్లో గుండె జబ్బులకు కారణాలు**

పురుషులతో పోల్చితే మహిళల్లో మధుమేహ ప్రభావం అధికంగా కనిపిస్తున్నది. అధిక కొలెస్టరాల్ (ఎల్డిఎల్), అధిక రక్త పోటు కూడా మహిళల్లో గుండె జబ్బులకు ఊతం ఇస్తున్నాయి. ధూమపాన/ఆల్కహాల్ దురలవాటు, శారీరక శ్రమ కొరవడడం, ఊబకాయ సమస్యలు కూడా మహిళలకు శాపంగా మారుతున్నాయి. మహిళల్లో మానసిక ఒత్తిడి, చిన్న చిన్న సమస్యలకు కుంగిపోవడం వల్ల కూడా గుండె జబ్బులు పెరుగుతున్నట్లు తేలింది.

**మహిళల్లో గుండె జబ్బుల నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు**

మన కుటుంబాల్లో మహిళలు అందరికీ ఆహారం వడ్డించినా తర్వాత మిగిలిన ఆహార పదార్థాలను మాత్రమే తినడంతో వారిలో పోషకాహారలోపాలు కనిపిస్తున్నాయి. అందు వల్ల మహిళలు కూడా మంచి పోషకాహారం తీసుకునే విధంగా పురుషాధిక్య సమాజం జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళలు విధిగా పండ్లు, కూర గాయలు, తక్కువ కొవ్వులు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి. ప్రతి రోజు తప్పకుండా కనీసం 30 నిమిషాలు శారీరక వ్యాయామం చేయాలి. ధూమపాన దురలవాటుకు దూరంగా ఉండాలి. రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్, బిపీ లాంటి వైద్య పరీక్షలకు ప్రతి ఏట చేయించుకొని నిపుణులైన వైద్యుల సూచనలు పాటించాలి. ముఖ్యం గా 50 - 55 ఏండ్లకు పైబడిన మహి ళలు ఎల్లవేళల అప్రమత్తంగా ఉండాలి. మహిళలు తమ శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.

గుండె జబ్బులు మహిళలకు ప్రధాన ఆరోగ్య సమస్యగా మారుతున్న వేళ రోగ లక్షణాలను గమనిస్తూ, పోషకాహారం తీసుకుంటూ, తగు ముందు జాగ్రత్తలు పాటిస్తూ, తరుచుగా వైద్య పరీక్షలు చేయిం చికుంటూ ఆరోగ్యకరమైన హృదయంతో ఆనం దంగా జీవితాలను కొన సాగించాలి. గుండె జబ్బుల బారిన పడిన మహి ళలు తమ కుటుంబ సభ్యులను అనాథలుగా మార్చ వద్దని కోరుకుందాం. మహిళల ఆరోగ్యమే కుటుంబ శ్రేయస్సు, సౌభాగ్యానికి పునాది అని మరువరాదు. జాతీయ మహిళా హృదయ దినోత్సవం రోజున ఎరుపు రంగు రిబ్బన్లు, డ్రస్సులు ధరించి మహిళా లోకానికి సంఘీభావాన్ని ప్రదర్శిస్తూ, వారు గుండె జబ్బుల బారిన పడకుండా అడ్డుకుందాం.

**ఫిబ్రవరి 6 జాతీయ మహిళా గుండె జబ్బుల వ్యతిరేక దినోత్సవం**

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# నకిలీ ఆదివాసీ నాయకత్వం



ఏజెన్సీలో ఆదివాసీ సంఘాలు నాయకులు అంటూ ఆదివాసీ సమాజాన్ని నిలువు నా మోసం చేస్తూ ఆదివాసీ ఉద్యమాన్ని ఒక ఉపాధిగా చేసుకొని జీవనం సాగిస్తున్న నకిలీ ఆదివాసీ సంఘాలు రోజురోజుకు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొని వస్తున్నాయి. నకిలీ ఆదివాసీ సంఘాలు ఏజెన్సీలో స్వరవిహారం చేస్తూ ఆదివాసీ సమాజం ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీస్తున్నాయి. విప్లవ పార్టీలుకు సద్దులు మోస్తూ సంచులు మోస్తూ బూర్జవా పార్టీల బూట్లు నాకుతూ బ్యాంక్ బ్యాలెన్స్ పెంచుకుంటున్న పరిస్థితి నేడు ఏజెన్సీలో ఉన్నది.

ఎలక్షన్ వస్తే చాలు ఆదివాసీ సంఘాలు నాయకుల దొంగల ముఠా మొత్తం ఒక్కసారిగా ఆదివాసీ సంఘాలు ఇంటి ముందు వాలుతుంది. కారణం స్పష్టం - అక్కడ ఓట్ల కాసుల మూట ఉంటుంది. ఆదివాసీ ఓట్లు, ఆదివాసీ చావులు, ఆదివాసీ బాధలు అన్నీ రాజకీయ మార్కెట్లో అమ్ముకునే సరుకులుగా మారిపోయాయి. ఇక్కడ చూడాల్సింది ఆదివాసీ కన్నీళ్లు కాదు కాసుల మూట ఎంత పెద్దదన్నదే.

ఆదివాసీ నాయకులమని చెప్పుకుంటూ తిరిగే కొందరు, ఆదివాసీల పై దౌర్జన్యాలు జరిగితే మేమున్నాం అంటూ మీడియా కెమెరాల ముందు గొంతెత్తుతారు. ఫోటోలు, వీడియోలు అయ్యాక వెనక నుంచి బాధిత కుటుంబాల బాధను బేరంగా మార్చుకుని జేబులు నింపుకుని వెళ్లిపోతారు. ఇలాంటి నకిలీ ఆదివాసీ నాయకులే నేటి ఆదివాసీ సమాజానికి అసలైన శాపం.

ఆదివాసీ హక్కులు తుంగలో తొక్కబడుతున్నా, ఆదివాసీ ప్రాణాలు కోల్పోతున్నా న్యాయం కోసం పోరాడాల్సిన చోట రాజకీయ లాభాలు, డబ్బు వసూలే కొంత మంది ఆదివాసీ లీడర్ల ప్రధాన వృత్తిగా మారింది. ఆదివాసీ ల కన్నీళ్లపై రాజకీయ



వ్యాపారం చేస్తున్న ఈ స్వార్థ ఆదివాసీ నాయకులు ఉన్నంతకాలం ఆదివాసీ సమాజానికి న్యాయం జరగడం ఒక కలగానే మిగిలిపోతుంది.

గిరిజనేతరుల మోచేతి నీళ్లు తాగడం అలవాటై, అధికారాల చుట్టూ తిరుగుతూ స్వప్రయోజనాల కోసం ఆస్తులు కూడబెట్టుకునే ఈ నాయకులు ఆదివాసీ సమాజాన్ని ముందుకు నడిపించడం కాదు, మరింత వెనక్కి నెట్టేస్తున్నారు. నేటి ఈ స్వార్థ ఆదివాసీ నాయకత్వం కొనసాగితే రేపటి తరాల ఆదివాసీ పిల్లలకు కూడా అవమానాలే వారసత్వంగా మిగిలే ప్రమాదం ఉంది.

ఆదివాసీ పేరుతో రాజకీయాలు చేసి, ఆదివాసీ జీవితాలతో వ్యాపారం చేస్తున్న ఆదివాసీ నాయకులకు ఇప్పటికైనా కనువిప్పు కలగాలి. నకిలీ నాయకత్వం అంతం చేసి, నిజమైన ఆదివాసీ నాయకత్వం వెలుగులోకి రావాలి. అదే ఆదివాసీ సమాజ భవిష్యత్తుకు ఏకైక ఆశ.

**- వూకె రామకృష్ణ**

## బలవంతపు చావు

అనాలోచితం శీఘ్రనిర్ణయం
ఉచితానుచితాలను మరిపింపచేయడం
జరిగే ఘోరానికి జవాబుదారీ ఎవ్వరిది?
విధితో పోరాడలేని పిరికివారు
తామే కాకుండా పరివారాన్నీ ముంచిన
మరణోన్మాదం మతిలేని నిర్ణయం.
నిదానిస్తే సమస్యలకు సమాధానాలు లభిస్తాయి.
తొందరపాటు నిర్ణయాలు
అమానవీయం కాదా!
ఈ సమాజం ఎటు పయనిస్తోంది?
కథనాలు తరచుగా జరుగుతున్నా
స్పందించరా!
ఆత్మహత్యలకు కారణాలెలా విశ్లేషించాలి?
నెమ్మదిగా ఆలోచిస్తే బలవన్మరణాలు,ఆందోళనలు తగ్గుతాయి
అవమానమా?అసమానతా,అసహనమా?
తీవ్రవత్తిడికి తట్టుకోలేకపోతున్నారా?
తప్పులే మహాపాపంగా
వెంటాడుతున్నాయా?
ఆత్మహత్యలు ఆగేదెన్నడు?
ఈ సామాజికసమస్యకు
మేధావులేమంటారు?మనస్తత్వవేత్తలేమంటారు?
మనసు విరిగితే మందే లేదా?
కౌన్సిలింగ్ తో సరిచేయలేమా?
కనువిప్పు కలగదా? ఆలోచించండి.

**- వేమూరి శ్రీనివాస్**
9912128967

# భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- గొల్లపెల్లి ఎమ్మార్వో కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



జగిత్యాల, ఫిబ్రవరి 05(మనం ప్రతినిధి): గురువారం జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం తహసిల్దార్ కార్యాలయంను జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్ లత ఆకస్మిక తనిఖీ చేశారు. భూ భారతికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ఓటరు జాబితా సవరణ మరియు ఇరిగేషన్ ట్యాంక్స్ సెన్సెక్స్ సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం జరిగిన బి ఎల్ ఓ మరియు జి పి ఓ ల సమావేశంలో మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బి.ఎల్.ఓల పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఓటరు నమోదు చేయాలని మరియు వివరాలు సరిచూడాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. అనర్హుల పేర్లను నిబంధనల మేరకు తొలగించాలని సూచించారు. వయస్సు, చిరునామా వంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఫోటోలు మరియు ఆధార పత్రాలను పరిశీలించాలని తెలిపారు. ఫారమ్ 6, 7, 8లను సక్రమంగా స్వీకరించాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో ప్రాసెస్ చేయాలన్నారు. డూప్లికేట్ నమోదులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. మొబైల్ యాప్ల ద్వారా డేటా అప్లోడ్ చేయాలన్నారు. పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అందరు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పట్టణ,గ్రామ మరియు వార్డు స్థాయిలో పర్యవేక్షణ పెంచాలన్నారు. ప్రత్యేక డ్రైవ్లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువైనదని గుర్తు చేశారు. ఎన్నికల స్వచ్ఛతకు అందరూ సహకరించాలని కోరారు. బాధ్యతాయుతమైన పని విధానం అవసరమన్నారు. లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలని చెప్పారు. నివేదికలను సమయానికి సమర్పించాలన్నారు.ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. తదనంతరం గ్రామాల్లోని చెరువుల యొక్క గణాంకాలు నీటి పారుదల శాఖ తో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ఉండేలా చూడాలని జిపివోలను ఆదేశించారు. ఈ సమావేశంలో గొల్లపెల్లి తహసీల్దార్ అబ్దుల్ మాజిద్, రెవెన్యూ సిబ్బంది, జీపివోలు, బి ఎల్ వో లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



- భద్రత ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 05 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గురువారం రోజున జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ దరూర్ క్యాంప్ లో గల ఈవీఎం లను భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ బిఎస్ లత జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మరియు కలెక్టరేట్ ఏవో హకీమ్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ మరియ తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



- సమక్క-సారలమ్మ జాతర, గోదావరి పుష్కరాల స్థలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

గోదావరిఖని, ఫిబ్రవరి 05 (మనం న్యూస్): పుష్కరాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ఈ మేరకు గురువారం అంతర్గాం మండలంలోని గోలివాడ, రామగుండం, గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గోలివాడ సమ్మక్క-సారలమ్మ జాతరకు రోజుకు 30 వేల భక్తులు వస్తారనే అంచనాతో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ జాతరకు 50 శాతం వరకు శాశ్వత పనులు పూర్తయ్యాయని, స్నానాల ఘాట్ నిర్మాణ పనులు ఉన్నాయని, రోజుకు లక్ష భక్తులు వచ్చిన తట్టుకునేలా చేపట్టాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓలు బిగంగయ్య, సురేష్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ సుప్రియ, ఈవై టీం తరీ ఖాన్, జై దీప్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఎదుగుదలను నిరంతరం మానిటర్ చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, ఫిబ్రవరి 05 (మనం ప్రతినిధి): పిల్లల ఎదుగుదలను నిరంతరం మానిటర్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంక్షేమ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు నిబంధనల ప్రకారం పనిచేసేలా పర్యవేక్షించాలని కలెక్టర్ అంగన్వాడి సూపర్వైజర్ లను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 90 అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తుల కోసం 2 లక్షల చోప్పున నిధులు మంజూరు చేసామని వాటిని సద్వినియోగం చేయాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లల ఎదుగుదలను ప్రతి నెలా మానిటరింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.గర్భిణీలు, బాలింతలు అంగన్వాడి కేంద్రాలకు వచ్చి ఒక పూట భోజనం తీసుకునేలా చూడాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పాలు, కోడిగుడ్లు, పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాలు సరిగ్గా స్టోర్ చేయాలని అన్నారు. అంగన్వాడి కేంద్రం నుంచి అందించే ఆహార పదార్థాల నాణ్యతను రెగ్యులర్ గా చెక్ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో పాడైన ఆహార పదార్థాలు పిల్లలకు లేదా గర్భిణీ మహిళలకు ఇవ్వడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.అంగన్వాడీ టీచర్లు, సూపర్ వైజర్ల పనితీరు మెరుగు పరిచేలా సిడిపిఓ రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతివారం అంగన్వాడీ టీచర్ల సూపర్వైజర్ల పని తీరును పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సిడిపిఓ లు అలేఖ్య , పుష్ప, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పురపాలిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని





పెద్దపల్లి, ఫిబ్రవరి 05 (మనం ప్రతినిధి): పురపాలిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు.మున్సిపల్ ఎన్నికల పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్ లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ పురపాలక ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ లకు ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కు అవసరమైన మేర బ్యాలెట్ బాక్సులు బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేసుకోవాలని, పోలింగ్ బృందాలు , డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్ లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత మున్సిపాలిటీలలో చైర్ పర్సన్, కార్పొరేషన్లలో మేయర్ ఎన్నిక కోసం ఫారం 2 లను సిద్ధం చేసి సంసిద్ధం కావాలని, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులకు ముందుగానే సమాచారం అందించాలని అన్నారు.



ఈ సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, గోదావరిఖని ఏసీపి రమేష్,ఈ సెక్షన్ సూపరిండెంట్ విజయ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల విధుల బహిష్కరణ



సుల్తానాబాద్, ఫిబ్రవరి 05 (మనం న్యూస్): చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యురాలు యువ మహిళా న్యాయవాది స్వప్న ను దుండగులు అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి అన్నారు. ఈ దారుణ హత్యకు నిరసనగా గురువారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు హేయమైన చర్య అని, వారి రక్షణ కోసం ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొయిని భూమయ్య , న్యాయవాదులు భూసారపు బాల కిషన్ ప్రసాద్, మాడూరి ఆంజనేయులు, పడాల శ్రీరాములు, ఆకారపు సరోత్తం రెడ్డి, జోగుల రమేష్, చిలుక ఆనంద్, వంగళ యుగేందర్ రెడ్డి, వేముల స్నేహ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు నిర్వహించే వారు

- పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కను వినియోగించుకోవాలి





కరీంనగర్, పిబ్రవరి 5(మనం న్యూస్): కరీంనగర్ నగరపాలక సంస్థ పరిదిలోని 66 డివిజన్లలో ఓటరుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైన ప్రస్తుతం ఎన్నికల విధులు నిర్వహించే వారు నగరపాలక సంస్థ కార్యాలయంలో 7,8,9 వ తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కను వినియోగించుకోవాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ 2 వ సాధరణ ఎన్నికల నిర్వహణ లో భాగంగా గురువారం రోజు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి నగరపాలక సంస్థ కార్యాలయంలో నూతన రెవెన్యూ భవనాన్ని కమీషనర్ అధికారులతో కలిసి సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం కోసం పోలింగ్ కేంద్రంలో కౌంటర్లు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోస్టుల్ బ్యాలెట్ కౌటర్లలో వసతి సౌకర్యాల పై అధికారులకు పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంకు సంబంధించి రెండు సెల్ఫీ నమూన కటౌట్లను ఏర్పాటు చేయించారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... కరీంనగర్ నగరపాలక సంస్థ 66 డివిజన్ల కు చెందిన ఎవరైన ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ... ప్రస్తుతం ఎన్నికల విధులు నిర్వర్తించే వారు మీ యొక్క ఆర్డర్ కాఫీతో నగరపాలక సంస్థ లో పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం ఫాం 12 ద్వారా దరఖాస్తు చేస్తోని... నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కౌంటర్లలో మీ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 7,8,9 తేదీల్లో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోట్టల్ బ్యాలెట్ ఓటు వేయాలన్నారు. ఎన్నికల డ్యూటీ ఆర్డర్ కాపితో నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫాం 12 ను పొందవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం కోసం ప్రత్యేక కౌంటర్లతో పాటు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

# భయం వీడండి ఫిర్యాదు చేయండి

- ఒక ఫోన్ కాల్ ఒక మెసేజ్ చాలు
- మహిళల భద్రతకు షీ-టీమ్ సేవలు
- రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా





గోదావరిఖని, ఫిబ్రవరి 5 (మనం న్యూస్): రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో మహిళలు, బాలికల భద్రత కోసం షీ-టీమ్ నిరంతరం సేవలందిస్తుందని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న వేధింపుల విషయంలో ధైర్యంగా ఫోన్ కాల్, మెసేజ్ ద్వారా ఫిర్యాదు చేయాలని సిపి సూచించారు. కమీషనరేట్ పరిధిలో పెద్దపల్లి జోన్లో ఒక షీ-టీమ్ పనిచేస్తుందని, షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, పెద్దపల్లి జోన్ షీ టీమ్ 8712659386, 100కు డయల్ చేయాలన్నారు. మహిళలు,బాలికలు సురక్షిత ప్రయాణం కోసం టి-సేఫ్ (ట్రావెల్ సేఫ్) యాప్ను వినియోగించుకోవాలని కోరారు. రామగుండం షీ-టీమ్ వాట్సాప్ నంబర్, 100కు డయల్ ద్వారా ప్రత్యక్షంగా పెద్దపల్లి జోన్ షీ టీమ్ కార్యాలయాలకు జనవరి నెలలో 13 ఫిర్యాదులు అందాయని, షీ-టీమ్ డీకాయ్ ఆపరేషన్లలో పట్టుకున్న వారిపై పెటీ కేసులు నమోదు చేసి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఆ ప్రకటనలో సిపి పేర్కొన్నారు.

# 48 గంటల నిబంధన తూ.చా. తప్పకుండా పాటించాలి



- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల,ఫిబ్రవరి 5 (మనం ప్రతినిధి) 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు 48 గంటల నిబంధన ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ముగిసే 48 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాలని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, మీడియా, ప్రసార సాధనాల ద్వారా ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలను కొనసాగించకూడదని తెలిపారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, మీడియా యాజమాన్యాలు 48 గంటల నిబంధనను ఖచ్చితంగా పాటించాలని, స్వేచ్ఛాయుత, పారదర్శకమైన ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని తెలిపారు.

# ఒలంపియాడ్ టాపర్ గా సుహాన్





శంకరపట్నం ఫిబ్రవరి 5 (మనం న్యూస్)సుచిరిండియా నిర్వహించిన సర్ సి.వి.రామన్ యంగ్ జీనియస్ ఒలంపియాడ్ లో టాపర్ గా అంతం సుహాన్ రెడ్డి నిలిచాడు. సుచిరిండియా ఆరు రాష్ట్రాల్లోని ఒకటి నుండి పదో తరగతి వరకు చదివి విద్యార్థులకు ఈ ఒలంపియాడ్ నిర్వహించింది. ఇందులో లక్ష మంది విద్యార్థులు పాల్గొనగా తరగతుల వారీగా టాపర్స్ ను ఎంపిక చేసింది. శంకరపట్నం మండలం లింగాపూర్ చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అంతం లింగారెడ్డి, మాధవిల కుమారుడు అంతం సుహాన్ రెడ్డి ప్రస్తుతం కరీంనగర్ పారామితా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బాల్యం నుండే చదువులో ముందంజలో ఉన్న సుహాన్ రెడ్డి సుచిరిండియా నిర్వహించిన ఈ ఒలంపియాడ్ లో 8వ తరగతి విభాగంలో టాపర్గా నిలవడం విశేషం. ఈ సందర్భంగా ఈ నెల మూడో తేదీన హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి గంటా శ్రీనివాస రావు, ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ , శివాజీ రాజాలు సుహాన్ రెడ్డికి జ్ఞాపికను అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సుహాన్ రెడ్డిని పారామితా పాఠశాలల చైర్మన్ ఈ. ప్రసాదరావు, అంతం తిరుపతి రెడ్డి, అంతం శ్రీనివాస్ రెడ్డి, లేబర్ ఆఫీసర్ ఎ.సత్యనారాయణ రెడ్డి, పోస్ట్ మాస్టర్ ఎ.కృష్ణారెడ్డిలు అభినందించారు.

# కాంగ్రెస్ అంటే సంక్షేమానికి మారుపేరు

- ఇంటింటికి ప్రచారం నిర్వహించిన ప్రణవ్

జమ్మికుంట, ఫిబ్రవరి 5 (మనం న్యూస్): కాంగ్రెస్ అంటే సంక్షేమానికి మారుపేరని, ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమాన్ని ప్రజలకు చేరవేయడంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా మరింతగా గడప, గడపకు చేరవేస్తామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని 22, 19, 04 వార్డులలో గురువారం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను, వాటి ద్వారా ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో ప్రజలకు వివరించారు. జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీల అభివృద్ధి నా బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# బొమ్మల కొలువు విజయవంతం... అభినందనలు



గోదావరిఖని, ఫిబ్రవరి 05 (మనం న్యూస్): జనవరిలో ఆర్జీ ఏరియా వన్ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బొమ్మల కొలువు విజయవంతమైన సందర్భంగా ఇల్లందు క్లబ్ లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జీ ఏరియా వన్ జిఎం లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, ఆర్జీ రీజియన్ క్వాలిటి జిఎం సుజోయ్ మజుందర్, రెస్క్యూ జిఎం శ్రీనివాస రెడ్డిలు హాజరైయ్యారు. ఈ సందర్బంగా సేవా అధ్యక్షురాలు మాట్లాడుతూ... బొమ్మల కొలువులో తెలంగాణా సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా ఉన్నాయని అన్నారు. పురాతన చేతి పనిముట్లు, గతకాలపు ఛేద బావి, వరి పొలం నాటు వేసే విధానం, సంక్రాంతికి భోగి పండ్ల కార్యక్రమం, లేడిస్ క్లబ్ సభ్యులు ప్రదర్శించిన దశావతారాల ప్రదర్శన, వివిధ డ్యాన్స్ పోగ్రాం, సమ్మక్క-సారలమ్మ గద్దెలు, ప్రాచీన వస్తువులు అన్ని అందరిని ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ విధంగా పల్లెటూరి వాతావరణన్ని సృష్టించి పూర్వపు చరిత్రని ప్రస్తుత వారికి తెలిపేలా బొమ్మల కొలువులో పాల్గొన్న లేడిస్ క్లబ్ సభ్యులు, సహకరించిన సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సివిల్ డిపార్ట్మెంట్, ఫారెస్ట్ డిపాట్మెంట్, వర్క్ షాప్, పెయింటర్స్, డాన్స్ కొరియోగ్రఫేర్, డాన్స్ మాస్టర్, కమ్యూనికేషన్ సెల్ సభ్యులకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి బహుమతుల ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

# హామీలు మరిచిన వాళ్లకు ఓట్లు ఎట్లా వేస్తారు

- ఓట్ల కోసం ఆరాటం తప్ప కాంగ్రెస్‌కు అభివృద్ధి అవసరం లేదా
- గజ్వేల్‌లో రెండేళ్లలో ఏమి చేసింద్రో చెప్పి ఓట్లు అడుగుమనండి
- వచ్చే ప్రభుత్వం బీఆర్ఎస్ దే
- హరీష్ రావు మాజీ మంత్రి





సిద్దిపేట, ఫిబ్రవరి 5(మనం ప్రతినిధి)ః కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు అన్ని విధాల మోసపోయారని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు కాక పోగా మళ్లీమళ్లీ ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 2,3, 4, 5, 6 వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ఎండగడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో గజ్వేల్ లో జరిగిన అభివృద్ధిని మరోసారి గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీల తోపాటు ఆరు గ్యారంటీలు చెప్పి ఇప్పటివరకు ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. రైతు బంధు రెండుసార్లు ఇవ్వలేదని, రుణమాఫీ సగం మంది రైతులకు వర్తించలేదని, కళ్యాణ లక్ష్మి తులం బంగారం ఏ ఒక్కరికి ఇవ్వకపోగా, వృద్ధులకు రూ 6000 లు పెన్షన్ పెంచుతానని రెండు నెలలు రూ 2000 పెన్షన్ ఎగ్గొట్టినట్లు ఆరోపించారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం అన్నిట్లో ఫెయిల్ అయిన కాంగ్రెస్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. ప్రజలు కూడా వీటన్నిటిని కాంగ్రెస్ నాయకుల ముందు ప్రశ్నించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేయాలని సూచించారు.

### కెసిఆర్ వల్లే రాష్ట్రం ఏర్పడింది

కెసిఆర్ వల్లే తెలంగాణ ఉద్యమం ఉధృతమైందని, రాష్ట్రం సాధించుకోవడం జరిగిందని హరీష్ రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కెసిఆర్ పై చేస్తున్న బూతు మాటలు తెలంగాణ ప్రజలపై చేసినట్లేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా మాట్లాడే భాష కాదని ఆయన మారాలని సూచించారు. కెసిఆర్ తో కొట్లాట కాకుండా అభివృద్ధిలో పోటీపడి ప్రజలను మెప్పించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ తెలంగాణ జాతిపిత అవుతారని రేవంత్ మాటలు ప్రజలు పట్టించుకోరన్నారు.

### గజ్వేల్ అభివృద్ధిని చూసి ఓటేయండి

గజ్వేల్ లో పదేళ్లలో జరిగిన అభివృద్ధి, గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని బేరీజు చేసుకొని ప్రజలు ఓట్లు వేయాలని హరీష్ రావు సూచించారు. రెండేళ్లలో గజ్వేల్ లో రెండు రూపాయల అభివృద్ధి పనులు చేయలేదని గజ్వేల్ పై కక్ష కట్టి అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. మరో రెండేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ప్రజలు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను గెలిపించాలన్నారు. ఈ ప్రచారంలో మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల ప్రచార ఇంచార్జ్ రాధాకృష్ణ శర్మ, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి ప్రతాపరెడ్డి, అయా వార్డుల బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి హరీష్ రావు ఆహ్వానించారు.

# మీ బిడ్డగా మీ ముందుకు వచ్చాను

- ఈ ప్రాంత అభివృద్ధి కోసం పని చేస్తాను
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సమతా వెంకట్ రెడ్డి



చేవెళ్ల, ఫిబ్రవరి 5 (మనం న్యూస్) : మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గా ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజల మధ్యనే ఉంటూ నిరంతరం సేవ లందిస్తూ వార్డు ప్రజల నమ్మకాన్ని సంపాదించుకున్న వ్యక్తిగా సమతా వెంకట్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు ఉంది. గురువారం అభ్యర్థి వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులను ఆప్యా యంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకొని కీలక హామీ లు ఇచ్చారు.మీ బిడ్డగా మీ ముందుకు వచ్చాను ఈ సందర్భంగా వార్డులోని ప్రధాన సమ స్యలపై దృష్టి సారిస్తామని తెలిపారు. ముఖ్యంగా డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల సమస్య లను ప్రాధాన్యతగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచి, మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధిని చేసి చూపిస్తామని సమతా వెంకట్ రెడ్డి సార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా



చేవెళ్ల, ఫిబ్రవరి 5( మనం న్యూస్): మున్సిపాలిటీ ఎన్నికల్లో తనను ఓటర్లు ఆశీర్వదించి గెలిపిస్తే 14వ వార్డును అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి మద్దెల శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల్లో భాగంగా 14 వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలుస్తూ మీ అమూల్యమైన ఓటు హస్తం గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డు అభివృద్ధి కోసం డ్రైనేజీ విద్యుత్ మంచినీటి సిసి రోడ్లు తో పాటు వార్డ్ లో ఉన్న మౌలిక వస్తువులు కల్పిస్తానన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అధిక నిధులు తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదరించి గెలిపించండి

# అభివృద్ధి చేస్తా



చేవెళ్ల, ఫిబ్రవరి 5 ( మనం న్యూస్): మునిసిపల్ ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపించండి 1వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నిఖిత శివ ప్రసాద్ అన్నారు .ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం 1వ వార్డు పరిధిలో విస్తృతంగా మద్దతు దారులతో కలిసి ఇంటిటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... కాంగ్రెస్ తోనే మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఏ పార్టీ కూడా మున్సిపాలిటీ అభి వృద్ధికి నిధులు తీసుకువచ్చే పరిస్థితి లేదన్నారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు .అభివృద్ధి కావా లంటే తనను ఆదరించి ఆశీర్వదించి హస్తం గుర్తుకు ఓటు వేసి కౌన్సిలర్ గా గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతు దారులు పాల్గొన్నారు.

# గెలుపు ఓటమిలపై గ్రామాలలో జోరుగా చర్చలు



మేడ్చల్, ఫిబ్రవరి 5( మనంప్రతినిధి)ః గ్రామాలలో గెలుపు ఓటమిలపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. గ్రామాలలోని కూడలీ వద్ద నలుగురు కలిస్తే చాలు మున్సిపల్ ఎన్నికల చర్చలే సాగుతున్నాయి. ఎవరిని కదిలిచ్చినా ఏ పార్టీ గెలుస్తుంది ఏ అభ్యర్థి గెలుస్తున్నాడు అంటూ ఒకరికొకరు చర్చించు కుంటున్నారు. దీంతో ఎక్కడ చూసినా మున్సిపల్ ఎన్నికల చర్చలే సాగుతున్నాయి. ఇంకో ఐదు రోజులలో ఎన్నికల ప్రచారం ముగియనుండడంతో గ్రామాలలో ఎటు చూసినా మున్సిపల్ ఎన్నికల వాతావరణమే కనిపిస్తుంది. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో మూడు మున్సిపల్ లో హోరా హోరీగా సాగుతున్నాయి. పోలింగ్ కు సమయం దగ్గర పడుతుండటంతో మూడు పార్టీల నేతలు జోరును పెంచాయి. దీంతో గ్రామస్తులు మూడు పార్టీల నుండి గెలుపు ఏ అభ్యర్థిని వారిస్తుందో అంటూ గ్రామాలలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. కూడలిల వద్ద నలుగురు కలిస్తే చాలు మున్సిపల్ ఎన్నికల గురించే చర్చ సాగుతుంది. ఏ పార్టీ గెలుస్తుంది, ఏ అభ్యర్థి గెలుస్తున్నాడు అంటూ చర్చించుకుంటున్నారు.

### గెలుపు ఓటమిలపై బెట్టింగ్లు

కొన్ని గ్రామాలలో గెలుపు ఓటమిలపై గెలుపు బెట్టింగ్లు పెడుతున్నట్లు సమాచారం. పలానా పార్టీ గెలుస్తుందని, పలానా పార్టీ ఓడిపోతుంది అంటూ జోరుగా బెట్టింగులు సాగుతున్నట్లు సమాచారం.

### బెట్టింగ్లపై పోలీసులు ప్రత్యేక

నిఘా విధిస్తున్నట్లు సమాచారం. గెలుపు ఓటమిలపై బెట్టింగ్లకు పాల్పడడం చట్ట రిత్యా నేరం. అయినా గెలుపు ఓటమిలపై జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. ఈ బెట్టింగ్ ల విషయంలో పోలీసులతోపాటు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రత్యేక దృష్టి సారించినట్టు సమాచారం.

# కాంగ్రెస్ పార్టీతో అభివృద్ధి సాధ్యం

- బండారు శైలజా ఆగిరెడ్డిని అత్యదిక మెజార్టీతో గెలిపించండి
- మాజీ జడ్పీటీసీ కాలె శ్రీకాంత్



చేవెళ్ల, ఫిబ్రవరి 5 (మనం న్యూస్)ః కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ జడ్పీటీసీ కాలె శ్రీకాంత్ అన్నారు. గురువారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో బండారు శైలజా ఆగిరెడ్డి గెలుపుకోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. చేవెళ్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. ప్రచారంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం..

రైతులు విద్యార్థులు నిరుద్యోగ మహిళల సంక్షేమమే ప్రధాన లక్ష్యం...
కరీంనగర్ వరంగల్ జంట నగరాల అభివృద్ధికి ప్రత్యేక కృషి...
కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం...
గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని
బాసర నుండి భద్రాచలం వరకు దేవాలయాలను అభివృద్ధి చేస్తాం..
ధర్మపురి కొండగట్టు దేవాలయాలను అభివృద్ధి చేస్తాం...
అటవీ ప్రాంతాన్ని ఏ కో టూరిజం గాతీర్చిదిద్దుతాం...
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...
కరీంనగర్ జిల్లా చొప్పదండిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన..






కరీంనగర్ ఫిబ్రవరి 5 (మనం ప్రతినిధి).. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో నంబర్ వన్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు మరియు మహిళల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వ పాలనను సాగిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గువ్వాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. గుమ్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన - ప్రగతి బాట కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3.25 గంటలకు చేరుకోగా రాష్ట్ర మంత్రులు. శనసభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విప్ ఆది శ్రీనివాస్, శాసన మండలి సభ్యులు, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, మక్కన్ సింగ్, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయ రమణారావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు , మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం బహిరంగ సభ వద్ద రూ.45.15 కోట్లతో కరీంనగర్ జిల్లా రామడుగు వెదిర గ్రామంలో నిర్మించనున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 5 కోట్లతో గంగాధర మండలం మధురానగర్ చేపట్టనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అనేక ఏళ్ల నుంచి కరీంనగర్ నగరాన్ని పట్టిపీడిస్తున్న డంప్ యార్డు సమస్యను పరిష్కరిస్తామని, కరీంనగర్ వరంగల్ నగరాలకు మధ్య డంప్ యార్డు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అదేవిధంగా కరీంనగర్ రింగ్ రోడ్డు మంజూరు చేస్తామని తద్వారా కరీంనగర్ అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి జరుగుతుందని పేర్కొన్నారు. కరీంనగర్ తో పాటు వరంగల్ నగరాలను జంట నగరాలు అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. కరీంనగర్ గడ్డ నుంచే మలిదశ ఉద్యమం ప్రారంభమై తెలంగాణ రాష్ట్ర సాధనకు దోహదపడిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లక్షల సంఖ్యలో ఇళ్లను లబ్ధిదారులకు అందించిందని, ఉచిత విద్యుత్ పథకం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత కరెంట్ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో రైతులు విద్యార్థులు నిరుద్యోగులు మహిళల సంక్షేమ లక్ష్యంగా నిరంతరం పాటుపడుతున్నామని పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుండి లా, ఎల్ఎల్ఎం, ఇంజినీరింగ్ కళాశాలలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు బీమా పంపిణీ చేశామని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సమ్మక్క-సారలమ్మ జాతరలో సైతం మహిళలకు ఉచిత రవాణా కల్పించడం జరిగిందని తెలిపారు. ఉచిత రవాణా ద్వారా ప్రతి మహిళకు నెలకు దాదాపు రూ.4 వేల వరకు ఆదా అవుతుందని, ఇప్పటి వరకు దాదాపు రూ.9 వేల కోట్లను ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందన్నారు. మహిళా స్వయం ఉపాధి సంఘాలకు జీరో వడ్డీ రుణాలుగా రూ.27 వేల కోట్లు మంజూరు చేసి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని. వారిని అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు 1000 అద్దె బస్సులను కేటాయించామని వాటికి యజమానులు మహిళా లేనని స్పష్టం చేశారు.

ఆదాని అంబానీలకు దీటుగా మహిళలకు సోలార్ పవర్ ప్లాంట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. వారికి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే బాధ్యతలు అప్పగించామని చెప్పారు. జగిత్యాలలో రోడ్డు విస్తరణ, యంగ్ ఇండియా స్కూల్ కొరకు స్థలాల్ని కేటాయిస్తామని, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.150 కోట్లు కేటాయించామని, ఆ అభివృద్ధి పనులు నడుస్తున్నాయని చెప్పారు. ధర్మపురి, కొండగట్టు ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, అటవీ ప్రాంతాలను ఎకో టూరిజంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని బాసర నుండి భద్రాచలం వరకు దేవాలయాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఆయా ప్రాంతాలను టూరిజం డెవలప్మెంట్ కింద తీసుకుని అభివృద్ధి చేస్తామని. పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కరీంనగర్ డంప్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని, కరీంనగర్ వరంగల్ జిల్లాలను జంట నగరాలుగా తీర్చిదిద్దేలా రింగ్ రోడ్డు ఏర్పాటు చేసి ఆ జిల్లాల మధ్యలో డంప్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చివరగా 2676 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.110 కోట్ల 10 లక్షల 12 వేల రూపాయల చెక్కులను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఓటి కెనాల్స్ ఏర్పాటు జరిగిందని, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు భూసేకరణకు మిగిలిన నిధులను కూడా త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని కోరారు. తద్వారా కొండగట్టు ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. నారాయణపూర్ రిజర్వాయర్ పనులను ప్రభుత్వం సత్వరమే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా చొప్పదండి నియోజకవర్గంలో సాగునీటి బాధ తీరుతుందని, చొప్పదండి సస్యశ్యామలంగా మారుతుందని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి ఈ విషయంలో సానుకూలంగా స్పందించాలని కోరారు. అదేవిధంగా చొప్పదండి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. చొప్పదండి నియోజకవర్గానికి ఏటిసి డిగ్రీ కాలేజ్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి... రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ధర్మపురి కొండగట్టు రాష్ట్రంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత సన్నబియ్యం వంటి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు . టిఎస్పీఎస్సీ ద్వారా దాదాపు 70 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు . ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారని పేర్కొన్నారు.కుల గణన ద్వారా అన్ని వర్గాలకు న్యాయం... ₹₹రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని . కులగణన ద్వారా అన్ని వర్గాలకు న్యాయం చేశారని, రైతులు, నేత కార్మికుల సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు కేటాయించారని చెప్పారు. పెండింగ్ అభివృద్ధి పనులను ప్రాధాన్యతనుబట్టి పూర్తి చేస్తామని తెలిపారు. కరీంనగర్ అభివృద్ధికి నిరంతరం పాటు పడతామని ప్రణాళిక ప్రకారం పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేస్తామన్నారు. కరీంనగర్ జిల్లా అంటే ముఖ్యమంత్రికి ఎనలేని అభిమానమని పేర్కొన్నారు. రైతు బీమా రైతు భరోసా రైతు రుణమాఫీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించిందన్నారు. రైతుల సంక్షేమ లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

# అనుమతుల్లేకుండా నిర్మాణాలు

- ముత్తులింగం కాలనీలో మూడంతస్తులు
- ఎదురుగడ్డ పంచాయతీలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణం
- నోటీసులు ఇచ్చినా లెక్క చేయని ఓ చికెన్ షాప్ యజమాని
- పంచాయతీ నిబంధనలకు విరుద్ధం






**లక్ష్మీదేవిపల్లి ఫిబ్రవరి 05 (మనం న్యూస్):** ఎవడైతే నాకేంటి నేను అనుకున్నదే చేస్తా ను. ఎవరు అడ్డొచ్చినా ఊరుకోను అధికారులు నోటీసులు ఇచ్చినా ఐ డోంట్ కేర్ అంటూ ఓ వ్యక్తి అనుమతులు లేకుండా ఏకంగా మూడంతస్తుల భవనాన్ని నిర్మింసున్నాడు. పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చినా పట్టించుకోకుండా తన పంతాలు కొనసాగిస్తున్నాడు. అధికారులు మాత్రం నిస్సహాయ స్థితిలో చూస్తూ ఊరుకొంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో జరుగుతుంది అనుకుంటే పొరపాటే. కొత్తగూడెం కార్పొరేషన్ కు ఆనుకొని ఉన్న ఎదురుగడ్డ పంచాయతీ ముత్తులింగం కాలనీలో జరుగుతోంది. అధికారులు నోటీసులు ఇచ్చి పనులను నిలుపుకోవాలని చెప్పిన వారి మాటలను సైతం లెక్కచేయకుండా అక్రమ నిర్మాణం చేస్తూ అందర్నీ హడలెత్తిస్తున్నాడు.

### అధికార బలంతో విర్రవీగుతున్న వ్యక్తి...

ఎదురుగడ్డ పంచాయతీలోని ముత్తులింగం కాలనీ చివర్లో కొత్తగూడెం ఎంజి రోడ్డులో ఉన్న ఓ చికెన్ షాప్ యజమాని తన అధికార బలంతో అక్రమ నిర్మాణాలు జరుపుతున్నాడు. ఇదేమిటని పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చి పనులను అడ్డుకునే ప్రయత్నం చేసినా ఎవరి మాటలు లెక్కచేయకుండా యదేచ్ఛగా నిర్మాణం చేపడుతున్నాడు. తనకు ఒకే కమ్యూనిటీకి చెందిన వ్యక్తి అండ అధికార బలం పుష్కలంగా ఉందని తనను అడ్డుకుంటే ఎవర్ని ఉపేక్షించబోనంటూ బెదిరిస్తూ అధికారుల మాటను సైతం లెక్కచేయకుండా నిర్మాణం చేపడుతున్నాడు. ఇది చూసిన ప్రజలంతా అధికారులు చెప్పింది వినకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార బలం అంగ బలం ఉందని సదరు వ్యక్తి అక్రమ నిర్మాణం జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహిస్తున్నారు. అధికారులు ప్రతాపం సామాన్య ప్రజల పై నేనా, ఇలా దౌర్జన్యాలకు పాల్పడే వారి పై కాదా అంటూ ప్రశ్నిస్తున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం

పంచాయతీల్లో ఏదైనా నిర్మాణం చేయాలంటే కచ్చితంగా అనుమతి తీసుకోవాలి. పంచాయతీ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం జరుగుతుందా లేదా అని పరిశీలించి అనుమతులు ఇస్తారు. కానీ ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా నిర్మాణం జరుగుతుంది. ఓ చికెన్ షాప్ యజమాని తనకు అధికార బలం ఉందంటూ విర్రవీగుతూ పంచాయతీ నిబంధనలన్నీ తుంగలో తొక్కి అక్రమ నిర్మాణం జరపడంతో పాటు ఏకంగా మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించాడు. ఎవరైనా వచ్చి పనులను అడ్డుకుంటే తనకు అధికార బలం ఉందంటూ చూపిస్తూ వారిని సైతం ఇబ్బందులు గురిచేస్తున్నారు. దీని పై మండల అధికారులు స్పందించి పంచాయతీలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలని పంచాయతీ ప్రజలు కోరుకుంటున్నారు.

### అనుమతులు లేవు : ఎదురుగడ్డ పంచాయతీ కార్యదర్శి జ్యోతి

అక్రమంగా నిర్మాణం చేస్తున్న మూడంతస్తుల బిల్డింగుకు పంచాయతీ నుంచి నోటీసులు ఇచ్చామని తెలిపారు. అక్రమ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవని పంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చారు.

# స్వతంత్రుల ముసుగులో వస్తే నమ్మకండి!

## అధికారం లేని ప్రత్యర్థులతో అభివృద్ధి సాధ్యమా?
## 'శీనన్న మనిషిని' అని చెప్పుకుంటే బుద్ధి చెప్పండి
## అధికారం మనది.. అభివృద్ధి చేసేది మనమే : మంత్రి పొంగులేటి



**కొత్తగూడెం, ఫిబ్రవరి 5(మనం న్యూస్):** 'ఎన్నికల వేళ స్వతంత్రుల ముసుగులో వచ్చే కొత్త అవతారాలను నమ్మవద్దు.. 'నాకు శీనన్న తెలుసు, ఆయనకు నేను సన్నిహితుడిని' అంటూ మీ ముందుకు వచ్చే వారు ఎవరికీ దగ్గర కాదు' అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పలు డివిజన్లలో నిర్వహించిన రోడ్ షోలలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాజకీయ లబ్ధి కోసం సొంత మనుషులమని చెప్పుకునే వారి పట్ల కార్యకర్తలు, ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

### అధికారం లేని వారికి ఓటెందుకు?

'ప్రభుత్వం మనది, అధికారం మనది. అభివృద్ధి చేసే సత్తా కూడా మనకే ఉంది. కనీసం అధికారం చేతిలో లేని ప్రత్యర్థులు ప్రజలకు ఏం చేస్తారు? వారు ఏ విధంగా అభివృద్ధిని తీసుకువస్తారు?' అంటూ ప్రతిపక్షాల తీరును ఎండగట్టారు. అభివృద్ధి చేయాలన్నా, నిధులు తేవాలన్నా అది అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని స్పష్టం చేశారు.

### ఇండ్లు ఇచ్చేది నేనే.. పట్టాలు ఇచ్చేది నేనే!

గృహ నిర్మాణం, రెవెన్యూ శాఖలు తన వద్దే ఉన్నాయని గుర్తు చేస్తూ, ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చే అధికారం తనకు ఉందని పొంగులేటి పేర్కొన్నారు. ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రారంభిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అధికారం మన దగ్గర ఉన్నప్పుడు ప్రత్యర్థుల మాటలకు తావులేదని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

### సైనికుల్లా కదలండి..

కాంగ్రెస్ - సీపీఎం కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఒక్కో కార్యకర్త రేవంత్ రెడ్డిలా, పొంగులేటిలా మారి విపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. స్వతంత్రుల ముసుగులో వస్తున్న మోసకారి శక్తులకు ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి, కొత్తగూడెంపై హస్తం జెండా ఎగురవేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# భావితరాలను దృష్టిలో పెట్టుకొని మధిర అభివృద్ధి

## సమస్యల పరిష్కారం కోసం'భట్టి' పటిష్ట ప్రణాళికలు
## విలేకరుల సమావేశంలో కొండబాల, రాయల, వాసిరెడ్డి



**మధిర, ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** భావితరాలను దృష్టిలో పెట్టుకొని మధిర పట్టణాన్ని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషి చేస్తున్నారని మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, తెదేపా రాష్ట్ర నాయకులు డా.వాసిరెడ్డి రామనాథం తెలిపారు. గురువారం మధిరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మధిర చరిత్రను ఈ ప్రాంత విశిష్టతను భావితరాలకు అందించడంతోపాటు ఈ ప్రాంత అభివృద్ధికి తొలిసారి 2009 లో శాసనసభ్యులుగా ఎన్నికైనటువంటి ప్రస్తుతడిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభివృద్ధి కోసం పాటుపడ్డారని అన్నారు. మేజర్ గ్రామపంచాయతీ గా ఉన్న మధిరను పట్టణీకరణ దిశగా అడుగులు వేయించేందుకు నగర పంచాయతీగా మార్పు చేసి ప్రత్యేక నిధులను కేటాయించడం జరిగిందని అన్నారు. ఆ తర్వాత పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి అనేది నామమాత్రమే అని అన్నారు. మధిర అభివృద్ధి లక్ష్యంగా సుదీర్ఘమైన ప్రణాళిక కలిగిన భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం బాధ్యతలు స్వీకరించిన తర్వాత మధిరలో అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే సుమారు రూ.600 కోట్ల నిధులతో భూమి పూజలు చేయడం జరిగిందని అన్నారు. మధిర పట్టణాన్ని మోడల్ నియోజకవర్గ కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు భవిష్యత్తులో మరిన్ని నిధులను మంజూరు కు కృషి జరుగుతుంది అన్నారు .మౌలికంగా అభివృద్ధి చేయడం తో పాటు విద్య ఉపాధి రంగాల కు సంబంధించి కూడా ప్రత్యేక దృష్టి సారించి నాలెడ్జ్ హబ్ లను, ఐటి హబ్ లను ఏర్పాటుచేసి ఈ ప్రాంత యువతకు మెరుగైన విద్య ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలపై అభివృద్ధి కమిటీ సిఫారసులతో ప్రత్యేక కార్యకరణకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణీకరణ కు ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా మధిర పట్టణాన్ని మరింత సుందరంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే రీతిలో అభివృద్ధికి కృషి చేయడం జరుగుతున్నది అన్నారు. ఎన్నికల తర్వాత రాజకీయాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అర్హులైన అందరికీ భాగస్వామ్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. అలాగే మధిర అభివృద్ధి కి సంబంధించి కూడా అఖిలపక్ష రాజకీయ పార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో సూచనలను సలహాలను సేకరించి ఈ ప్రాంత అభివృద్ధికి నిధుల కేటాయింపుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషి చేస్తున్నారని తెలిపారు. లోకల్ బాడీ ఎలక్షన్స్ లలో అధికార పార్టీకి సంబంధించి ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడం ద్వారా మరింత శరవేగంగా పనుల నిర్వహణకు కొత్త అభివృద్ధి పథకాల రూపకల్పనకు వాటిని త్వరితగతినపూర్తి చేసేందుకు సానుకూల పరిస్థితులు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశం పార్టీ కలిసి పోటీ చేస్తున్నాయని, ఈ కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజలు మధిర అభివృద్ధికి మద్దతుగా నిలవాలని వారు కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షులు మిర్యాల రమణ గుప్తా, సూరంశెట్టి కిషోర్ ,ముఖ్య నాయకులు దేవిశెట్టి రంగా, తలుపుల వెంకటేశ్వర్లు, కోనదని కుమార్, దోర్నాల సునీల్, తదితరులు పాల్గొన్నారు.



# ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్ కౌంటర్

## మావోయిస్టు డివిసిఎం మృతి

**చర్ల, ఫిబ్రవరి 5(మనం న్యూస్):** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజపూర్ జిల్లా తర్రెం పోలీస్ స్టేషన్ పరిది పెద్ద గెల్లూర్ అటవీప్రాంతంలో గురువారం జరిగిన ఎన్ కౌంటర్ లో రూ.8 లక్షల రివార్డు కలిగిన దక్షణ బస్తర్ మావోయిస్టు పార్టీ కమాండర్, డివిసిఎం సభ్యుడు, ప్లాటూన్ 30 ఇన్ చార్జ్ ఉద్దంసింగ్ మృతిచెందాడు. పెద్ద గెల్లూరు అటవీప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న పక్కా సమాచారంతో డిఆర్జి, ఎస్టిఎఫ్, సిఆర్పిఎఫ్ కోబ్రా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం మావోయిస్టులు ఎదురుపడ టంతో ఇరువర్గాల నడుమ హోరాహోరీగా కాల్పులు చోటుచేసుకున్నాయి. మధ్యాహ్నం వరకు సాగిన కాల్పులలో డివిసిఎం ఉద్దంసింగ్ మృతదేహంతో పాటు ఏకే 47, రెండు మ్యాగజైన్స్, కార్డెక్స్ వైర్, వైర్ లెస్ సెట్, మొబైల్ ఫోన్, పౌచ్, బ్యాక్ ప్యాక్,టిఫిన్ బ్యాగ్, ఇతర మావోయిస్టు సామగ్రి భద్రతా బలగాలు స్వాదీన పరుచుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్ పి డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉద్దం సింగ్ గత మూడేళ్లుగా పామేడ్ ఏరియా కమిటిలో పనిచేస్తూ తెలంగాణా - ఛత్తీస్ ఘడ్ సరిహద్దులో కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇతడిపై 9 క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపారు. 2023 లో తర్రెం పోలీస్ స్టేషన్ పరిదిలోని గుండం అడవులలో పోలీస్ బృందంపై దాడి 2024 బాసగూడ పోలీస్ స్టేషన్ పరిదిలోని పుట్కెల్ - చిరుపుబట్టి అడవులలో ఎన్ కౌంటర్, జీడిపల్లి పోలీస్ స్టేషన్ పై దాడిలో పాల్గొన్నట్లు తెలిపారు. 2026 లో జిల్లాలో జరిగిన వివిధ ఎన్ కౌంటర్లలో 11 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు తెలిపారు. 2024 నుండి 232 మంది మృతిచెందగా 1163 మందిని అరెస్టు చేసామని మరో 888 లొంగిపోయినట్లు వెల్లడించారు.

# అడ్వకేట్ స్వప్నను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

## అడ్వకేట్ రామ్ నరసింహ గౌడ్ డిమాండ్



**రంగారెడ్డి ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** (మేడ్చల్ -మల్కాజి గిరి జిల్లా కోర్టు) కుషాయిగూడా తోటి సహచర చేవెళ్ల కోర్టు న్యాయవాది స్వప్న హత్యను తీవ్రంగా ఖండిస్తు మేడ్చల్-మల్కాజీగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్వకేట్ లు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు.

ఈహత్యకు బాధ్యులైన హంతకులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేస్తూ జిల్లా కోర్టు నుండి పెద్ద ఎత్తున న్యాయవాదులు ర్యాలీ ధర్నా నిర్వహించి స్థానిక కుషాయిగూడా పోలీస్ స్టేషన్ సీఐ లెంకలా భాస్కర్ రెడ్డికి దుండగులను కఠినంగా శిక్షిచాలని పిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ వీరమళ్ళ రామ్ నరసింహ గౌడ్ మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రములో భవిష్యత్తులో న్యాయవాదులపై దాడులు జరగకుండా న్యాయవాద రక్షణ చట్టం వెంటనే తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వీరమళ్ళ రామ్ నర్సింహా గౌడ్₹ డిమాండ్ చేశారు..... ఈ నిరసన కార్యక్రమంలో మేడ్చల్ -మల్కాజీగిరి భార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు..

# న్యాయవాది హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ



**దమ్మపేట, ఫిబ్రవరి 05 (మనం న్యూస్):** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్కు చెందిన మహిళా న్యాయవాది స్వప్న దారుణ హత్యను నిరసిస్తూ దమ్మపేటలోని ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదులు గురువారం నిరసన చేపట్టారు. దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారం సతీష్ కుమార్ బాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై వరుసగా జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని విధి నిర్వహణలో ఉన్న వారిపై ఇలాంటి ఘాతుకాలకు పాల్పడటం హేయమైన చర్య అని మండిపడ్డారు. స్వప్న హత్య కేసులో నిందితులను తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గొంది మురళి మోహన్, ఉడుతనేని శ్రీనివాసరావు, తామా బాలరాజు, కాలం సంధ్యారాణి, అరుణకుమారి, గద్దల అప్పారావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు మెరుగుపరచాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి
- ఔట్ పేషెంట్ సేవలు మెరుగ్గా అందించేందుకు ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకం
- 7 రోజుల వ్యవధిలో లిఫ్ట్ మరమ్మత్తు పూర్తి చేయాలి
- మార్చి 15 నాటికి ఎస్.టి.పి. నిర్మాణం పూర్తి
- ఎఫ్.ఆర్.ఎస్. విధానంలో ఆసుపత్రి సిబ్బంది హాజరు
- ఖమ్మం జనరల్ ఆసుపత్రి పని తీరు, పెండింగ్ పనులపై సమీక్షించిన కలెక్టర్



**ఖమ్మం, ఫిబ్రవరి 05(మనం బ్యూరో):** ఖమ్మం జనరల్ ఆసుపత్రి ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ, ఆసుపత్రిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టర్, కలెక్టరేట్ లోని ప్రజ్ఞ మీటింగ్ హాల్ లో గురువారం ఖమ్మం జనరల్ ఆసుపత్రి పని తీరు, ఆసుపత్రిలో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ఆసుపత్రి వైద్య అధికారులు, మున్సిపల్, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖమ్మం ఆసుపత్రిలో వసతులు మెరుగుపరచాల్సిన అవసరముందన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ పద్ధతిలో వెంటనే మార్పు రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రెండు వారాలకు ఒకసారి ఆసుపత్రి పని తీరుపై ఖమ్మం మున్సిపల్ కమిషనర్ రివ్యూ నిర్వహించాలన్నారు. ఆసుపత్రిలోని 10 స్పెషల్ రూమ్ మరమ్మతుల పనులు మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా చేపట్టి 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎమర్జెన్సీ సమయంలో వినియోగించేందుకు జిజిహెచ్ వద్ద 5 లక్షల రూపాయలు నిరంతరం అందుబాటులో పెడతామని, ఏ విభాగంలో నైనా వైద్య పరికరాలు, యంత్రాలు అవసరం ఉంటే, వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో కోటి 65 లక్షలతో చేపట్టిన టాయిలెట్స్ లను రాబోయే నెల రోజుల వ్యవధిలో 100 శాతం పూర్తి చేసి, టాయిలెట్స్ నిర్మాణంతో పాటు వాటి నిర్వహణకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో ఆర్.ఎం.ఓ. లను నియమించి పాలన వ్యవహారాలు వారికి అప్పగించాలని కలెక్టర్ సూచించారు. ఎం.సి.హెచ్. లోని సీవర్ లైన్స్, టాయిలెట్స్ పనులు ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆసుపత్రి ముందు ఉన్న ఖాళీ స్థలంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఓపి రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక బ్లాక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఓపి కోసం 3 డేటా ఎంట్రీ ఆపరేటర్ లను తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో లిఫ్ట్ మరమ్మత్తు పనులు పూర్తి కాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి, 7 రోజుల్లో లిఫ్ట్ పని చేయాలన్నారు. ఆసుపత్రి అవసరాల కోసం ప్రస్తుత వాటర్ సంప్ సరిపోవడం లేదని, మరో 200 కేఎల్ సామర్థ్యంతో కూడిన సంప్ నిర్మించాలని అన్నారు. వర్షా కాలం ముందే ఆసుపత్రి భవనం నుండి ఎక్కడా వాటర్ లీకేజి కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఎస్.టీ.పి. పెండింగ్ నిర్మాణ పనులను మరొక కాంట్రాక్టర్ తో చేపట్టి మార్చి 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో అవసరమైన ఫైర్ సేఫ్టీ పనులు, సిసి కెమెరాల ఏర్పాటు మార్చి 15 నాటికి ఏర్పాటు చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమీషనర్‌కు సూచించారు. ఆసుపత్రి వద్ద రోడ్డు పై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన భద్రత ఏర్పాట్లు ఉండాలన్నారు.

ఆసుపత్రిలో అవసరమైన అంతర్గత రోడ్లు, ఫుట్ పాత్ తో సహా నిర్మాణ పనులు చేపట్టి నెలాఖరు వరకు పూర్తి చేయాలని అన్నారు. నెలకు 55 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఆసుపత్రిలో ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం ఉండటం లేదని కలెక్టర్ అన్నారు. పారిశుద్ధ్య పని తీరు సరిగ్గా లేదంటూ సంబంధిత ఏజెన్సీలకు నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్యం పని తీరు ఇంప్రూవ్ కాని పక్షంలో సదరు ఏజెన్సీ రద్దు చేయాలని డీఎంఈకు లేఖ రాయాలని అన్నారు. ఆసుపత్రిలో ఎఫ్.ఆర్.ఎస్. విధానంలో పారిశుద్ధ్య సిబ్బంది హాజరు నమోదయ్యేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎఫ్.ఆర్.ఎస్. హాజరు రిపోర్ట్ ఆధారంగా పారిశుద్ధ్య సిబ్బందికి సంబంధించి జీతాలు చెల్లింపు చేయాలని అన్నారు. బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఫిబ్రవరి 11 నాటికి బయో మెడికల్ ఇంజనీర్ తాత్కాలికంగా నియామకం చేపట్టాలని, ఆసుపత్రి కోసం అవసరమైన సామాగ్రి కొనుగోలుకు అందించిన ప్రతిపాదనలు ఫాలో అప్ చేస్తూ త్వరగా ఆసుపత్రికి చేరేలా చూడాలని, టిఫ్ఫా స్కానింగ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత 3 నెలలుగా జనరల్ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య తగ్గుతుందని అన్నారు. అత్యంత క్లిష్టమైన హై రిస్క్ కేసులను గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేసిన తర్వాత ఆ కేసులను ఫాలో అప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, మునిసిపల్ సహాయ కమిషనర్ అనిల్ కుమార్, వివిధ విభాగాల వైద్య అధికారులు, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యానవనాల అభివృద్ధికి కీలక అడుగులు

- 6 పార్కుల అభివృద్ధికి మంత్రి టీ.జీ. భరత్ శంకుస్థాపన



కర్నూలు ఫిబ్రవరి 05మనం న్యూస్: నగరంలో పచ్చదనాన్ని పెంపొందించి ప్రజలకు మెరుగైన విశ్రాంతి వాతావరణం కల్పించే దిశగా ఉద్యానవనాల అభివృద్ధికి కీలక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ.1.05 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్న ఆరు పార్కుల పనులకు మంత్రి, కమిషనర్ పి.విశ్వనాథ్తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంలో భాగంగా ఒకేసారి రూ.1.05 కోట్లతో ఆరు పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. 2019 నుంచి 2024 వరకు పార్కులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. తమ తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో అనేక కాలనీల్లో పార్కులకు స్థలాలు గుర్తించి అభివృద్ధి చేశారని, అనంతరం వచ్చిన ఎమ్మెల్యేలు వాటిపై నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పార్కులను అభివృద్ధి చేస్తామని, ప్రతి పార్కులో నడకబాటలు, జిమ్ వంటి సదుపాయాలు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన గాలి కోసం విస్తృతంగా మొక్కలు నాటడం జరుగుతుందని చెప్పారు. పార్కుల అభివృద్ధి నగర సౌందర్యాన్ని పెంచడమే కాకుండా ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడుతుందని పేర్కొన్నారు. పిల్లలు, యువత, వృద్ధులు సేదతీరేలా అవసరమైన సదుపాయాలతో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో హరిత వాతావరణాన్ని మరింత విస్తరించే చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు. కమిషనర్ మాట్లాడుతూ.. 45వ వార్డులోని ప్రేమ్నగర్ పార్క్-2ను రూ.15 లక్షలతో, 44వ వార్డులోని ఎంపీఎల్ ఎంప్లాయిస్ కాలనీ పార్కు రూ.15 లక్షలతో, ఎల్ఐసీ కాలనీ పార్కు రూ.25 లక్షలతో, 24వ వార్డులోని మధుర్నగర్ పార్కు రూ.15 లక్షలతో, 23వ వార్డులోని సీ క్యాంప్ పార్కు రూ.15 లక్షలతో, 25వ వార్డులోని బిర్లా భావన్ పార్కు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, డిసిపి వెంకటరమణ, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈలు కృష్ణలత, పవన్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేయండి



- షాద్ నగర్ డిసిపి సిహెచ్ శిరీష
- షాద్ నగర్ పట్టణం పోలీసుల ఫ్లాగ్ మార్చ్

షాద్ నగర్ ఫిబ్రవరి 05 (మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని ఎవరికీ భయపడాల్సిన పరిస్థితి లేదని ప్రజలకు పోలీస్ శాఖ అండగా నిలబడుతుందని షాద్ నగర్ డిసిపి సిహెచ్ శిరీష అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో డిసిపి శిరీష ఆధ్వర్యంలో పట్టణ ముఖ్య ప్రాంతాలలో సుమారు రెండు వందల మంది పోలీసు సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు. ఫరూక్ నగర్, షాద్ నగర్ పట్టణ ముఖ్య ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి శిరీష మాట్లాడుతూ ప్రజల భద్రత కోసమే పోలీసు పని చేస్తుందని, ప్రజల్లో నమ్మకాన్ని కలిగించేందుకు పట్టణంలోని వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని, ప్రజల సేవకే పోలీసు సిబ్బంది ఉన్నదని, పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహిస్తామని, శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే వదిలి పెట్టమని, ప్రతి ఒక్కరు మున్సిపల్ ఎన్నికలలో నిర్భయంగా తమ ఓటు వినియోగించుకోవాలని పట్టణ ప్రజలకు సూచించారు. గతంలో ఏసిపి లక్ష్మీనారాయణ, సీఐలు విజయకుమార్, చంద్ర శేఖర్, సర్వయ్య, శ్రీనివాస్, సహారె, వెంకటేశ్వర్లు అన్ని మండలాల ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## సీమలో సాగునీటి సమస్యలు తీర్చటమే లక్ష్యం



- వైయస్సార్సీపీ నాయకులు

జూపాడుబంగ్లా,ఫిబ్రవరి 5 (మనం న్యూస్): రాయలసీమ ప్రజల సాగు, త్రాగునీటి సమస్యలు తీర్చటమే లక్ష్యంగా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఉద్యమ బాట అని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 5 వ తేదీన గురువారం జూపాడుబంగ్లా పోతిరెడ్డిపాడు గ్రామంలో వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి , వైయస్సార్సీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి,నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త ధారా సుధీర్, ఆధ్వర్యంలో పోతిరెడ్డిపాడు గ్రామంలో గురువారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాయలసీమ ప్రాంతానికి అన్యాయం చేయడం కూటమి ప్రభుత్వ సీఎం నారా చంద్రబాబు నాయుడు,కి అలవాటుగా మారిందని వైయస్సార్సీపీ పార్టీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్రంగా విమర్శించారు.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే సీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలో కూడా తాగునీరు, సాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైయస్సార్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి , కాకాని గోవర్ధన్ రెడ్డి , నంద్యాల, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, కడప, అన్నమయ్య నెల్లూరు, ప్రకాశం, ఒంగోలు జిల్లాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## ఏపీ సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- రాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



కర్నూలు, ఫిబ్రవరి 05మనం న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల పర్యటనలో ఏటువంటి పొరపాట్లకు తావివ్వకుండా విజయవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి వర్యులు అనగాని సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. ఈ నెల 6 వ తేదీన ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాజముద్రతో కూడిన పట్టాదార్ పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్న సందర్భంగా అందుకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి వర్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి గ్రామ సభ ప్రాంగణం వద్ద చేస్తున్న ఏర్పాట్లు, స్టాల్ ఏర్పాట్లు, గ్రీన్ రూమ్ ఏర్పాట్లు, పార్కింగ్, హెలిప్యాడ్, భద్రత పరంగా తీసుకుంటున్న చర్యలు అన్నిటిని పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సభకు హాజరయ్యే ప్రజలు, రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్రాగునీరు, భోజనం ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్, అడిషనల్ సిసిఎల్ఏ వెంకట మురళి, జాయింట్ సెక్రటరీ చేతన్, స్థానిక శాసనసభ్యులు జయ నాగేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్‌లో కేజీ గంజాయి సీజ్



రంగారెడ్డి, ఫిబ్రవరి 5 (మనం న్యూస్): సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1.110కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహమ్మద్ జహీర్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారం అందడంతో అరెస్టు చేసి అతని వద్ద కేజీ 110 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# రాష్ట్రానికి నిధులు శూన్యం

- సిపిఎం సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి



తుగ్గలి, ఫిబ్రవరి 5(మనం న్యూస్): కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయించిన నిధులు శూన్యమని మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్ రెడ్డి కుమారుడు, సిపిఎం సీనియర్ నాయకులు ఎర్రగుడి భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం జి. ఎర్రగుడి గ్రామంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2026/27 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైన బడ్జెట్ అని ఆరోపించారు. సామాజిక న్యాయం అన్న భావన కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలలో ఎక్కడా కనిపించలేదు అన్నారు. మాటలలో సబ్ కా సాథ్ విధానాలలో కొద్ది మందికే సౌకర్యం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీలకు ఈ బడ్జెట్లో ఎలాంటి ఆధారాలు లేవన్నారు. కనీస మద్దతు ధరకే చట్టబద్ధ హామీపై ఒక్క మాట లేదన్నారు. ఎరువుల సబ్సిడీ తగ్గింపు, వ్యవసాయ పెట్టుబడుల ప్రభుత్వ రైతులను మరింత అప్పులలోకి నెట్టే ప్రమాదము ఉందన్నారు.జ వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించే మార్గము ఈ బడ్జెట్ లో ఏ కోశాన కనిపించడం లేదన్నారు. రైతులు, కార్మికులు, పేదలను పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ గాని, విభజన హామీలలో కాని, ఏ ఒక్కటి అమలుకు నోచుకోలేదన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుకు రూ.21 వేల కోట్లు అవసరము ఉండగా కేవలము రూ.300 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని తెలిపారు. చంద్రబాబు నాయుడు 2027 నాటికే పోలవరం పూర్తి చేస్తానని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడానికే తప్ప మరొకటి లేదన్నారు. రైతులు ఆత్మహత్యలు నివారించడానికి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు, ఇంప్లిమెంట్ కోసము బడ్జెట్ లో కేటాయించలేదని, రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారని, విద్య, వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేశారని తెలిపారు. తెలుగుదేశం యం.పి.ల సొద్దులతో కొనసాగుతున్న మోదీ ప్రభుత్వాన్ని చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని విమర్శించకపోగా, పొగడ్తలతో ముంచెత్తడము హాస్యాస్పదంగా వున్నదన్నారు. ఇది ముమ్మాటికీ కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని దీనిని ప్రజలందరు వ్యతిరేకించాలని ఆయన కోరారు.పాత్రికేయుల సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి శ్రీ రాములు సిపిఎం నాయకులు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ నిర్లక్ష్యం - రోడ్లపై పందుల రాజ్యం



దేవనకొండ, ఫిబ్రవరి 05 (మనం న్యూస్): దేవనకొండ గ్రామంలో పందులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజల జీవన విధానాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయ పరిసరాలు, ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు అన్నిచోట్ల పందులు తిరుగుతూ వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్లపై అకస్మాత్తుగా పందులు అడ్డుగా రావడంతో చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పందుల వల్ల చెత్త చిందర వందరగా మారి పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో దోమలు, ఈగలు పెరిగి వ్యాధుల ముప్పు కూడా పెరుగుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో పందులు దూకుడుగా ప్రవర్తిస్తూ ప్రజలపై దాడికి ప్రయత్నించిన సంఘటనలూ చోటుచేసుకున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనపడటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పందుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం, వీధుల్లో సంచరించే పందులను పట్టుకుని గ్రామానికి బయటకు తరలించడం, పారిశుద్ధ్య చర్యలను క్రమం తప్పకుండా చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజల భద్రత, ఆరోగ్యం దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని దేవనకొండ వాసులు కోరుతున్నారు.

## ఫుడ్ కోర్ట్‌లో అగ్నిప్రమాదం



రంగారెడ్డి ఫిబ్రవరి 5 (మనం న్యూస్): మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తా నుంచి బడంగ్‌పేట్ వెళ్లే ప్రధాన రహదారిపై లెనిన్ నగర్లో ఉన్న ఫుడ్ కోర్ట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.స్థానికుల సమాచారం మేరకు మీర్‌పేట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు.అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఫుడ్ కోర్ట్ మూసివుండటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## చదువు ఒత్తిడితో కాదు శ్రద్ధతో చదవండి





- విశ్రాంత ఎమ్మార్వో శేక్షావలి
- కో-ఆప్షన్ మెంబర్ మాబు సాబ్

కౌతాళం, ఫిబ్రవరి 05 మనం న్యూస్: బదినేహాల్ గ్రామంలో జిల్లా పరిషత్ కన్నడ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థుల మోటివేషన్ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ఎమ్మార్వో షి.షేక్షావలి ఖాను ఖన్నించిన ఊరిపై మమకారంతో పదవ తరగతి విద్యార్థుల పై ప్రత్యేక అభిమానంతో మోటివేషన్ క్లాస్ తరగతులకు విశ్రాంత ఎమ్మార్వో శేక్షావలిసాబ్ ని కౌతాళం మండలం కో ఆప్షన్ మెంబర్ బి.మాబుసాబ్ ఆహ్వానించడం జరిగింది. ఆహ్వానాన్ని మన్నించి షేక్షావలి సార్ గురువారం రోజు హాజరై విద్యార్థులకు పదవతరగతి పరీక్షలను ఏ విధంగా ఎదుర్కోవాలి,ఒత్తిడికి గురికాకుండా శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.మనిషి ఉన్నతికి విద్య ప్రధానమైనదని కావున విద్యార్థులు చక్కగా చదివి గ్రామానికి మరియు పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పేర్కొన్నారు.మండల కో ఆప్షన్ మెంబర్ బి.మాబుసాబ్ మాట్లాడుతూ మా ఆహ్వానాన్ని మన్నించి మా పాఠశాలకు వచ్చి విద్యార్థులకు తమ విలువైన విషయాలను చెప్పి ఉత్సాహపరిచిన విశ్రాంత ఎమ్మార్వో శేక్షావలి సార్ కి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సార్ సూచనలను పాటించి పాఠశాల విద్యార్థులు గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరుకుంటున్నాను అని అలాగే పాఠశాల తరఫున ప్రథమ శ్రేణిలో మరియు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నా తరఫున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందము విద్యార్థి విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఐటీఎం కళాశాలలో మెగా జాబ్ మేళా



- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , ఆర్ఐటీఎం కాలేజ్

పాణ్యం మండలం ఫిబ్రవరి 6 తేదీన ( శుక్రవారం ): ఉదయం 10గం.ల నుండి సాయంత్రం 4గం.ల వరకు 10 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ డిప్యూటీ కలెక్టర్ గారు అఖిల మరియు రోహిణి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, ఈ ప్రకటన లో తెలిపారు. ఈ జాబ్ మేళా అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, ముత్తూట్ ఫైనాన్స్ , ఫ్లిప్‌కార్ట్ , వరుణ్ మోటార్స్ ఇతర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఇంటర్మీడియట్,డిప్లొమా ,డిగ్రీ , బి.టెక్ మరియు ఆపై చదువు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూ కు పాన్ కార్డు ,ఆధార్ కార్డు మరియు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం 10,000/- నుండి 20,000 వరకు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగి పరుచుకోవాలని రోహిణి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, ఏపీఎస్ఎస్‌డీసీ తెలిపారు.

## తెలుగుదేశం పార్టీతోనే అందరికీ భవిష్యత్తు



- మంత్రి టీజీ భరత్

కర్నూలు ఫిబ్రవరి 05మనం న్యూస్: తెలుగుదేశం పార్టీతోనే నాయకులందరికీ భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని ఎం.ఆర్.సి ఫంక్షన్ హాలులో తెలుగుదేశం పార్టీ కర్నూలు పార్లమెంట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్లమెంట్ అధ్యక్షురాలిగా గుడిసె క్రిష్టమ్మ, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు యాదవ్, ఉపాధ్యక్షులుగా సోమిశెట్టి శ్రీకాంత్, తదితరులు, ఇతర కార్యవర్గం మొత్తం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అన్ని సమీకరణాలు పరిశీలించి అధిష్టానం కొత్త కమిటీని ఎంపిక చేసిందన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు దక్కిందన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించేందుకు కొత్త కమిటీ కష్టపడాలని ఆయన సూచించారు. ఇక బహిరంగ వేదికల్లో పార్టీకి డ్యామేజ్ అయ్యేవిధంగా ఎవరు ప్రవర్తించొద్దని చెప్పారు. పెద్ద కుటుంబంలాంటి తెలుగుదేశం పార్టీలో నాయకుల మధ్య ఇబ్బందులుంటే కూర్చొని మాట్లాడుకోవాలన్నారు. 19 నెలల కాలంలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం జీవితాంతం కొనసాగాలని తాను కోరుకుంటున్నట్లు మంత్రి టీజీ భరత్ అన్నారు. ఇక వైసీపీ నేతల అలోచన విధానం ఓడిపోయినప్పటికీ మారలేదన్నారు. ఆ పార్టీలో బూతులు మాట్లాడే వారికే మార్కులు పడతాయన్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డిని మార్చి వేరే వారికి అవకాశం ఇస్తే బాగుంటుందన్నారు. ప్రజలందరికీ వైసీపీ నేతల అరాచకాలు అర్థమయ్యేలా చెప్పాలని, వైసీపీ ధోరణిని ప్రజలు ప్రోత్సహించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రధానం



కర్నూలు, ఫిబ్రవరి 05మనం న్యూస్: దక్షిణ అమెరికా ఖండానికి చెందిన రిపబ్లిక్ ఆఫ్ పెరూ దేశానికి చెందిన వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ది ఆర్ట్స్ లిటరేచర్ ఎడ్యుకేషన్ పీస్ అండ్ కల్చర్ ఇన్స్టిట్యూట్ యూనివర్సల్ డాక్టరల్ కాలేజియేట్ కౌన్సిల్ ఆఫ్ ఎక్సలెన్స్, యునైటెడ్ నేషన్స్ చే గుర్తించబడిన ఫెడరేషన్ సంస్థ చే కర్నూలుకు చెందిన ప్రముఖ సామాజికవేత్త సైన్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు గత 35 సంవత్సరాలుగా అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తున్నందుకు గాను గుర్తింపుగా లయన్ అంబాసిడర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసుకు నేడు జరిగిన అంతర్జాల అంతర్జాతీయ సదస్సులో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ది ఆర్ట్స్ లిటరేచర్ ఎడ్యుకేషన్ పీస్ అండ్ కల్చర్ ఇన్స్టిట్యూట్ యూనివర్సల్ అధ్యక్షులు మిగుల్ లియొనారుడో గార్సియా క్విరోజ్, రెక్టర్ ఆఫ్ ది డాక్టరల్ కౌన్సిల్ క్యాథోన్ ది గ్లోబల్ బోర్డ్ మెంబర్ రూత్ మెరోరా డి మెండేజ్ లు 2025 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్టాత్మకమయిన గౌరవ డాక్టరేట్ ను అందజేశారు.



# నేను పశ్చాత్తాప పడుతున్నా

## ఎప్‌స్టీన్ కుంభకోణంపై బిల్‌గేట్స్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 5:** ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆ వ్యవహారంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించిన పలు విషయాలు వెల్లడయ్యాయి. దీనిపై తాజాగా గేట్స్ స్పందించారు. అతడితో ఉన్న ప్రతీ క్షణానికి చింతిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు ఆస్ట్రేలియా మీడియా సంస్థతో మాట్లాడారు.

''ఎప్‌స్టీన్ కోసం కేటాయించిన ప్రతీ క్షణానికి ఇప్పుడు నేను చింతిస్తున్నాను. అందుకు క్షమాపణలు కోరుతున్నాను. అయితే ఆ ఈ-మెయిల్లో ఉన్నది నిజం కాదు. అప్పుడు అతడి ఆలోచన ఏంటో నాకు తెలియదు. ఏదోఒక రూపంలో అతడు నన్ను టార్గెట్ చేయాలని ప్రయత్నించాడా..?'' అని వ్యాఖ్యలు చేశారు. ఆ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి 30 లక్షల పేజీలను అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో గేట్స్‌కు సంబంధించిన ఓ విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాలు నెరిపాడని.. అందువల్లే ఆయన సుఖవ్యాధుల బారినపడ్డారని ఎప్‌స్టీన్ ఆరోపణలు చేశాడు.

2013లో తనకి తాను రాసుకున్న ఈ-మెయిల్లో అతడు ఈ విషయాలు ప్రస్తావించాడు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆయన మిలిందా (గేట్స్ మాజీ భార్య)కు రహస్యంగా ఇచ్చేందుకు యాంటీబయాటిక్స్‌ను అడిగారని రాసుకొచ్చాడు. ఆ పరిణామాల తర్వాత తనతో ఉన్న ఆరేళ్ల స్నేహాన్ని గేట్స్ తెంచుకున్నాడని ఎప్‌స్టీన్ వెల్లడించాడు.

అయితే ఈ-మెయిల్లోని అంశాలను గేట్స్ బృందం ఖండించింది. ఇదిలాఉంటే.. ఈ ఫైళ్ల విడుదల తర్వాత మిలిందా స్పందించిన సంగతి తెలిసిందే. ''నా వివాహంలో ఎంతో బాధించే కొన్ని విషయాలు ఉన్నాయి. ఇప్పుడు బయటకు వచ్చిన వాటిపై సమాధానం ఇవ్వాల్సింది బిల్‌గేట్స్.. నేను కాదు. బాధిత మహిళలకు న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నా'' అని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ బిల్‌గేట్స్ - మిలిందా దంపతులు 2021లో విడాకులు తీసుకున్నారు. ఎప్‌స్టీన్‌తె గేట్స్‌కు సంబంధాలు ఉండడం నచ్చని మిలిందా ఆయన నుంచి విడాకులు తీసుకున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి.

# నోరు జారొద్దు..

## ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు చూస్తాం

### తేల్చిచెప్పిన భారత్ ● బ్లూమ్‌బర్గ్ కథనం



**వాషింగ్టన్ , ఫిబ్రవరి 5 :** అమెరికా- భారత్ల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఒప్పందానికి కొన్ని నెలల ముందు ఇరుదేశాలకు చెందిన నాయకుల మధ్య జరిగిన కీలక సమావేశానికి సంబంధించిన విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ట్రేడ్ డీల్ కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు వేచి చూస్తామని నాడు భారత్ తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. కథనం ప్రకారం.. సెప్టెంబరు ప్రారంభంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ , యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియోల మధ్య సమావేశం జరిగింది. ఆ సమయంలో భారత ప్రభుత్వంపై, ప్రధాని మోడీపై ట్రంప్, ఆయన వాణిజ్య సలహాదారు పీటర్ నవారో సహా పలువురు అధికారులు నోరు పారేసుకోవడం, టారిఫ్ల విషయంలో పలుమార్లు బెదిరింపులకు పాల్పడిన విషయం కూడా తెలిసిందే. నాడు జరిగిన భేటీలో భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలియజేసింది. 'ట్రంప్, ఆయన పరిపాలనాధికారుల బెదిరింపులకు భారత్ తలొగ్గదు. ట్రేడ్ డీల్ కోసం ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు వేచి ఉండటానికి కూడా సిద్ధంగా ఉన్నాం' అని డోభాల్ రూబియోతో చెప్పినట్లు బ్లూమ్‌బర్గ్ పేర్కొంది.దీంతోపాటు భారత్‌పై బహిరంగ విమర్శలు తగ్గిస్తే ఇరుదేశాల మధ్య సంబంధాలు మళ్లీ గాడిలోకి వస్తాయని డోభాల్ స్పష్టం చేశారు. ఈ సమావేశం జరిగిన కొన్ని రోజులకే ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ప్రధాని మోడీకి ట్రంప్ పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఆ సమయంలో ప్రధానిపై అమెరికా అధ్యక్షుడు ప్రశంసలు కురిపించారు. ఈ సమావేశం గురించి అమెరికా విదేశాంగ ప్రతినిధి మాట్లాడుతూ.. ప్రైవేటు చర్చల వివరాలు బయటకు వెల్లడించలేమన్నారు. ఇక, భారత్ దీనిపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

# ఏ దేశం నుంచైనా భారత్ చమురు కొనొచ్చు

## ఆ దేశానికి స్వేచ్ఛ ఉంది: రష్యా



**మాస్కో, ఫిబ్రవరి 5 :** ప్రపంచంలోని ఏ దేశం నుంచైనా భారత్ చమురును కొనుగోలు చేయవచ్చని, ఆ దేశానికి ఆ స్వేచ్ఛ ఉందని రష్యా స్పష్టం చేసింది. విభిన్న ముడి చమురు సరఫరాదారులను ఆ దేశం ఆశ్రయించడం కొత్తేమీ కాదని పేర్కొంది. 'భారత్‌కు రష్యా ఒక్కటే చమురును సరఫరా చేయడం లేదన్న విషయం మాతోపాటు అంతర్జాతీయ ఇంధనరంగ నిపుణులందరికీ తెలుసు. ఆ దేశం ఎప్పటి నుంచో ఇతర దేశాల నుంచీ చమురును కొనుగోలు చేస్తోంది. అందువల్ల భారత్ చమురు కొనుగోళ్లను నిలిపేయడం కొత్త విషయంగా తోచడం లేదు' అని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు.

భారత్, రష్యాల మధ్య హైడ్రోకార్బన్ల వాణిజ్యం ఇద్దరికీ లాభదాయకమని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా తెలిపారు.

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారతీయ రిఫైనరీలు పూర్తిగా ఆపలేవని ఆ దేశ జాతీయ ఇంధన భద్రతా నిధి నిపుణుడు ఐగోర్ యుష్కోవ్ స్పష్టం చేశారు. 'అమెరికా ఎగుమతి చేసే షేల్ చమురు తక్కువ గ్రేడ్లు కలిగి ఉంటుంది. గ్యాస్ కూడా తక్కువ కండెన్సేట్‌తో ఉంటుంది. వాటితో పోలిస్తే రష్యా భారీ, సల్ఫర్ అధికంగా ఉండే యూరల్స్‌ను సరఫరా చేస్తుంది. తక్కువ గ్రేడ్లు ఉండే చమురును అమెరికా నుంచి భారత్ అధిక ధరకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అంటే ప్రత్యామ్నాయం అంత సులభం కాదని అర్థమవుతోంది. పైగా రష్యా రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల బ్యారెళ్ల చమురును సరఫరా చేస్తోంది. అంత పరిమాణంలో అమెరికా చేయలేదు' అని యుష్కోవ్ వ్యాఖ్యానించారు. 2022లో భారత్ అమెరికా, ఇతర దేశాల నుంచి చమురు కొనడంవల్ల బ్యారెల్ ధర 120 డాలర్లకు పెరిగిందని వివరించారు.

# ఆర్ఏసీకింద బెర్త్ లభించకుంటే..

## టికెట్ ఛార్జీలో కొంత తిరిగివ్వాలి!

### పార్లమెంటరీ కమిటీ



**ఢిల్లీ, ఫిబ్రవరి 5 :** రైలు ప్రయాణంలో ఆర్ఏసీ కేటగిరి కింద బుక్ చేసుకున్న టికెట్లకు పూర్తి ఛార్జీ వసూలు చేయడం సమర్థనీయం కాదని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. ఆర్ఏసీలోనే ఉండి బోర్డింగ్ సమయంలో బెర్త్ లభించని ప్రయాణికులకు ఛార్జీలో కొంత మేర తిరిగి ఇవ్వాలని సూచించింది. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ''పంక్చువాలిటీ అండ్ ట్రావెల్ టైమ్ ఇన్ ట్రైన్ ఆపరేషన్స్ ఇన్ ఇండియన్ రైల్వేస్'' పేరుతో పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో ప్రజాపద్దుల కమిటీ పేర్కొంది.

ప్రస్తుతం ఆర్ఏసీ కింద బెర్త్ బుక్ చేసుకునే ప్రయాణికుల నుంచి పూర్తి మొత్తంలో టికెట్ ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఇదే కేటగిరి కింద ఉండే మరో ప్రయాణికుడితో బెర్త్ పంచుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇద్దరు ప్యాసింజర్లు పూర్తి మొత్తాన్ని చెల్లిస్తున్నారు. ఇలాంటి ప్రయాణికులకు టికెట్‌లో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించాలని, ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యలను తెలియజేయాలని పార్లమెంటరీ కమిటీ ఆదేశించింది.

# పుతిన్, ట్రంప్లకు జిన్పింగ్ ఫోన్

● బంధం బలోపేతంపై చర్చ

**బీజింగ్:** చైనా అధినేత షీ జిన్పింగ్.. బుధవారం రష్యా, అమెరికా అధ్యక్షులు పుతిన్, ట్రంప్లతో ఫోన్లో మాట్లాడారు. పుతిన్తో మాట్లాడిన కొద్ది గంటల్లోనే ఆయన ట్రంప్తోనూ మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా ఒకే రోజు కొద్ది గంటల వ్యవధిలో జిన్పింగ్ ఇద్దరు అగ్ర నేతలతో మాట్లాడటం అరుదు. రష్యా, చైనాల మధ్య బంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో పుతిన్తో చర్చలు జరిపినట్లు సమాచారం. రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి భారీ ప్రణాళిక అవసరమని పుతిన్తో జిన్పింగ్ అన్నారు. అలాగే జపాన్తో సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ట్రంప్తో జిన్పింగ్ మాట్లాడినట్లు భావిస్తున్నారు. కాగా ఇరాన్ అంశంపై జిన్పింగ్తో చర్చించానని ట్రంప్ తెలిపారు. తైవాన్పైనా, ఏప్రిల్లో తన చైనా పర్యటనపైనా చర్చించామని వెల్లడించారు. వాణిజ్య అంశాలూ చర్చకు వచ్చాయని తెలిపారు. ఇరాన్ విషయంలో తమకు సహకరించాలని జిన్పింగ్ను ట్రంప్ కోరినట్లు తెలిసింది.

# చమురు కొనుగోళ్లు.. 140 కోట్లమంది

● ఇంధన భద్రతకే ప్రాధాన్యం

● భారత విదేశాంగశాఖ



**ఢిల్లీ, ఫిబ్రవరి 5 :** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు నిలిపేసి.. అమెరికా, వెనెజువెలా నుంచి దిగుమతి చేసుకుంటుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ఈ అంశంపై భారత విదేశాంగశాఖ స్పందించింది. 140 కోట్లమంది దేశ ప్రజల ఇంధన భద్రతే తమకు అత్యంత ప్రాధాన్య అంశమని, చమురు సేకరణ విషయంలో ప్రభుత్వ విధానాలకు ఇదే మూలమని స్పష్టం చేసింది. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా విభిన్న సరఫరాదారులను ఆశ్రయించడం అనేది ప్రభుత్వ వ్యూహంలో భాగమని పేర్కొంది.

''వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో వెనెజువెలా చాలా కాలంగా భారత్ భాగస్వామిగా ఉంది. గతంలో ఆ దేశం నుంచి చమురు, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నాం. ఇంధన భద్రత విషయంలో మా విధానాలకు అనుగుణంగా.. వెనెజువెలా సహా ఏ దేశం నుంచైనా ముడి చమురు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం'' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ ఓ మీడియా సమావేశంలో చెప్పారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం దేశ ఎగుమతులు, పరిశ్రమలు, ఉద్యోగ కల్పన, వృద్ధి, ప్రజల సంక్షేమానికి ఊతమిస్తుందని తెలిపారు. మరోవైపు.. ఇటీవలి ఇరాన్ ఆందోళనల సమయంలో అక్కడ ఉన్న భారతీయులు మృతి చెందినట్లు, తప్పిపోయినట్లు నివేదికలేవీ లేవని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు పార్లమెంటుకు తెలిపింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక భారత పౌరులతో నిత్యం సంప్రదింపుల్లో ఉందని విదేశాంగశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. తాజా అంచనాల ప్రకారం.. ఆ దేశంలో దాదాపు 10 వేలమంది ప్రవాస భారతీయులు ఉన్నట్లు చెప్పారు.

# 10 రోజుల ముందే సోషల్ మీడియా ఖాతాలు డిలీట్

## అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య కేసులో మరిన్ని వివరాలు



**ఘజియాబాద్, ఫిబ్రవరి 5 :** ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్లో ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంచలనం సృష్టిస్తోంది. ఆన్‌లైన్ గేమ్ ఆడొద్దన్నందుకు మనస్తాపానికి గురై నిషిక (16), ప్రాచీ (14), పఖీ (12) బుధవారం ఉదయం బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. వీరు సోషల్ మీడియాలో కొరియన్ పేర్లతో ఖాతాలు తెరిచినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఆత్మహత్యకు 10 రోజుల ముందే వారి సోషల్ అకౌంట్లను బాలికల తండ్రి డిలీట్ చేసినట్లు తెలిసింది.

ఈ ముగ్గురు బాలికలు సోషల్ మీడియాలో మరియా, అలీజా, సిండీ అనే కొరియన్ పేర్లతో ఖాతాలు తెరిచారు. ఇంట్లో కూడా వీరు అదే పేర్లతో పిలుచుకునేవారట. 10 రోజుల క్రితం ఈ అకౌంట్ల గురించి తండ్రి చేతన్‌కుమార్‌కు తెలియడంతో ఆ ఖాతాలను డిలీట్ చేశారు. బాలికల వద్ద నుంచి మొబైల్ ఫోన్లను కూడా లాగేసుకున్నారని దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఇక, చేతన్‌కు రూ.2 కోట్ల వరకు అప్పులున్నాయి. దీంతో ఇంటి అవసరాల కోసం అమ్మాయిల ఫోన్లను ఆయన విక్రయించినట్లు పోలీసులు వెల్లడించారు. అంతేగాక, ఇలాగే ఉంటే పెళ్లి చేస్తానని చేతన్ తన కుమార్తెలను హెచ్చరించినట్లు తెలిపారు.

### క్షమించండి నాన్నా..

### కొరియా అంటే ప్రాణం

తండ్రి తమ సోషల్‌మీడియా ఖాతాలను డిలీట్ చేయడం, ఫోన్లు లేకపోవడంతో గేమ్‌లు, కె-డ్రామా సిరీస్‌లు చూడలేకపోవడంతో ఆ ముగ్గురు అమ్మాయిలు తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. దీని గురించి తమ డైరీలో రాసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ''కొరియానే మా ప్రాణం. ఈ విషయం మీకు ఎప్పటికీ అర్థం కాదు.

మేం ఇక్కడివాళ్లను పెళ్లి చేసుకోలేం'' అని వారు ఆ డైరీలో రాసినట్లు పేర్కొన్నారు. గత రెండేళ్ల నుంచి ఈ అమ్మాయిలు స్కూల్‌కు వెళ్లట్లేదని పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులు వారిని స్కూల్‌కు పంపించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ట్రంప్ అణు మెలిక

## 'న్యూ స్టార్ట్'లోకి చైనాను లాగే ప్రయత్నం

## నేటితో ముగియనున్న ఒప్పందం



**వాషింగ్టన్, ఫిబ్రవరి 5 :** ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలున్న దేశాలు అమెరికా, రష్యా. ఈ రెండింటి వాటాయే దాదాపు 80 శాతం. అందుకే గతంలో ఈ రెండు దేశాలు అనేక ద్వైపాక్షిక అణ్వాయుధ నియంత్రణ ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. వాటిలో కీలకమైంది న్యూ స్టార్ట్. ఈ వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం గడువు గురువారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రెండు దేశాలు కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకుంటాయా, రద్దు చేసుకుంటాయా..అన్న చర్చ మధ్య మరో కీలక అంశం తెరపైకి వచ్చింది. అదే న్యూ స్టార్ట్‌లోకి చైనా కూడా చేరాలని ట్రంప్ చేస్తున్న ప్రతిపాదన. మరిందుకు డ్రాగన్ అంగీకరిస్తుందా..?

### రద్దా.. పొడిగింపా?

2021లో ఈ ఒప్పందం గడువు తీరే సమయంలో.. న్యూ స్టార్ట్ కొనసాగుతుందా, రద్దవుతుందా అనే విషయంలో పెద్ద చర్చ జరిగింది. ఇది రద్దైతే ప్రపంచవ్యాప్తంగా అణు పోటీ పెరుగుతుందన్న ఆందోళన నాడు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమైంది. పొడిగింపునకు రెండు దేశాలు అంగీకరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతమూ దాదాపు అదే పరిస్థితి. ఎందుకంటే ఒప్పంద పునరుద్ధరణపై ఇప్పటివరకు అటు అమెరికా నుంచి.. ఇటు రష్యా నుంచి ఎలాంటి సంకేతాలు వెలువడలేదు. అయితే న్యూ స్టార్ట్‌పై గతేడాది రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక వ్యాఖ్య చేశారు. మరో సంవత్సరం ఒప్పందం పొడిగించుకొవడానికి తమ దేశం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. దీనిపై అమెరికా స్పందించలేదు. దీంతో అనుమానాలు తలెత్తాయి.

### ట్రంప్ వ్యూహం

వెనెజువెలా, గ్రీన్‌లాండ్ అంశాల్లో వివాదాస్పదంగా వ్యవహరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు న్యూ స్టార్ట్ విషయంలోనూ తలదూర్చారు. ఈ ఒప్పందంపై ఇటీవల ఆయన 'న్యూయార్క్ టైమ్స్'తో మాట్లాడుతూ, 'న్యూ స్టార్ట్' స్థానంలో రష్యాతో కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. 'గడువు ముగిస్తే ముగిసిపోనీ.. మేమింకా మెరుగైన ఒప్పందాన్ని కుదుర్చుకుంటాం' అని పేర్కొన్నారు. దీంతో ప్రతిష్టంభన తొలగిపోయిందని అనుకున్నారంతా. అంతలోనే ట్రంప్ మళ్లీ ఓ బాంబు పేల్చారు. ఏ అణుచర్చలు జరిగినా అందులో చైనా భాగస్వామిగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ వ్యాఖ్యే ఇప్పుడు గుబులు రేపుతోంది. ఇందులోకి బీజింగ్‌ను లాగడం ద్వారా మొత్తం ఒప్పందాన్ని ట్రంప్ ఇరకాటంలో నెడుతున్నారని అంటున్నారు నిపుణులు.

### చైనా అంగీకరిస్తుందా..

అమెరికా, రష్యా అంత స్థాయిలో చైనా దగ్గర అణ్వాయుధాలు లేకపోయినా.. ఆ దేశమూ ఇటీవల దూకుడు పెంచింది. ఈ పరిణామం ట్రంప్ యంత్రాంగాన్ని కలవరపరుస్తోంది. అందుకే ద్వైపాక్షిక ఒప్పందంగా ఉన్న 'న్యూ స్టార్ట్'ను త్రైపాక్షికంగా మార్చాలని ట్రంప్ భావిస్తున్నారు. న్యూ స్టార్ట్‌లోకి చైనాను చేర్చడం ద్వారా ఆ దేశ అణ్వాయుధాలపై నియంత్రణ విధించాలన్నది ఆయన ప్రణాళిక.

ఈ పరిణామాలను బీజింగ్ కూడా గమనిస్తోంది. రష్యా, అమెరికా ఆయుధ నియంత్రణ ఒప్పందాల్లో తమ దేశం భాగస్వామి కాబోదని గతంలో చాలా సార్లు చైనా పేర్కొంది. ఇప్పుడూ అదే వైఖరితో ఉంది. అమెరికా, రష్యా మధ్య 'న్యూ స్టార్ట్' ఒప్పందం కుదరకపోతే ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధ పోటీ మొదలవుతుందని చైనాకు తెలుసు. ఆ సమయానికి తాను కూడా పూర్తి రేసులో ఉండేలా సన్నాహాలు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో న్యూ స్టార్ట్‌పై రానున్న రోజుల్లో ట్రంప్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది కీలకం కానుంది.

న్యూ స్టార్ట్ అంటే వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం. అమెరికా, రష్యాల మధ్య ప్రస్తుతం అమల్లో ఉన్న ఏకైక అణ్వాయుధ నియంత్రణ ఒప్పందమిదే. 2010లో దీనిపై నాటి అమెరికా, రష్యా అధ్యక్షులు బరాక్ ఒబామా, దిమిత్రి మెద్వెదెవ్ సంతకాలు చేశారు. ఇది అమల్లోకి వచ్చింది మాత్రం 2011లో. ఈ ఒప్పందంలో భాగంగా రెండు దేశాలు 1550కి మించి వార్ హెడ్లను మోహరించకూడదు. 700 క్షిపణులు, బాంబర్లకే పరిమితం కావాలి. 2021లో ఈ ఒప్పందాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ రెండు దేశాలు నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పుడు ఆ గడువు ముగియనుంది.

# కంచె నిర్మాణానికి భూమి కేటాయిస్తాం.. కానీ

## పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



**కోల్‌కతా, ఫిబ్రవరి 5 :** పశ్చిమ బెంగాల్లో బంగ్లాదేశ్‌తో సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం కోసం కేంద్రానికి భూమి ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని సీఎం మమతా బెనర్జీ తెలిపారు. అయితే.. రాష్ట్రంలో బీఎస్ఎఫ్ అధికార పరిధిని పెంచుతూ గతంలో ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రం ముందుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశంలో గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా మమత బెనర్జీ ఈమేరకు మాట్లాడారు. కంచె ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని కేంద్రం, బీజేపీ చేస్తున్న ఆరోపణలను ఖండించారు.

''దేశ భద్రతకు కట్టుబడి ఉన్నాం. కంచె విషయంలో భూమి అనేది సమస్య కాదు. అవసరమైనంత మేరకు కేటాయిస్తాం. కానీ, ముందుగా బీఎస్ఎఫ్ అధికార పరిధిని 15 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్లకు పెంచుతూ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని మార్చండి. రైల్వేల నుంచి రక్షణ వరకు అనేక కేంద్ర విభాగాలకు భూమి కేటాయింపు విషయంలో సహకరించాం. ఫెన్సింగ్ విషయంలో కేంద్రం కొన్ని వాస్తవాలనే ప్రజల ముందు ఉంచుతోంది. రాష్ట్రం ఇప్పటికే ఎంత భూమిని కేటాయించిందనే దానిపై కేంద్రమంత్రి అమిత్ షా ఎక్కడా వివరాలు వెల్లడించడం లేదు'' అని మమతా బెనర్జీ విమర్శించారు.

బెంగాల్లో చొరబాట్లనేవీ ముప్పుగా పరిణమించాయని, కంచె కోసం భూమి కోరుతూ కేంద్రం చాలాసార్లు లేఖలు రాసినప్పటికీ ఫలితం లేకపోయిందని ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఆరోపించారు. అయితే.. చొరబాట్లు, రోహింగ్యాల విషయంలో సాక్ష్యాలను చూపించాలని బీజేపీకి ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. పాలన విషయంలో తాను పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఫెన్సింగ్ కోసం ఇప్పటికే కేటాయించిన భూమిలో ముందుగా పనులు పూర్తి చేయాలని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అనేక సీట్లు కోల్పోతుందన్నారు.

## ద్విచక్ర వాహనాల ఢీ ఇద్దరి పరిస్థితి విషమం



**చింతలపాలెం, ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** చింతలపాలెం మండల పరిధిలోని చింతలపాలెం నుండి మేళ్లచెరువు వెళ్లే ప్రధాన రహదారిపై ఎదురు ఎదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇరువురికి గాయాలు పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలింపు గాయపడిన వారిలో ఒకరు వెల్లటూరు గ్రామానికి చెందిన దాసు సైదులు రెండో వ్యక్తి పీక్ల నాయక్ తండాకి చెందిన బానోత్ హరీష్ గా గుర్తింపు ఇద్దరిని వెంటనే స్థానికులు మేళ్లచెరువు హాస్పిటల్ కి తరలించారు.

## ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతు

**తిరుమలగిరి, ఫిబ్రవరి 05 (మనం న్యూస్):** ఫిబ్రవరి12వ తేదీన జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సి.పి.ఐ.(ఎం-ఎల్ )మాస్ లైన్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ౦దని, ఆ పార్టీ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ,ఫాసిస్టు నిరంకుశ పాలన నిరసిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని ఆ సమ్మెకు సి.పి.ఐ.(ఎం.ఎల్ )మాస్ లైన్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. ఈ సమ్మె కేవలం కార్మిక సంఘాల హక్కులకు సంబంధించినది మాత్రమే కాక, దేశ ప్రజలందరూ ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల కు పరిష్కారవేదిక కావాలని అన్నారు. రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోగా, కొత్త విత్తన చట్టం, నూతన విద్యుత్ బిల్ సవరణ చట్టాన్ని తేవడానికి




వ్యతిరేకంగా రైతులందరూ, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, వ్యవసాయ కార్మికుల పని హక్కును హరించి వేస్తున్న దానికి నిరసనగా వ్యవసాయ కార్మికులు, శాస్త్రీయ విద్య కావాలంటుంటే, విద్యను కాషాయీకరణ చేస్తున్నందుకు విద్యార్థులు, ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమైనందున నిరుద్యోగ యువకులు, మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న హత్యలు, హత్యాచారాలకు నిరసనగా మహిళలు, పౌష్టికాహారం అందించడంలో విఫలమైనందున పిల్లలు, మనువాద బ్రాహ్మణీయ భావజాలంతో రోజురోజుకు దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా దళితులు, సహజ సిద్ధంగా అడవిపై హక్కులు పొందుతున్న గిరిజనుల హక్కులను హరించే విధంగా చట్టాలను రూపొందిస్తూ, సహజ సంపదను అంబానీ ఆదానీలకు దోచిపెడుతున్నందుకు నిరసనగా గిరిజనులు, ఏ ప్రభుత్వ రంగం ఎప్పుడు ప్రైవేటు పరం అవుతుందో తెలియక, తమ ఉద్యోగం ఉంటుందో ఊడుతుందో తెలియక అడకత్తెర లో పోకలాగా మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులు, నెల నెల పెన్షన్ అందని పెన్షన్ దారులు, సమస్త రంగాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ ఈ సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమ్మెను మరొక స్వాతంత్ర్య సంగ్రామం లాగా పరిగణించి ఇంటికి ఇద్దరు ముగ్గురు చొప్పున సమ్మెలో పాల్గొని ఫాసిస్ట్ ప్రభుత్వం మెడలు వంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సంక్షేమ అభివృద్ధి పనులే కాంగ్రెస్ గెలిపిస్తుంది

**సూర్యాపేట, ఫిబ్రవరి 05 (మనం ప్రతినిధి):** ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాన్ని కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తుందని రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఐసీసీ రామ్ రెడ్డి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం. మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని 22వ 23వ వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమలో భాగంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ పటేల్ రమేష్ రెడ్డి పిఐసిసి సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్యతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ....22వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీమతి ఎలుగూరి అలివేలు చంటిబాబు ని 23వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీమతి వల్దస్ లక్ష్మీకి ఘన విజయం సాధింపజేయాలని పిలుపునిచ్చారు. ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలిచిన పార్టీ అని, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా పేదల సంక్షేమాన్ని



దృష్టిలో ఉంచుకొని అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ సౌకర్యాల విస్తరణ వంటి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనుల వేగం పెంచాలి



**తిరుమలగిరి, ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు చేపట్టిన చర్యలో భాగంగా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. గురువారం తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో 200 కోట్ల రూపాయలతో 20 ఎకరాలలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు సంబంధిత గుత్తేదారుకు భవన నిర్మాణ పనులు నాణ్యతతో ఎక్కడా రాజీ పడకుండా పనులు చేయాలని అవసరమైతే ఎక్కువమంది పని వారిని పెట్టి భవనాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, తహసిల్దార్ హరిప్రసాద్, ఎంపీడీవో లాజర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల లెక్కింపు కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**సూర్యాపేట, ఫిబ్రవరి 5 (మనం ప్రతినిధి):** జిల్లాలో ఈనెల 11వ తేదిన మున్సిపాలిటీలకు జరగనున్న రెండవ సాధారణ ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్ లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్స్, ఎన్నికల అనంతరం లెక్కింపుకు సంబంధించి లెక్కింపు కేంద్రాలను స్థానిక ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ లెక్కింపు కేంద్రాల భద్రత ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి నరసింహతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఎన్నికల లెక్కింపుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లెక్కింపుకు సంబంధించిన అన్ని రకాల సామాగ్రిలను మునుముందుగా సమకూర్చాలని లెక్కింపుకు వచ్చే ఉద్యోగులు అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్ల చేయాలని కోరారు. భద్రతపరంగా ముందస్తు జాగ్రత్తలు



తీసుకున్నామని ఎస్పీ తెలిపారు ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని కౌంటింగ్ జరిగే పరిసరాల చుట్టూ పౌరుల సంచారం నిషిద్ధ ఆజ్ఞలు జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నందు అదనపు కలెక్టర్ సీతారామరావు , సూర్యాపేట, కోదాడ ఆర్డీవోలు వేణుమాధవ్, సూర్యనారాయణ డిఎస్పీ ప్రసన్న కుమార్, మున్సిపల్ కమిషనర్ హనుమత్ రెడ్డి, సిఐ లు వెంకటయ్య, రాజశేఖర్, రామారావు, తహసీల్దార్ కృష్ణయ్య, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## పశుపోషకులు క్యాంపులను సద్వినియోగం

**కోదాడ, ఫిబ్రవరి 04(మనం న్యూస్):** పశుపోషకులు పశువుల క్యాంపును సద్వినియోగం చేసుకొని పాలు పశువుల ఉత్పత్తిని అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దొరకుంట సర్పంచ్ పాలక సురేష్ అన్నారు. మండల పరిధిలోని దొరకుంట గ్రామంలో పశుగణాభివృద్ధి ఆధ్వర్యంలో పశువులకు క్యాంపు నిర్వహించడం జరిగినది. ఈ క్యాంపుకు ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పాలక్ సురేష్, ఉప సర్పంచ్ పత్తిపాక రమాదేవి పాల్గొని క్యాంప్ ని ప్రారంభించారు. ఈ క్యాంపు కి కోదాడ మండల పశువైద్యాధికారి డాక్టర్ పెంటయ్య, డాక్టర్ మధు, కాపుగల్లు పశువైద్యాధికారి డాక్టర్ సురేందర్, వి ఎల్ వో అరుణ పాల్గొని పశువులకి క్యాంపు నిర్వహించడం జరిగినది. క్యాంపులో 50 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ మాదాస్ సైదులు, గోపాలమిత్రలు కళ్యాణి, ప్రసాద్, శెట్టి నాంచారయ్య, ఆదినారాయణ, గోపాలరావు, నజీర్, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి మండలంలో తొలి మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం

- వల్లంపల్లిలో ఘనంగా భూమి పూజ



**మేడిపల్లి ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** మేడిపల్లి మండల పరిధిలోని వల్లంపల్లి గ్రామ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. మండలంలోనే తొలిసారిగా మంజూరైన మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. భూమి పూజ అనంతరం మండల అభివృద్ధి అధికారి అంజుమ, మండల పంచాయతీ అధికారి నీరజ, సర్పంచ్ సట్ట భూమేష్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణ పనుల పురోగతి మరియు నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి అంజుమ మాట్లాడుతూ, ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకుని అన్ని నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా నాణ్యతలో లోపం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేపట్టాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోర్తి గోపి రమ్య, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ రాజ్ శాఖ సహాయ ఇంజనీర్ విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సమగ్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సమన్వయకర్త విద్యాసాగర్, మహిళా సంఘాల ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. మండలంలోనే వల్లంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న గ్రామ పాలకవర్గాన్ని ఈ సందర్భంగా అధికారులు అభినందించారు.



## అన్నారంలో సంఘ బంధం నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

**తుంగతుర్తి జనవరి 5,( మనం న్యూస్):** తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘ బంధం నూతన భవన నిర్మాణ పనులకు గురువారం గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాలను (ఎస్ హెచ్ జి )బలోపేతం చేసేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరైన పది లక్షల రూపాయల తో నిర్మించనున్న సంఘం నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. గ్రామంలో గ్రామ సమైఖ్యాలు ,మండల సమాఖ్యల సమావేశాలు, కార్యకలాపాల కోసం ఈ భవనాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరిత, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు సుకన్య, లావణ్య, బల్లెం ప్రవీణ్, జానకమ్మ,మాజీ వైస్ ఎంపీపీ దొంగరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చిత్తలూరి సోమశేఖర్, యాదగిరి, దేవదాసు, పోతరాజు, రాయుడు,నరేష్ భద్రయ్య, మహేష్, పంచాయతీరాజ్ డి ఈ లింగా నాయక్ ,ఏ ఈ మహేష్, పంచాయతీ సెక్రటరీ రమేష్ పాల్గొన్నారు.

## బేతవోలులో మెగా ఉచిత నేత్ర చికిత్స శిభిరం



**చిలుకూరు, ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** స్వర్ణ భారతీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఐ కంటి వైద్యశాల సూర్యపేట వారి సహకారంతో మండలంలోని బేతవోలు ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్య చికిత్స శిభిరంను ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిభిరంను గ్రామ సర్పంచ్ వట్టికూటి నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉచితంగా కంటి వైద్య శిభిరం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేయడం హర్షనీయం అన్నారు. వైద్య పరీక్షలలో ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఒరగంటి కిట్టు, ఉప సర్పంచ్ ఇట్టిమళ్ల ఏడుకొండలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామనర్సయ్య, స్వర్ణ భారతీ ట్రస్ట్ అధ్యక్షులు నీలా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చారుగండ్ల ప్రవీణ రాజశేఖర్, డాకర్టు, వైద్య సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రామ్ రెడ్డికి కన్నీటి వీడ్కోలు

**హైదరాబాద్:** హైదరాబాదులో అనారోగ్య కారణాలతో మృతి చెందిన టిడిపి మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి పార్థివ దేహానికి మంతినిలోని ఆయన స్వగృహంలో గురువారం రాష్ట్రమంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ ఎంపీ వెంకటేష్ నేత,మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్,బిజెపి నాయకులు,పుర ప్రముఖులు,వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మంథని నుంచి అంతిమయాత్ర ప్రారంభమై ముత్తారం మండలం సీతంపల్లి గ్రామంలోని



ఆయన వ్యవసాయ క్షేత్రానికి తీసుకవెళ్లిఅంత్యక్రియలు నిర్వహించారు.

## కష్టకాలంలో అండగా కట్లకుంట బీసీ సంక్షేమ సంఘం

**మేడిపల్లి ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** కట్లకుంట గ్రామంలో కొద్ది రోజుల క్రితం మరణించిన దూదేకుల మాసూమ్ భాయ్ కుటుంబ సభ్యులను కట్లకుంట బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పరామర్శించారు. సంఘం అధ్యక్షులు శ్రీపతి దామోదర్, వ్యవస్థాపక అధ్యక్షులు బెజ్జారపు అనిల్ కుమార్తో పాటు కార్యవర్గ సభ్యులు కట్ట రమేష్, మాదాసు రవిలు మృతుని కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబానికి బియ్యం బస్తా అందజేసి తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఈ



కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రముఖులు ఎలిగేటి అంజయ్య, వడ్ల పెద్ద రాజన్న, గాజోజీ హమంత చారి, శ్రీరాముల విజయ్, పిప్పెర అశోక్, మర్రిపెల్లి సత్తయ్య, సజ్జు తదితరులు పాల్గొన్నారు. అలాగే దూదేకుల సంఘం పెద్దమనుషులు మహమ్మద్, రహీం, నౌసిర్ మరియు ముస్లిం పెద్దమనుషులు మజీద్ తదితరులు హాజరై మృతుని కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఇలాంటి కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. కట్లకుంట బీసీ సంక్షేమ సంఘం ఎల్లప్పుడూ అవసరంలో ఉన్నవారికి తోడుగా ఉంటుందని తెలిపారు.

## పుష్కరాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- సమక్క సారలమ్మ జాతర, గోదావరి పుష్కరాల స్థలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**మంథని,ఫిబ్రవరి-05 (మనం న్యూస్):** పుష్కరాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అంతర్గాం మండలంలోని గోలివాడ, రామగుండం, గోదావరిఖని సమ్మక్క సారలమ్మ టెంపుల్, రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని లక్ష్మీ నరసింహా స్వామి టెంపుల్,మంథని గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర వద్ద రోజుకు 30 వేల భక్తులు వస్తారనే అంచనతో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర వద్ద 50 శాతం వరకు శాశ్వత పనులు పూర్తయ్యాయని, అక్కడ స్నానాల ఘాట,ఘాట్ నిర్మాణం పనులుఉన్నాయని, స్థలం ఏర్పాటు మొదలగు పనులు రోజుకు లక్ష భక్తులు వచ్చిన తట్టుకునేలా చేపట్టాలన్నారు. సుందిళ్ల గ్రామంలోని లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయం వద్ద రోడ్ల మరమ్మత్తు పనులు, బ్యారెజీ వద్ద రోడ్డు డబుల్ లైన్ చేయాలన్నారు. మంథని గౌతమేశ్వర ఆలయం వద్ద గోదావరి పుష్కరాల సమయంలో రోజుకు రెండు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని,ఇక్కడ సురబండేశ్వర్ స్వామి టెంపుల్ నుండి శివాలయం వరకు ఉన్న ఘాట్ వద్ద ఇన్ అండ్ ఔట్ ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ లు బి.గంగయ్య,సురేష్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ,ఇ.వై.టీం.తః రీ ఖాన్,జై దీప్,సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ప్రజలు అభివృద్ధికి భాగస్వాములు కావాలి



**మంథని, ఫిబ్రవరి05 (మనం న్యూస్):**మంథని పట్టణ ప్రజలు అభివృద్ధికి భాగస్వా ములు కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవ హారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కోరారు. గురువారం మంథని పట్టణంలోని 2వ, 3వ, 5వ, 6వ, వార్డులలో సంబంధించిన అంబేద్కర్ నగర్, ముత్యాలమ్మ వాడ, బోయినపేట, దుబ్బగూడెం, గొల్లగూడెం మమేకమై శ్రీధర్ బాబు ప్రజలతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులను 11 తేదీన చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకుని పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన అన్నారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డిపార్థివదేహానికి నివాళులర్పించిన శ్రీధర్ బాబు



**మంథని,ఫిబ్రవరి05 (మనంన్యూస్):** మంథని పట్టణంలోనికూరగాయల మార్కెట్ సమీపంలోని రాంరెడ్డి కాంప్లెక్స్ లో ప్రజల సందర్శనార్థం ఉంచిన మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి పార్థివదేహాన్నీ గురువారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల. శ్రీధర్ బాబు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడు రాౌరెడ్డి కుటుంబ సభ్యులు సునీల్ రెడ్డి, అనిల్ రెడ్డి,వారి కుటుంబ సభ్యులకు శ్రీధర్ బాబు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాంరెడ్డి గ్రామ సర్పంచిగా, ఎంపీపీగా, శాసనస భ్యునిగా, ఆయన మంథని నియోజకవర్గానికి ఎనలేని సేవ చేశారన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. శ్రీధర్ బాబు వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

# కాంగ్రెస్ రెండేళ్లలో మున్సిపాలిటీలకు ఇచ్చింది గాడిద గుడ్డే

- మున్సిపాలిటీలు బీజేపీకి అప్పగించండి. పన్నుల్లేకుండా ఢిల్లీ నుండి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తాం
- నాయిని చెరువును అద్భుతంగా తీర్చిదిద్దుతా
- జమ్మికుంటను కూరగాయల హబ్ గా మారుస్తా
- బీజేపీ అభ్యర్థులను గెలిపించి ఆశీర్వదించండి
- జమ్మికుంట ఎన్నికల బహిరంగ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్





**జమ్మికుంట, ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది గాడిద గుడ్డేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. పొరపాటున కాంగ్రెస్ ను గెలిపిస్తే ఇంటి పన్ను, నల్లా పన్ను, వ్యాపార పన్నుల పెంపు ఖాయమని అన్నారు. ఖజానా కోసం రోడ్డు మీద నడవాలంటే కూడా ట్యాక్స్ వేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నయాపైసా లేదని, బీజేపీకి మున్సిపాలిటీలను అప్పగిస్తే పన్నుల్లేకుండా ఢిల్లీ నుండి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో కేంద్రమంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... జమ్మికుంట పట్టణం ఏళ్ల తరబడి ఇలానే ఉందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ లను గెలిపిస్తే ఈ మున్సిపాలిటీ ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. వాళ్లు ఓట్లు వేయించుకున్నారే తప్ప నయాపైసా అభివృద్ధి చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ మీద కోపంతో కాంగ్రెస్ కు ఓట్లేసినా చిల్లిగవ్వ రాలేదని, మహిళలకు రూ.2500లు, తులం బంగారం, స్కూటీ ఇయ్యలేదు సరికదా... మీరు కన్పిస్తే మీ మెడలో ఉన్న బంగారం కూడా గుంజుకుపోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీని ఆదరిస్తే మేం వెంటనే ప్రధాని వద్దకు పోయి పంచాయతీలకు రూ.259 కోట్లు తీసుకురావడం జరిగిందని అన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో జమ్మికుంట మున్సిపాలిటీలో బీజేపీ గెలవకపోయినా పెద్ద ఎత్తున కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చినని 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా 8 కోట్ల 23 లక్షలు... అమృత్ ద్వారా 33 కోట్లు... స్వనిధి ద్వారా 4వేల 587 మందికి 8 కోట్ల 45 లక్షలు ఇచ్చామని అన్నారు. మొన్ననే ఖేలో ఇండియా ద్వారా సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం కోసం 6 కోట్ల 50 లక్షలు మంజూరు చేయించానని, ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే పిల్లలందరికీ ఉచితంగా సైకిళ్లు ఇవ్వడంతోపాటు పరీక్ష ఫీజు సైతం చెల్లించడం జరిగిందన్నారు. సీఎస్సార్, ఎంపీ లాడ్స్ నిధులతో కోట్ల రూపాయలు తీసుకొచ్చి జమ్మికుంట ఆసుపత్రికి రెండు కోట్లతో మెడికల్ ఎక్విప్ మెంట్స్ తీసుకొచ్చినని కానీ డాక్టర్లు, ఆశించిన సిబ్బంది మాత్రం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించిందని ఆరోపించారు. మున్సిపాలిటీలు ఈ రోజు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయంటే ప్రధానీ మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ నిధులతోనేనని గుర్తు చేశారు. బీజేపీకి చైర్మన్ పీఠం అప్పగించండి జమ్మికుంటలోని నాయిని చెరువు ను రిజర్వాయర్ చేసి బోటింగ్ (పడవ ప్రయాణం) ఏర్పాటు చేస్తా.. అహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అద్భుతంగా తీర్చిదిద్దే బాధ్యత నేను చూసుకుంటా. జమ్మికుంట ప్రజల ఆస్తులకు విలువ పెరిగేలా చేస్తానని చెప్పారు. జమ్మికుంట వ్యాపార కేంద్రమైనప్పటికీ కొంతమంది పట్టణంలో భూలక్ష్మి మహాలక్ష్మి (బొడ్రాయి) లేనందుకు వ్యాపారాలు దెబ్బతింటున్నాయని బాధపడుతున్నారు. మాకు మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని అప్పగిస్తే బొడ్రాయిని ఏర్పాటు చేసే బాధ్యత నాదేనని అన్నారు. జమ్మికుంట రైల్వే స్టేషన్ ను కరీంనగర్ మాదిరిగా అద్భుతంగా ఆధునీకరిస్తా. ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్ సహా అన్ని సదుపాయాలు కల్పిస్తా. జమ్మికుంట ను వ్యాపార, కూరగాయల హబ్ గా మారుస్తా. పట్టణంలో కిరాయికి ఉండి మరియు ఇల్లు లేకుండా నివాసం ఉంటున్న వారి ఇంట్లో మరణం సంభవిస్తే పెద్దకర్మ నిర్వహించే వరకు సముదాయం (గృహం) నిర్మించి కార్యక్రమాలు జరిపించేలా కృషి చేస్తా. జమ్మికుంట పట్టణంలోని అన్ని వార్డులలో ఇంటర్నల్ రోడ్లు నిర్మించి సీసీ కెమెరా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. లోతట్టు ప్రాంతాలలో(హౌసింగ్ బోర్డ్, అంబేద్కర్ కాలనీ, కృష్ణ కాలనీ ఏరియాలో) మురికి నీరు కాల్వ ప్రాబ్లం లేకుండా ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి చేస్తా. జమ్మికుంటను సుందర పట్టణంగా తీర్చిదిద్దుతానని అన్నారు. రెండేళ్లలో ఏమీ చేయని కాంగ్రెస్ నేతలు... మళ్లీ మోసపోయి ఓట్లేస్తే మీ బతుకులు బర్బాద్ అవుతాయి. కలిసికట్టుగా ఒక నిర్ణయం తీసుకుని నిధులు తీసుకొచ్చే బీజేపీకే మున్సిపాలిటీలు అప్పగించాలని కోరారు. మంచి పాలన కోసం ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని రెండు చేతులెత్తి మొక్కుతున్నా. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, ఎన్నికల ఇంఛార్జ్ ఎర్రం మహేశ్, బిజెపి సీనియర్ నాయకులు మున్సిపల్ పోటీలో ఉన్న అభ్యర్థులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిజెపిలకు ఎందుకు ఓటెయ్యాలి

- కెసిఆర్ చేసిన పనులే తప్ప.. కాంగ్రెస్, బిజెపి చేసింది ఏమీ లేదు
- ఆరు గ్యారెంటీలు అడుగుతున్నందునే నాపై కుట్రలు.. కేసులు
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**హుజురాబాద్, ఫిబ్రవరి 5 (మనం న్యూస్):** గ్రామాల్లో, పట్టణాల్లో నాడు ముఖ్యమంత్రిగా కెసిఆర్ చేసిన అభివృద్ధి పనులే తప్ప కాంగ్రెస్, బిజెపి చేసింది ఏమీ లేదని తట్టెడు మట్టి కూడా తీయలేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి లో 12, 14, 24 వార్డు లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు పట్టణ ప్రజలు ఘన స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. బిఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతినిత్యం తాను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చి మోసం చేసిన హామీలను ప్రశ్నిస్తున్నానని అందుకే తనపై కేసులు పెట్టారని మండిపడ్డారు. వీణవంకలో జాతరకు వెళితే తనను అడ్డుకున్నారని, పోలీసులు గౌరగౌర గుంజుకు వెళ్లారని.. తనను గుంజుకు వెళితే పరవాలేదని కానీ.. తన భార్య బిడ్డను ఎందుకు అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించారు. తన ప్రశ్నలకు జవాబులు చెప్పలేక తనను అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వానికి భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ బిజెపి అభ్యర్థులు ఓట్ల కోసం వస్తే వాళ్లని నిలదీయాలని కోరారు. గ్రామాల్లో పట్టణాల్లో ఇళ్ళ ముందు రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలన్నీ కేసీఆర్ హయాంలోని జరిగాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం కెసిఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు అన్ని నిలిపివేసిందని విమర్శించారు. కెసిఆర్ రైతుబంధు సమయానికి ఇచ్చారని, 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు భీమా, పింఛన్లు, కల్యాణ లక్ష్మి, కంటి వెలుగు, ప్రాజెక్టులు, తాగునీరు, సాగునీరు అన్ని అందించారని గుర్తు చేశారు. నేడు ఒక పథకాన్ని కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే అన్ని ఇస్తామంటూ హరిరాజు పాటలా నాడు చెప్పారని.. కానీ ఏ ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. పింఛన్లు పెంచలేదని, మహిళలకు రూ.2500 ఇస్తామని ఇవ్వలేదని, కంటి వెలుగు లేదని తులం బంగారం లేదని, విద్యార్థులకు స్కూటీలు ఇవ్వలేదని, ఫీజు రియంబర్స్మెంట్లు చెల్లించలేదని అన్నారు. బాకీ కార్డులను ఆయన ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం నాడు అన్ని చెప్పిందని కానీ నేడు ఒక్కటి కూడా అమలు చేయడం లేదని కాంగ్రెస్ అభ్యర్థులను ఈ విషయమై నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతులకు యూరియా ఇచ్చే పరిస్థితి కూడా లేదని, యూరియా కోసం జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి కాంగ్రెస్ హయాంలో దాపురించిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు డబ్బులు పట్టుకొని వస్తున్నారని వారి వద్ద డబ్బులు తీసుకొని కారు గుర్తుకు ఓటెయ్యాలని ఆయన పిలుపునిచ్చారు. ఇక్కడ తాను ఎమ్మెల్యేగా ఉన్నానని కానీ.. కౌన్సిలర్గా వేరే పార్టీ వారు గెలిస్తే వారు చేసేది ఏమీ ఉండదని.. కారు గుర్తు అభ్యర్థులను గెలిపించి తనకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే బలాన్ని ఇవ్వాలని ఆయన అన్నారు. బోర్నపల్లి నుండి ఇప్పల్ నర్సింగాపూర్ తను రోడ్డు ప్రతిపాదన పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఎప్పుడు ఏ అవసరమొచ్చినా తాను అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ కు ఓటు వేస్తే గోసపడతామని కెసిఆర్ అనడే చెప్పారని అనుకున్నదే జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బాకీ కార్డులను తాము ఇంటింటికి ఇస్తున్నామని.. కాంగ్రెస్ అభ్యర్థులు ఓట్లకు వస్తే బాకీల గురించి నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు.

## పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5(మనం ప్రతినిధి):** ఈ నెల 11 వ తేదీన మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య హై స్కూల్ లో ఏర్పాటు చేసిన పలు కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు. దివ్యాంగులకు ర్యాంప్, పోలింగ్ అధికారులు, సిబ్బందికి తాగునీరు, టాయిలెట్స్ అన్ని వసతులు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. టైమ్ టేబుల్ ప్రకారం చదవాలి... పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు టైమ్ టేబుల్ ప్రకారం చదవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కుసుమ రామయ్య హై స్కూల్ లో పదో తరగతి విద్యార్థులకు తరగతులు కొనసాగుతుండగా, ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. మొత్తం ఎందరు విద్యార్థులు చదువుతున్నారు? ఈ రోజు తరగతికి ఎందరు హాజరయ్యారో ఆరా తీశారు. విద్యార్థులు అందరూ తరగతికి వచ్చేలా ఉపాధ్యాయులు చూసుకో వాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. జీవశాస్త్రం టీచర్ బోధిస్తుండగా.. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థులతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని స్పష్టం చేశారు. అన్ని పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్ సిద్ధం చేసుకోవాలని, ఏ వారం ఏ సబ్జెక్ట్ చదవాలో ముందే రాసుకోవాలని, దానికి అనుగుణంగా అన్ని సబ్జెక్టులు చదవడం, రాయడం పూర్తి చేయాలని తెలిపారు. గత పదేండ్ల ప్రశ్నాపత్రాలు సాధన చేయాలని పేర్కొన్నారు. రాసిన సమాధానాలు ఒకసారి చెక్ చేసి ఎక్కడయినా లోపాలు, తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని, ప్రతి రోజూ స్టడీ హవర్ తో పాటుగా సెల్ఫ్ స్టడీ రోజు 3 నుంచి 4 గంటల పాటు చేయాలని సూచించారు. మార్చి 10వ తేదీ వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రాక్టీసు టెస్ట్ లు, రివిజన్ పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థు లందరూ రానున్న పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## బాల కుమారస్వామి జాతరలో పాల్గొన్న మంత్రి సీతక్క



**ములుగు, ఫిబ్రవరి 5, మనం ప్రతినిధిః** ములుగు మండలం అంకన్నగూడెం గ్రామంలో బాలకుమారస్వామి జాతర సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని ఆలయ మరమ్మతుల పనులకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సుమారు 5 లక్షల రూపాయలతో పనులకు శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ బాలకుమారస్వామి జాతరకు రావడం సంతోషంగా ఉందని గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు,సన్న బియ్యం, సీసీ రోడ్లు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని బాలకుమారస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి సీతక్క అన్నారుఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆయా ప్రాంతాల గ్రామ సర్పంచులు ఉప సర్పంచులు గ్రామస్థులు,మహిళలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా పోలీస్ బాస్‌ని సన్మానించిన సాంబశివరెడ్డి



**ములుగు, ఫిబ్రవరి 5, మనం ప్రతినిధిః** మేడారం మహా జాతర విజయవంతం కావడంలో పోలీసుల పాత్ర అభినందనీయమని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు గురువారం ఆయన ములుగు జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయంలో ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు ఈ సందర్భంగా సాంబశివరెడ్డి జిల్లా పోలీస్ బాస్ తో మాట్లాడుతూ మేడారం మహా జాతర విజయవంతం చేయడంలో గౌరవ మంత్రివర్యులు సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మరియు పోలీసు ఉన్నతాధికారుల సూచనలతో పోలీసులు విజయవంతంగా పనిచేశారని అన్నారు కోట్లాదిమంది భక్తులు హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు పోలీసుల సేవలు వెలకట్టలేనివని అన్నారు ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం జాతర నిర్వహణ ప్రజా ప్రభుత్వంలో విజయవంతమైనదని అన్నారు.

## ఎన్నిసార్లు రైతుబంధు వేసిండో సిఎం రేవంత్ రెడ్డి చెప్పాలి

- కేటీఆర్ డిమాండ్



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5(మనం న్యూస్):** మున్సిపల్ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుబంధు వేస్తానని చెబుతున్నారు, కానీ ఇప్పటికీ ఎన్ని పంట కాలాలు గడిచాయి? ఎన్నిసార్లు రైతుబంధు వేసిండో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేసారు. మున్సిపల్ ఎన్నికలు రైతుబంధు రైతన్నల ఖాతాలో వేయడానికి ముఖ్యమంత్రికి ఏ విధంగా అడ్డు వస్తున్నాయన్నారు. సిరిసిల్లలోగురువారంపట్టణ ప్రజల ను ఉద్దేశించి మాట్లాడారు కేవలం ఎన్నికలు అయిపోయేంత వరకు ఆశ చూపించి, మరొకసారి మోసం చేయడానికే రేవంత్ రెడ్డి ఈ మాట చెబుతున్నారని అన్నారు అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి కార్యక్రమాలను కూడా పక్కన పెట్టారని విమర్శించారు అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి అందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. కానీ మరోసారి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి కాంగ్రెస్కు ఓటు వేస్తే, మరొక్కసారి కాంగ్రెస్ ప్రజలను మోసం చేయడం ఖాయమన్నారు ముఖ్యమంత్రికి చేతిలో అధికారం, అవకాశం ఉన్నప్పుడు గత ముఖ్యమంత్రి కేసీఆర్ ను తిట్టవలసిన అవసరం ఏమున్నదని ప్రశ్నించారు చేతనైతే ప్రజలకు మంచి చేయాలి, ఇచ్చిన హామీలు అమలు చేయాలి. కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను తీసివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో జిల్లా కేంద్రాలను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ మాటలు చూసి ఓటు వేయాలన్నారు. జిల్లాలు ఎత్తివేస్తామని చెప్పిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అది మంచా, చెడ్డా అన్న విషయాన్ని గుర్తించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీని గనుక ఈ మున్సిపల్ ఎన్నికల్లో నిలదీయకుంటే, ఇచ్చిన హామీల మోసం పైన ప్రశ్నించకుంటే, మరో మూడు సంవత్సరాల దాకా శాసనసభ ఎన్నికల వరకు ప్రజలకి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే అధికారం, అవకాశం రాదన్నారు ఇప్పుడు గనుక రాష్ట్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక జారీ చేసేలా ఈ ఎన్నికల్లో ఓటు వేయకుండా, సురుకు పెట్టకుంటే కాంగ్రెస్ పార్టీ తన మోసాలను కొనసాగిస్తుందని కేటీఆర్ తెలిపారు.

## ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5(మనం ప్రతినిధి):** రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగాఅధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోనల్ ఆఫీసర్స్, ఆర్ఓలు, ఏఆర్ఓలు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా.. నిజాయితీగా ఎంతో జాగరూకతతో నిర్వర్తించాలని ఆదేశించారు. నియమ, నిబంధనల స్పష్టమైన అవగాహన ఉండాలని, ఎస్ ఈ సీ హ్యాండ్ బుక్ వెంట ఉండాలని సూచించారు. ఎస్ ఈసీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని వివరించారు. సిరిసిల్లలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన వాహనాల్లోనే వెళ్లాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రోజున అన్ని ఏర్పాట్లను సరి చూసుకోవాలని సూచించారు. ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకువెళ్ళి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వెల్లడించారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్, బ్యాలెట్ బాక్స్ లు చెక్ చేసుకొని తీసుకువెళ్లాలని ఆదేశించారు. గుర్తింపు కార్డు ఉన్న పోలింగ్ ఏజెంట్స్, ఎన్నికల అధికారులు మినహా ఎవరికీ అనుమతి లేదని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత సామగ్రి అంతా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సినారే కళామందిర్ లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించి అప్పగించాలని వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 7, 8 తేదీల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి కనీస వసతులు, భోజనం ఇతర సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు ఉన్నారు.



## మేడారం జాతర వివిఐపి రహదారిని పరిశీలించిన పీఎంఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ

**ములుగు, ఫిబ్రవరి 5, మనం ప్రతినిధిః** గురువారం ఎస్.ఎస్.తాడ్వాయి మండలం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు వివిఐపి వాహనాలు వచ్చే రహదారిని, వి వి ఐ పి వాహనాల పార్కింగ్ స్థలాన్ని, మేడారం తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని కె.ఎస్.శ్రీనివాసరాజు ఐఏఎస్ చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సి ఎం ఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.ఎస్.శ్రీనివాసరాజు అధికారులతో మాట్లాడుతూ జాతర సమయం లో వివిఐపి వాహనాలు వచ్చే మార్గం లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయో వాటి నివారణ చర్యలు ఏ విధంగా తీసుకోవాలనే అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2026 మహా జాతరలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని 2028 జాతరలో సమస్యలు పునరావృతం కాకుండా పకడ్బందీగా ప్రణాళికల సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే జాతరలో భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం ప్రభుత్వం ఇప్పటినుంచే ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తుందని జాతర విజయవంతం చేయడానికి కృషిచేసిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి, ఆర్టీసీ, పంచాయతీ రాజ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ నటి వాహిని కన్నుమూత



టాలీవుడ్ లో మరో విషాదం చోటుచేసుకుంది. తెలుగు బుల్లితెర మరియు వెండితెరపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి వాహిని కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్న ఆమె, బుధవారం తన స్వస్థలమైన విజయనగరంలో మరణించారు. ఆమె అసలు పేరు పద్మ కాగా, చిత్ర పరిశ్రమలో వాహినిగా ప్రసిద్ధి చెందారు. ఆమె మరణవార్తను తోటి నటి కరాటే కళ్యాణి సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించినప్పటికీ, వాహినికి టెలివిజన్ రంగం విశేషమైన గుర్తింపును ఇచ్చింది. ముఖ్యంగా సీరియల్స్ లో ఆమె పోషించిన నెగెటివ్ పాత్రలు ప్రేక్షకులకు బాగా గుర్తుండిపోయాయి. విలక్షణమైన నటనతో అలరించిన ఆమె, ఇటీవల విడుదలైన 'బహిర్భూమి' అనే చిత్రంలో కూడా కీలక పాత్రలో కనిపించారు.

వాహిని మృతి పట్ల టాలీవుడ్ ప్రముఖులు మరియు సీరియల్ నటీనటులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆమె మృతితో తెలుగు చిత్ర పరిశ్రమ ఒక మంచి నటిని కోల్పోయిందని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఆమెకు నివాళులు అర్పిస్తున్నారు.

# పాకిస్థానే వద్దనుకుంది..

## అయినా మేం కొలంబో వెళ్తాం : సూర్యకుమార్



టీ20 ప్రపంచ కప్ 2026 లో భారత్ తో తాము ఆడాల్సిన లీగ్ మ్యాచ్ ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం భారత్, పాక్ మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగాల్సి ఉంది. మ్యాచ్ ఆడకూడదని పాక్ తీసుకున్న నిర్ణయంపై భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తాజాగా స్పందించాడు. పాకిస్థాన్ మ్యాచ్ ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించినా భారత జట్టు కొలంబోకు వెళ్తుందన్నాడు. ''వారి (పాకిస్థాన్) నిర్ణయం నా నియంత్రణలో లేదని భావిస్తున్నాను. ఆడాలా? వద్దా? అనేది వారి ఇష్టం. ఆసియా కప్ లో మేం పాక్ తో మూడు మ్యాచ్ లు ఆడాం. మా మైండ్ సెట్ చాలా క్లియర్ గా ఉంది. పాకిస్థాన్ తో ఆడబోమని మేం చెప్పలేదు. వారే వద్దనుకున్నారు. మ్యాచ్ ను ఐసీసీ షెడ్యూల్ చేసింది. కొలంబో వెళ్లడానికి మాకు విమాన టికెట్లు కూడా బుక్ అయ్యాయి. ఫిబ్రవరి 7న యూఎస్ఏతో ఆడాల్సిన మ్యాచ్ పై మా ఫోకస్ ఉంది'' అని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నాడు.

టీ20 ప్రపంచ కప్ లో భారత్ తో తమ జట్టు మ్యాచ్ ఆడబోదని పాక్ ప్రధాని షెహబాజ్ వెల్లడించారు. ఇస్లామాబాద్ లో మంత్రివర్గాన్ని ఉద్దేశిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'మేం టీ20 వరల్ కప్ లో భారత్ తో మ్యాచ్ ఆడబోమనే విషయంలో చాలా క్లారిటీతో నిర్ణయం తీసుకున్నాం. క్రీడల్లో రాజకీయాలు ఉండకూడదు. మేం సరైన నిర్ణయమే తీసుకున్నాం'' అని అన్నారు. కానీ తమ జట్టు భారత్ తో ఆడకపోవడానికి గల కారణాలను ఆయన వెల్లడించలేదు.



## ఆసియా షూటింగ్.. మెరిసిన ఇషా



ఆసియా షూటింగ్ ఛాంపియన్ షిప్ లో హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ సత్తా చాటింది. బుధవారం ప్రారంభమైన ఈ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ లో పసిడి పతకం గెలిచిన ఇషా.. టీమ్ విభాగంలోనూ స్వర్ణాన్ని దక్కించుకుంది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో ఇషా (239.8) అగ్రస్థానంలో నిలిచింది. చైనీస్ తైపీ అమ్మాయిలు చెంగ్ యెన్ చెంగ్ (235.4) యూ అయ్ వెన్ (217.7) వరుసగా రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ ఏడో స్థానంలో నిలిచింది. మహిళల టీమ్ విభాగంలో సురుచి (576), ఇషా (575), మను (575)లతో కూడిన భారత జట్టు (1726) పసిడి కైవసం చేసుకుంది. వియత్నాం (1713) రజతం, చైనీస్ తైపీ (1711) కాంస్యం గెలిచాయి. పురుషుల 10 మీటర్ల పిస్టల్ లో సామ్రాట్ రాణా కాంస్యం నెగ్గాడు. ఫైనల్లో 220.3 పాయింట్లతో అతడు మూడో స్థానంలో నిలిచాడు. వెచ్నికోవ్ (ఉజ్బెకిస్థాన్, 242), రకీమ్ జాన్ (కజకిస్థాన్, 241) తొలి రెండు స్థానాలు సాధించారు. టీమ్ విభాగంలో సామ్రాట్ (581), శ్రవణ్ (578), వరుణ్ తోమర్ (573)లతో కూడిన భారత్ బృందం (1732) రెండో స్థానంలో నిలిచింది. ఉజ్బెకిస్థాన్ (1732) కూడా అన్నే పాయింట్లు సాధించినా.. మధ్య వృత్తానికి సమీపంగా ఎక్కువ పదులు స్కోరు చేయడంతో స్వర్ణాన్ని గెలుచుకుంది. కజకిస్థాన్ (1731) మూడో స్థానంలో నిలిచింది.

## తిరిగి మైదానంలోకి వస్తాననుకోలేదు : తిలక్

నవీ ముంబయి వేదికగా దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగిన టీ20 వరల్ కప్ వార్మప్ మ్యాచ్ లో టీమ్ఇండియా 30 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. శస్త్రచికిత్స తర్వాత తిలక్ వర్మ ఈ మ్యాచ్ ద్వారానే మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టాడు! కేవలం 19 బంతుల్లోనే 45 పరుగులు చేశాడు. ఇందులో 3 ఫోర్లు, 3 సిక్స్ లున్నాయి. టీమ్ఇండియాలోకి తన పునరాగమనం గురించి తిలక్ వర్మ మాట్లాడాడు. ఈ వీడియోను బీసీసీఐ తన సైట్ లో పోస్ట్ చేసింది. 'ఇంత త్వరగా తిరిగి మైదానంలోకి వస్తానని అనుకోలేదు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, బీసీసీఐకి కతజ్ఞతలు. వరల్ కప్ లో ఆడటం నా కల. నేను మైదానంలోకి అడుగు పెట్టినప్పుడు అందరూ నా పేరును నినదిస్తారని అసలు ఊహించుకోలేదు. అది బాగా నచ్చింది, చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ బ్యాటింగ్ ను చూసిన తర్వాత దూకుడుగా ఆడాలనుకున్నాను. కేవలం వార్మప్ మ్యాచ్ కు అంత మంది ప్రేక్షకులు వస్తారని ఊహించలేదు. కానీ ఆ ఉత్సాహం చాలా అద్భుతంగా ఉంది. ప్రతి ఒక్కరికీ కతజ్ఞతలు. ఈ రోజు వాతావరణం చాలా బాగుంది. తిలక్, ఇండియన్ టీమ్ వరల్ కప్ నకు సిద్ధం' అని తిలక్ వర్మ అన్నాడు. తిలక్ వర్మ 15 టీ20ల్లో మూడోస్థానంలో బ్యాటింగ్ కు దిగి 542 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలున్నాయి. ఆ రెండు శతకాలు కూడా దక్షిణాఫ్రికా గడ్డపై సఫారీల మీదే సాధించాడు.

# మార్చిలో పవన్ డబుల్ ట్రీట్..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో నటిస్తున్నాడు. ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ ను 2026, మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ఈ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో, హరీష్ శంకర్ పవన్ ను ఎంత పవర్ ఫుల్ గా చూపిస్తారో అని ఫ్యాన్స్ వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.



మరోవైపు, పవన్ కళ్యాణ్ నెక్స్ట్ ప్రాజెక్ట్ పై కూడా క్రేజీ అప్ డేట్ వచ్చేసింది. సుమారు ఐదేళ్ల క్రితం ప్రకటించిన డైరెక్టర్ సురేందర్ రెడ్డి సినిమా ఎట్టకేలకు పట్టాలెక్కనుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా లాంఛనంగా ప్రారంభం కానుంది. ఈ లెక్కన మార్చి నెల పవన్ ఫ్యాన్స్ కు డబుల్ ధమాకా అని చెప్పాలి. ఒకవైపు 'ఉస్తాద్' థియేటర్లలో సందడి చేస్తుండగానే, మరోవైపు కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం కావడం విశేషం.

ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాత రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. వక్కంతం వంశీ ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు. పాలిటిక్స్ లో బిజీగా ఉన్నప్పటికీ, పవన్ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతుండటంతో బాక్సాఫీస్ వద్ద పవర్ స్టార్ జాతర మొదలైనట్టే కనిపిస్తోంది.

# అలియా @ 'హౌస్‌వైఫ్'?



యాక్షన్, ప్రేమకథలతో వినోదాలు పంచడమే కాదు.. జీవితానికి దగ్గరగా ఉండే కథల్ని తెరపై ఆవిష్కరించి ప్రేక్షకులకు కనువిప్పు కలిగించే సినిమాలూ ఉంటాయి. ఇప్పుడలాంటి చిత్రంతో ఏడడుగుల బంధం గురించి తెలియజేయడానికి గృహిణిగా మన ముందుకు రాబోతుందట బాలీవుడ్ నాయిక అలియా భట్. ఆమె.. హిందీలో 'దృశ్యం 2'ని తెరకెక్కించిన అభిషేక్ పాఠక్ రూపొందిస్తోన్న 'హౌస్‌వైఫ్' అనే చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. వివాహమైన ఓ జంట చుట్టూ ఈ సినిమా ఉంటుందని సమాచారం. ''ప్రస్తుతం అభిషేక్ పాఠక్ 'దృశ్యం 3' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. అది పూర్తయిన తర్వాత ఆగస్టులో 'హౌస్ వైఫ్'ను పట్టాలెక్కించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో అలియా కథానాయికగా నటించడమే కాకుండా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించనుంది. ఈ రిలేషన్ షిప్ డ్రామాలో మరో కీలక పాత్ర కోసం రాజ్ కుమార్ రావ్ తో చర్చలు చేస్తోంది చిత్రబృందం. త్వరలో ఈ ప్రాజెక్టు గురించి అధికారికంగా వెల్లడించనున్నార''ని అలియా సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'లవ్ అండ్ వార్', 'ఆల్ఫా' చిత్రాలు ఉన్నాయి.



# డైలమాలో 'లెనిన్'

అక్కినేని యంగ్ హీరో అఖిల్ తన కెరీర్ లో ఎలాగైనా భారీ హిట్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. ప్రస్తుతం ఆయన మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో 'లెనిన్' అనే మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ లో నటిస్తున్నాడు. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ కథలో అఖిల్ చిత్తూరు యాసలో డైలాగులు చెప్పబోతున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్కు మంచి రెస్పాన్స్ రావడంతో, ఈ చిత్రాన్ని మే 1, 2026న విడుదల చేస్తామని మేకర్స్ గతంలోనే ప్రకటించారు.

అయితే, తాజా పరిణామాలు చూస్తుంటే 'లెనిన్' విడుదల తేదీ మారే అవకాశం కనిపిస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'పెద్ది'ని ఏప్రిల్ 30, 2026న విడుదల చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. చరణ్ సినిమాకు కేవలం ఒక్కరోజు గ్యాప్ లో అఖిల్ సినిమా రావడం బాక్సాఫీస్ వద్ద రిస్క్ అవుతుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. 'పెద్ది' వంటి భారీ ప్రాజెక్టుతో పోటీ పడితే థియేటర్ల లభ్యత, ఓపెనింగ్స్ పై ప్రభావం పడే అవకాశం ఉండటంతో, లెనిన్ మేకర్స్ తమ సినిమాను వాయిదా వేయాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం.

ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తుండగా, సీనియర్ నటుడు శివాజీ ఒక కీలక పాత్రలో కనిపిస్తున్నాడు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్ టైన్ మెంట్స్ మరియు అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరి ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంపై మేకర్స్ నుంచి క్లారిటీ ఎప్పుడు వస్తుందో చూడాలి.



# చైతూ మళ్ళీ ప్రేమ కథతో వస్తాడా?

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం సెలెక్టివ్ గా సినిమాలు చేస్తున్నాడు. 'విరూపాక్ష' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దర్శకుడు కార్తీక్ దండు దర్శకత్వంలో చైతన్య తన 24వ చిత్రం 'వృషకర్మ'లో నటిస్తున్నాడు. భారీ బడ్జెట్ తో మిస్టిక్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. సుకుమార్ రైటింగ్స్ మరియు ఖిఇఇ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో చైతూ మునుపెన్నడూ చూడని సరికొత్త మాస్ మరియు రఫ్ లుక్ లో కనిపించనున్నాడు.

'వృషకర్మ' సెట్స్ పై ఉండగానే, నాగచైతన్య తన కెరీర్ లో మైలురాయి వంటి 25వ సినిమా కోసం సన్నాహాలు మొదలుపెట్టాడు. తాజా సమాచారం ప్రకారం, ఈ స్పెషల్ ప్రాజెక్ట్ కోసం ఆయన మళ్లీ తనకు అచ్చొచ్చిన ప్రేమకథ వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో 'ఏ మాయ చేసావె', 'మజిలీ', 'లవ్ స్టోరీ' వంటి చిత్రాలతో క్లాస్ ఆడియన్స్ కు దగ్గరైన చైతన్య, తన సిల్వర్ జూబ్లీ సినిమాను కూడా ఒక అందమైన ప్రేమకావ్యంగా మలచాలని భావిస్తున్నాడు. ఇటీవల విడుదలైన 'తండేల్' చిత్రం ఆయన కెరీర్ లో బిగ్గెస్ట్ గ్రాసర్ గా నిలవడమే కాకుండా, అందులోని రొమాంటిక్ ట్రాక్ కు మంచి గుర్తింపు రావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఈ 25వ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 'మజిలీ'తో చైతన్యకు కెరీర్ బెస్ట్ హిట్ ఇచ్చిన శివ నిర్వాణ లేదా 'బెదురులంక 2012' ఫేమ్ క్లాక్స్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. 'వృషకర్మ' వంటి ప్రయోగాత్మక చిత్రం తర్వాత ఒక స్వచ్ఛమైన ప్రేమకథతో ప్రేక్షకులను పలకరించడం వల్ల కెరీర్ బ్యాలెన్స్డ్ గా ఉంటుందని చైతూ ప్లాన్ చేస్తున్నాడు. ఒకవేళ 'వృషకర్మ' భారీ విజయాన్ని అందుకుంటే, నాగచైతన్య మార్కెట్ స్టామినా మరింత పెరిగి, ఆయన 25వ చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయం.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.